

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మంగళవారం | 31-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 273 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి తె. 3.21 తదుపరి విదియ; నక్షత్రం: పూర్వాషాఢ రా. 12.04 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ.9.35-11.12; దుర్ముహూర్తం: ఉ.9.00-9.44, రా.10.04-10.54; అమృతఘడియలు: రా.7.14-8.51; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 5.47 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





ఐసీసీ అవార్డుల రేసులో బుమ్రా

దుబాయ్: అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో అదరగొడుతున్న భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ ఏడాది ఐసీసీ ఉత్తమ క్రికెటర్ అవార్డుకు నామినేట్ అయ్యాడు. అలాగే టెస్ట్ క్రికెట్‌లో ఉత్తమ ఆటగాడి పురస్కారానికీ అతడు పోటీపడుతున్నాడు. బుమ్రాతోపాటు ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్, ఆ దేశానికే చెందిన యువ ఆటగాడు హ్యారీ బ్రూక్, ఆస్ట్రేలియా హార్డ్ హిట్టర్ ట్రావిస్ హెడ్ 'క్రికెట్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో నిలిచారు. ఇక..బుమ్రా, శ్రీలంక ఆల్‌రౌండర్ కమిందు మెండిస్, రూట్, బ్రూక్ ఐసీసీ టెస్ట్ క్రికెటర్ అవార్డు రేసులో పోటీపడుతున్నారు. ఇంకా భారత్ నుంచి మంధాన (మహిళల వన్డేలు), అర్ష్‌దీప్ సింగ్ (పురుషుల టీ20లు), శ్రేయాంక పాటిల్ (వర్ధమాన క్రికెటర్) కూడా ఐసీసీ పురస్కారాలకు నామినేట్ అయ్యారు.

డబ్ల్యూటీసీలో టీమిండియా పరిస్థితేంటి?


కోహ్లీ (5)

నాలుగో టెస్టులో ఓటమితో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్‌ను టీమిండియా అత్యంత సంక్లిష్టం చేసుకుంది. ఇప్పటికే సౌతాఫ్రికా ఫైనల్‌కు వెళ్లగా ఆసీస్ 61.46 విజయాల శాతంతో రెండో స్థానంలో ఉంది. భారత్ 52.78తో మూడో స్థానంలో ఉండగా మిగిలిన సిడ్నీ టెస్టును కచ్చితంగా నెగ్గాల్సిందే. ఆ తర్వాత శ్రీలంక జట్టు ఆసీస్‌పై 2-0తో గెలిస్తేనే రోహిత్ సేనకు అవకాశముంటుంది.

న్యూజిలాండ్‌దే సిరీస్

మౌంట్‌మాంగనూయ్: శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌ను న్యూజిలాండ్ మరో మ్యాచ్ ఉండగానే సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన రెండో టీ20లో ఆతిథ్య జట్టు 45 పరుగులతో నెగ్గింది. మొదట న్యూజిలాండ్ 20 ఓవర్లలో 186/5 స్కోరు చేసింది. చాప్‌మన్ (42), రాబిన్సన్ (41), మిచెల్ హే (41 నాటౌట్) సత్తా చాటారు. హసరంగ (2/28) రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. కుశాల్ పెరీరా (48), నిస్సాంక (37) మాత్రమే రాణించారు. డఫీ నాలుగు (4/15), శాంట్నర్ (2/22), మ్యాట్ హెన్రీ (2/31) చెరో రెండు వికెట్లు తీశారు.

ఆరేపల్లి ముప్పాళ్లలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ఈపూరు: ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లలో జనవరి 12 నుంచి 17వరకు రైతుమిత్ర 33వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు జరుగనున్నాయి. పోటీలలో దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన సుమారు 40 జట్లు పాల్గొనే అవకాశముందని కమిటీ సభ్యులు తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి కల్పించనున్నారు. విజేత జట్టుకు రూ.3 లక్షలు, రన్నరప్‌కు రూ.2 లక్షలు, మూడోస్థానం జట్టుకు రూ. లక్ష అందజేయనున్నారు. అలాగే 4నుంచి 12 స్థానాలు సాధించిన ప్రతి జట్టుకూ నగదు బహుమతి అందిస్తారు. ఇంకా ఉత్తమ రైడర్, ఉత్తమ డిఫెండర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది టోర్నీ అవార్డులు ఇవ్వనున్నారు. ఇతర వివరాలు, పేర్ల నమోదు కోసం 9981922533, 9966671306 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కవిటీ సభ్యుడు తల్లపనేని రామారావు తెలిపారు.

కంగారూ 'పంచ్'



కాస్త గట్టిగానే!

- 184 రన్స్ తేడాతో భారత్ పరాజయం
- రెండో ఇన్నింగ్స్ 155
- జైస్వాల్ ఒంటరి పోరాటం
- బాక్సింగ్ డే టెస్టు

లక్ష్యం 340 పరుగులు.. 92 ఓవర్లు.. 11 మంది ఆటగాళ్లు. ఇదీ ఆఖరిరోజు సోమవారం భారత్ ముందున్న పరిస్థితి. ఈ స్థితిలో విజయమో.. లేదంటే డ్రా కోసమో జట్టు ఆడుతుందని అంతా ఆశించారు. కానీ మెల్‌బోర్న్ మైదానంలో జరిగింది వేరు. ముందురోజు ఆసీస్ టెయిలెండర్లు చూపిన తెగువ కూడా భారత బ్యాటర్లలో కనిపించలేదు. జైస్వాల్, పంత్ మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగా, అండగా నిలవాల్సిన రోహిత్, విరాట్ సహా అంతా విఫలమయ్యారు. 34 రన్స్‌కే చివరి 7 వికెట్లను పడగొట్టి ఆసీస్ బౌలర్లు తమ జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు.

మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ బాక్సింగ్ డే టెస్టులో భారత జట్టుకు ఘోరపరాభవం ఎదురైంది. సోమవారం ముగిసిన ఈ మ్యాచ్‌లో రోహిత్ సేన ఏకంగా 184 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ఫలితంగా ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు సిరీస్‌లో 2-1తో ఆధిక్యం సాధించింది. ఆఖరిదైన సిడ్నీ టెస్టు జనవరి 3 నుంచి జరుగుతుంది. 340 పరుగుల ఛేదనలో ఆఖరి రోజు బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 155 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (84), పంత్ (30) నాలుగో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. వీరిద్దరు మినహా మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కమిన్స్ బోలాండ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. లియోన్ 2 వికెట్లు తీశాడు. అంతకుముందు ఆసీస్ ఆఖరి రోజు పది బంతులే ఆడి రెండో ఇన్నింగ్స్‌ను 234 పరుగుల వద్ద ముగించింది. బుమ్రాకు 5, సిరాజ్‌కు 3 వికెట్లు లభించాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474, భారత్ 369 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

జైస్వాల్-పంత్ మినహా..: భారీ ఛేదనలో మూడు సెషన్ల ఆట ఉండడంతో డ్రా కోసమైనా భారత ఆటగాళ్లు పోరాడతారనిపించింది. కానీ జైస్వాల్-పంత్ భాగస్వామ్యం మినహా చెప్పుకోవడానికేమీ లేకపోయింది. ఆరంభంలో క్రీజులో ఉన్నంతసేపు కెప్టెన్ రోహిత్ (9) చక్కటి డిఫెన్స్‌ను ప్రదర్శించాడు. కానీ 17వ ఓవర్‌లో కమిన్స్ డబుల్ ఝలక్ ఇచ్చాడు. అతడి ఫుల్లర్ బాల్‌ను ఫ్లిక్ చేయబోయిన రోహిత్ గల్లీలో వికెట్‌ను సమర్పించుకోగా, రాహుల్ ఓ అద్భుత బంతికి డకౌటయ్యాడు. ఇక అండగా నిలుస్తాడనుకున్న విరాట్ కోహ్లీ (5) లంచ్ బ్రేక్‌కు ముందు మరోసారి ఆఫ్‌సైడ్ ఆవల బంతిని ఆడి పెవిలియన్ చేరాడు. దీంతో 33/3 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. కానీ రెండో సెషన్‌ను జైస్వాల్-పంత్ జోడీ జాగ్రత్తగా ఆడి వికెట్‌ను కోల్పోకుండా ముగించింది. వీరిద్దరు ఆసీస్‌ను దీటుగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పంత్ ఓపికగా క్రీజులో పాతుకుపోయాడు. తన సహజశైలిని పక్కనబెట్టి వికెట్ కాపాడుకునే ప్రయత్నం చేశాడు. అటు జైస్వాల్ అర్ధసెంచరీని పూర్తి చేసుకోవడంతో ఈ సెషన్‌ను జట్టు 112/3తో ముగించింది.

పేకమేడలా..: రెండు సెషన్ల ఆటను చూస్తే భారత్ ఫర్వాలేదనే స్థితిలో కనిపించింది. ఆఖరి సెషన్‌లో మరో 38 ఓవర్ల ఆట మిగిలి ఉండగా చేతిలో 7 వికెట్లున్నాయి. ఈ దశలో డ్రా ఖాయమనిపించింది. కానీ ఇలాంటి కీలక స్థితిలో పంత్ నిర్లక్ష్యపు షాట్ కొంపముంచింది. హెడ్ ఓవర్‌లో భారీ షాట్ ఆడిన పంత్ బౌండరీ లైన్ వద్ద మార్ష్‌కు చిక్కాడు. అంతే.. ఈ వికెట్ తర్వాత ఆసీస్ బౌలర్లు ఒకరి తర్వాత మరొకరిని పెవిలియన్‌కు క్యూ కట్టించారు. ఓవైపు సుందర్ (5 నాటౌట్) ఓపిగ్గా ఆడినా చివర్లో అతడికి సహకారం కరువైంది.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474; భారత్ తొలి ఇన్నింగ్స్: 369; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 234.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) క్యారీ (బి) కమిన్స్ 84; రోహిత్ (సి) మార్ష్ (బి) కమిన్స్ 9; రాహుల్ (సి) ఖవాజా (బి) కమిన్స్ 0; విరాట్ (సి) ఖవాజా (బి) స్టార్క్ 5; పంత్ (సి) మార్ష్ (బి) హెడ్ 30; జడేజా (సి) క్యారీ (బి) బోలాండ్ 2; నితీశ్ (సి) స్మిత్ (బి) లియోన్ 1; సుందర్ (నాటౌట్) 5; ఆకాశ్ (సి) హెడ్ (బి) బోలాండ్ 7; బుమ్రా (సి) స్మిత్ (బి) బోలాండ్ 0; సిరాజ్ (ఎల్బీ) లియోన్ 0; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 79.1 ఓవర్లలో 155 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-25, 2-25, 3-33, 4-121, 5-127, 6-130, 7-140, 8-150, 9-154, 10-155. **బౌలింగ్:** స్టార్క్ 16-8-25-1; కమిన్స్ 18-5-28-3; బోలాండ్ 16-7-39-3; మార్ష్ 3-2-2-0; లియోన్ 20.1-6-37-2; హెడ్ 5-0-14-1; లబుషేన్ 1-1-0-0.


రోహిత్ (9)

రోహిత్‌కు సమయం వచ్చేసింది

మెల్‌బోర్న్: టెస్టులనుంచి రోహిత్ రిటైర్మెంట్ తీసుకుంటే మంచిదని భారత మాజీ కోచ్ రవిశాస్త్రి సూచించాడు. 'టెస్టుల్లో సుదీర్ఘ కాలంగా రోహిత్ భారీ స్కోర్లు చేయలేకపోతున్నాడు. పైగా ఈ ఫార్మాట్‌లో రోహిత్ టెక్నిక్‌కూడా బాగా లేదు. అతడి పాదాల కదలిక వేగంగా లేదు. బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేస్తున్నాడు. వీటన్నింటి రీత్యా ఈ సిరీస్ తర్వాత అతను రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకోవడం ఉత్తమం' అని శాస్త్రి అభిప్రాయపడ్డాడు.

కోహ్లీ మరో మూడేళ్లు ఆడతాడు: కోహ్లీలో మరో మూడు, నాలుగేళ్లు ఆడే సత్తా ఉందని రవి శాస్త్రి చెప్పాడు. 'విరాట్ ఎలా అవుటయ్యాడన్నది వదిలేయండి. కానీ అతడిలో ఇంకొంత కాలం క్రికెట్ ఆడే సామర్థ్యం ఉంది' అని చెప్పుకొచ్చాడు.

ఆ ఇద్దరి వల్లే..: సీనియర్లు రోహిత్, విరాట్ వైఫల్యమే బాక్సింగ్ డే టెస్టు ఓటమికి కారణమని సునీల్ గవాస్కర్ దుయ్యబట్టాడు. 'మ్యాచ్‌ను కాపాడుకోవాలంటే టాపార్డర్ బ్యాటర్లు చివరి రోజంతా ఆడాలి. కానీ వారు రాణించలేదు. టాపార్డర్ వైఫల్యంవల్లే నాలుగో టెస్టులో భారత్ ఓడింది' అని గవాస్కర్ స్పష్టంజేశాడు.

ఓటమి వేధిస్తోంది

ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నాం. ఓటమి మానసికంగా వేధిస్తోంది. ఆఖరిదాకా పోరాడాలని భావించినా లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. ఆసీస్‌ను 90/6తో కట్టడి చేసినా ఆ తర్వాత పట్టు కోల్పోయాం. ఇక చివరి రోజు 340 పరుగుల ఛేదన సులువు కాదని తెలుసు. మా ప్రణాళికలు ఫలించలేదు. పంత్ కీలక సమయంలో అవుటయ్యాడు. ఆ వికెట్ పడ్డాక మా పరిస్థితి దిగజారింది. కానీ అతడు ఆడిన తీరును తప్పుపట్టలేం. ఎన్నో సమయాల్లో అతను జట్టుకు విజయాలందించాడు. కానీ తన నుంచి జట్టుకు ఏం కావాలో కూడా పంత్ అర్థం చేసుకోవాలి. బుమ్రాకు ఇతర బౌలర్ల నుంచి సహకారం అందడం లేదు.
- రోహిత్ శర్మ

నీ పనేంటో చూస్కో..

భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ జైస్వాల్, ఆసీస్ ప్లేయర్ కాన్‌స్టాస్ మధ్య వాగ్వాదం జరిగింది. సిల్లీ పాయింట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కాన్‌స్టాస్ అదేపనిగా అరుస్తూ జైస్వాల్ ఏకాగ్రతను దెబ్బతీసేందుకు చూశాడు. దీంతో 'నీ పనేంటో ముందు చూస్కో.. ఎందుకు మాట్లాడుతున్నావ్' అని జైస్వాల్ సీరియస్ అయ్యాడు. అంతేకాకుండా ఆ తర్వాత తాను ఎదుర్కొన్న బంతిని బలంగా అతడి వైపే బాది పగ తీర్చుకున్నాడు.

జైస్వాల్ అవుటా? నాటౌటా?


జైస్వాల్ (84)

భారత్ ఛేదనలో అత్యంత కీలక సమయంలో జైస్వాల్ నిష్క్రమణ వివాదాస్పదంగా మారింది. ఇన్నింగ్స్ 71వ ఓవర్‌లో కమిన్స్ వేసిన బంతిని లెగ్ సైడ్ ఆడేందుకు జైస్వాల్ ప్రయత్నించాడు. కానీ ఈక్రమంలో బంతి వెళ్లి కీపర్ క్యారీ చేతుల్లో పడింది. అటు ఆసీస్ క్యాచ్ అవుట్ కోసం అప్పీల్ చేయగా, అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. వెంటనే కమిన్స్ డీఆర్ఎస్ కోరడంతో రీప్లేలో బంతి బ్యాట్‌కు, గ్లౌవ్స్‌కు తాకినట్టు స్నికోమీటర్‌లో ఎక్కడా స్పైక్స్ కనిపించలేదు. కానీ ఆ బంతి ప్రయాణిస్తున్న మార్గంలో మార్పును గమనించి థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రకటించడంతో భారత శిబిరం షాక్‌కు గురైంది. వాస్తవానికి టెక్నాలజీని వాడుతున్నప్పుడు దానికే కట్టుబడి ఉండాలి. కానీ బంగ్లాదేశ్‌కు చెందిన థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా మాత్రం.. బంతి జైస్వాల్ గ్లౌవ్స్‌కు తాకినట్టుగా కనిపిస్తుందంటూ అవుట్ ప్రకటించాడు.



హష్మతుల్లా ద్విశతకం

అఫ్ఘాన్‌తో జింబాబ్వే టెస్టు డ్రా

బులవాయో: భారీ స్కోర్లతో హోరెత్తిన జింబాబ్వే-అఫ్ఘానిస్థాన్ మధ్య తొలి టెస్టు డ్రాగా ముగిసింది. అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌లో రెండు డబుల్ సెంచరీలు నమోదు కావడం విశేషం. మూడో రోజు ఆటలో రహ్మత్ షా (234) ఈ ఫీట్ సాధించగా.. ఆఖరి రోజైన సోమవారం కెప్టెన్ హష్మతుల్లా షాహిది (246) కూడా ద్విశతకంతో ఆకట్టుకున్నాడు. దీంతో అఫ్ఘాన్ తొలి ఇన్నింగ్స్‌లో 699 పరుగుల భారీ స్కోరు సాధించింది. టెస్టుల్లో ఈ జట్టుకిదే అత్యధిక స్కోరు. అఫ్సర్ జజాయ్ (113) శతకం బాదాడు. నాలుగో వికెట్‌కు షాహిది-అఫ్సర్ 211 రన్స్ జోడించారు. అయితే 20 పరుగుల వ్యవధిలోనే చివరి ఆరు వికెట్లు నేలకూలాయి. ఆ తర్వాత 113 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే 142/4 స్కోరు సాధించింది. ఆటకు మరో గంట సమయం ఉండగా ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 586 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

ఆర్థిక స్థిరత్వానికే ప్రాధాన్యత

- గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ
- కంపెనీల బ్యాలెన్స్ షీట్లు భేష్
- ధరల సెగ తగ్గుతుంది
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



ముంబై: కీలక వడ్డీ రేట్లు తగ్గించాలని ఎవరెంత అరిచి గీపెట్టినా, తమ వైఖరి మారదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరోసారి స్పష్టం చేసింది. దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని తేల్చి చెప్పింది. తాజాగా విడుదల చేసిన డిసెంబరు-24 సంచికలో 'ఆర్థిక స్థిరత్వ నివేదిక'కు రాసిన ముందు మాటలో ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. వృద్ధి రేటును పక్కన పెట్టి ద్రవ్యోల్బణ కట్టడిపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్లే సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి పడిపోయిందని ఇటీవల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఈ విషయం స్పష్టం చేయడం విశేషం.

కోలుకుంటోంది..: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లో మన జీడీపీ వృద్ధి రేటు 6 శాతానికి పడిపోయింది. సెప్టెంబరు త్రైమాసికంలో అయితే ఏడు నెలల కనిష్ఠ స్థాయి 5.4 శాతాన్ని తాకింది. అయితే అంతర్జాతీయంగా కొన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నా ఈ ఏడాది అక్టోబరు నుంచి మన ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిలో పడిందని మల్హోత్రా పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఆర్థిక భవిష్యత్‌పై వ్యాపార సంస్థలు, వినియోగదారుల నమ్మకం పెరగడం ఇందుకు ప్రధాన కారణమన్నారు. కంపెనీల లాభాలు పెరగడంతో పెట్టుబడులూ గాడిన పడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కొన్ని సమస్యలు ఉన్నా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కూడా ప్రస్తుతం ఆశాజనకంగానే కనిపిస్తోందని తెలిపారు.

తగ్గిన ఎన్‌పీఏల భారం: దేశ బ్యాంకింగ్ రంగం ఆర్థిక స్థితి గతులు మరింత మెరుగుపడ్డాయని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి దేశంలోని 37 వాణిజ్య బ్యాంకుల మొత్తం రుణాల్లో స్థూల మొండి బకాయి (జీఎన్‌పీఏ)ల వాటా 12 ఏళ్ల కనిష్ఠ స్థాయి 2.6 శాతానికి పడిపోయిందని పేర్కొంది. ఇందులో టాప్-100 బడా బాబుల వాటా 34.6 శాతమని తెలిపింది. నికర ఎన్‌పీఏల భారమైతే ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు నాటికి 0.6 శాతానికి పడిపోయింది. పరపతి డిమాండ్ పెరగడం, రుణ వసూళ్లు పెరగడం ఇందుకు ప్రధాన కారణమని స్పష్టం చేసింది. అయితే బ్యాంకింగ్ వ్యవస్థలో ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంకుల్లో రుణాల కొట్టివేతలు (రైటాఫ్) పెరిగి పోవడంపై మాత్రం ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది.

నిష్క్రియా ఖాతాలపై జాగ్రత్త: దేశ బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలపైనా ఆర్‌బీఐ ఆర్థిక స్థిరత్వ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేటుగాళ్లకు చెక్ పెట్టేందుకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు నిష్క్రియా (మ్యూల్) ఖాతాలపై ఒక కన్నేసి ఉంచాలని కోరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే దేశ బ్యాంకింగ్ రంగంలో 18,461 సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఈ నేరాల ద్వారా సైబర్ నేరస్థులు బ్యాంకు ఖాతాదారుల నుంచి రూ.21,367 కోట్లు కొట్టేశారు.

గత ఏడాది ఇదే కాలంలో కొట్టేసిన రూ.2,623 కోట్లతో పోలిస్తే ఇది ఎనిమిదింతలు ఎక్కువని ఆర్‌బీఐ తెలిపింది. ఖాతాదారులు వీరి బారిన పడకుండా ఉండేందుకు, బ్యాంకులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్‌బీఐ సూచించింది.

ఆర్‌టీజీపీఎస్, నెఫ్ట్ చెల్లింపులకీ లుక్-అప్ సౌలభ్యం

ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ చెల్లింపులకూ 'లుక్-అప్' సౌలభ్యాన్ని విస్తరించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచే ఈ విధానం అమల్లోకి రానుంది. అప్పటిలోగా ఇందుకు అవసరమైన టెక్నాలజీని అభివృద్ధి చేసి బ్యాంకులకు అందుబాటులోకి తేవాలని భారత జాతీయ చెల్లింపుల సంస్థ ఎన్‌పీసీఐని కోరింది. ప్రస్తుతం యూపీఐ, ఐఎంపీఎస్ చెల్లింపులకు మాత్రమే ఈ లుక్-అప్ సౌకర్యం ఉంది. ఈ విధానంలో ఎవరికి నగదు బదిలీ చేయాలో అతడి బ్యాంకు ఖాతా వివరాలు, చెల్లింపు ప్రారంభించే ముందే మనకు కనిపిస్తాయి. అది నగదు అందుకునే వ్యక్తి నిజమైన ఖాతా అని నిర్ధారణ చేసుకున్నాకే, నగదు బదిలీ చేయవచ్చు. ఇప్పుడు ఈ విధానాన్ని ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ చెల్లింపులకూ విస్తరించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. దీనివల్ల బ్యాంకింగ్ నేరాలకూ చెక్ పడుతుందని భావిస్తున్నారు.

రిటైల్ రుణాలపై పారా హుషార్

చెల్లింపులకు హామీలేని క్రెడిట్ కార్డు, వ్యక్తిగత రుణాల వంటి రిటైల్ రుణాల ఎగవేతలపైనా ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. వీరిలో ఎక్కువ మందికి ఇప్పటికే ఇతర సెక్యూర్డ్ రుణాల చెల్లింపుల భారం ఉంటుందనే విషయాన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు గుర్తించాలని కోరింది. కొవిడ్‌కు ముందు ఏటా 14.8 శాతం చొప్పున పెరిగిన కన్స్యూమర్ రుణాలు, ఇప్పుడు ఏటా 20.6 శాతం చొప్పున పెరుగుతున్న విషయాన్ని గుర్తు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▲	71,500 ▲	99,900 ▲
విజయవాడ	78,500 ▼	73,300 ▲	89,600 ▲
విశాఖపట్నం	76,800 ▲	70,400 ▲	88,960 ▲
రాజమండ్రి	78,000 ▲	71,500 ▲	89,800 ▼
ప్రొద్దుటూరు	78,500 ▼	72,690 ▼	90,000 ▲
ముంబై	76,194 ▼	69,794 ▼	87,175 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	540
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	563	విశాఖపట్నం	600
		దజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	106
వరంగల్	95	గుంటూరు	106
కరీంనగర్	95	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	97
కర్నూలు	95	నెల్లూరు	97
విశాఖపట్నం	105	అనంతపురం	97
గోదావరి	106		

సంగమం పవర్ ప్రాజెక్ట్స్ చేతికి కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్

ఎన్‌సీఎల్‌టీ ఆమోదం

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి బిజినెస్): కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (కేడీఎంఎస్ఎల్), దాని అనుబంధ సంస్థల కొనుగోలుకు సంగమం పవర్ ప్రాజెక్ట్స్ సమర్పించిన రిజొల్యూషన్ ప్రణాళికకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలిపింది. కేడీఎంఎస్ఎల్ అనుబంధ సంస్థల్లో కార్వీ ఇన్నోటెక్ లిమిటెడ్ (కేటీఐఎల్), కార్వీ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (కేఆర్ఈపీఎల్) ఉన్నాయి. కట్టా సీతారాం రెడ్డి, అన్నుమన్ మోదుగు రెడ్డి నాయకత్వంలోని సంగమం పవర్ ప్రాజెక్ట్స్ సంస్థ 2008 సంవత్సరం నుంచి పునరుత్పాదక ఇంధన విభాగంలో అగ్రగామిగా ఉంది. సోలార్, హైడ్రో, పవన విద్యుత్ రంగాల్లో స్పెషలైజ్ చేసింది. జస్టిస్ వెంకట రామకృష్ణ బదరీనాథ్ నందుల్, చరణ్ సింగ్ సభ్యులుగా గల ఎన్‌సీఎల్‌టీ బెంచ్.. కేడీఎంఎస్ఎల్ కార్పొరేట్ దివాలా ప్రక్రియకు (సీఐఆర్‌పీ) ఆమోదం తెలుపుతూ తీర్పు ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబరులో మొదలైన సీఐఆర్‌పీ ప్రక్రియ అంతటినీ రిజల్యూషన్ ప్రొఫెషనల్ సుహాసినీ అశోక్ పర్యవేక్షించారు. 2008 నుంచి నిర్మించిన కేడీఎంఎస్ఎల్ వ్యాపార వారసత్వాన్ని పునరుద్ధరించి, ఆయా రంగాల్లో కంపెనీకి గల గుర్తింపును సొమ్ము చేయడంపై ఈ రిజొల్యూషన్ ప్రణాళిక ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

మార్కెట్‌కు అమ్మకాల పోటు

సెన్సెక్స్ 450 పాయింట్లు డౌన్

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన బలహీన సంకేతాలు, విదేశీ సంస్థల నిధుల తరలింపు నేపథ్యంలో సోమవారం ఈక్విటీ మార్కెట్లో అమ్మకాలు పోటెత్తాయి. మార్కెట్ అగ్రగాములైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో భారీ ఎత్తున అమ్మకాలు సాగాయి. ఫలితంగా సెన్సెక్స్ 450.94 పాయింట్ల నష్టంతో 78,248.13 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని షేర్లలో 23 నష్టాలతోనే ముగిశాయి. నిఫ్టీ 168.50 పాయింట్ల నష్టంతో 23,644.90 వద్ద ముగిసింది. నిఫ్టీ షేర్లలో 38 నష్టాల్లోనే ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి.

సెనోరెస్ ఫార్మా దూకుడు: ఇటీవల ఐపీఓ ముగించుకున్న సెనోరెస్ సోమవారం షేరు మార్కెట్లో లిస్టింగ్ అయ్యింది. సెనోరెస్ ఫార్మా షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.391పై 42.65 శాతం ప్రీమియంతో రూ.557.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు 55.75 శాతం ప్రీమియంతో రూ.609 వరకు కూడా దూసుకుపోయింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 42.46 శాతం లాభంతో రూ.557.05 వద్ద ముగిసింది.

ఏథర్ ఎనర్జీ ఇష్యూకు సెబీ ఆమోదం: పబ్లిక్ ఇష్యూ జారీ కోసం ఆరు కంపెనీలు చేసుకున్న దరఖాస్తులకు సెబీ ఆమోదముద్ర వేసింది. వాటిలో ఈవీ కంపెనీ ఏథర్ ఎనర్జీ ఇష్యూ కూడా ఉంది. ఈ ఇష్యూ ద్వారా రూ.3,100 కోట్ల విలువ గల తాజా ఈక్విటీ షేర్లు మార్కెట్లో జారీ చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు 2.2 కోట్ల షేర్లను విక్రయిస్తారు. ఇష్యూ ద్వారా సేకరించే నిధులు మహారాష్ట్రలో కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటుకు, రుణ భారం తగ్గించుకునేందుకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఇష్యూ జారీ కోసం సెబీ ఆమోదం పొందిన ఇతర సంస్థల్లో లీలా ప్యాలెస్ మాతృసంస్థ స్కాలస్ బెంగళూరు, ఓస్వాల్ పంప్స్, ఐవాల్యూ సొల్యూషన్స్, క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్, ఫ్యాబ్‌టెక్ టెక్నాలజీస్ ఇష్యూలున్నాయి.

'ఎఫ్‌ఎంసీజీ'కి అదానీ గ్రూప్ గుడ్‌బై

అదానీ విల్మర్‌లో మొత్తం వాటాల విక్రయం
డీల్ విలువ రూ.17,100 కోట్లు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్.. ఎఫ్‌ఎంసీజీ వ్యాపారానికి గుడ్‌బై చెబుతోంది. ఇందుకోసం ఎఫ్‌ఎంసీజీ సంస్థ అదానీ విల్మర్ ఈక్విటీలో తనకు ఉన్న 43.94 శాతం వాటాలో 31.06 శాతం వాటాను సింగపూర్ కంపెనీ విల్మర్ ఇంటర్నేషనల్‌కు విక్రయిస్తోంది. మిగిలిన 12.88 శాతం వాటాను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా సాధారణ వాటాదారులకు విక్రయించనుంది. విల్మర్ ఇంటర్నేషనల్ ఈ షేర్లను ఒక్కోటి రూ.305 చొప్పున కొనుగోలు చేయనుంది. ఈ అమ్మకం ద్వారా అదానీ గ్రూప్‌నకు రూ.12,314 కోట్ల నిధులు అందుబాటులోకి వస్తాయి. ఓపెన్ మార్కెట్ ద్వారా విక్రయించే 12.88 శాతం వాటాను కూడా పరిగణలోకి తీసుకుంటే ఈ లావాదేవీ మొత్తం విలువ రూ.17,100 కోట్ల వరకు ఉంటుందని అంచనా. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా ఈ లావాదేవీ పూర్తవుతుందని అదానీ గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) తెలిపింది. ఈ వాటాల కొనుగోలుకు సంబంధించి ఏఈఎల్, అనుబంధ సంస్థ అదానీ కమోడిటీస్ ఎల్ఎల్‌పీ, విల్మర్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ లెన్సే పీటీఈ లిమిటెడ్.. ఈ మేరకు సోమవారం నాడు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

1999 జనవరిలో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన అదానీ విల్మర్.. ఫార్చ్యూన్ బ్రాండ్ కింద వంట నూనెలు, ఇతర ఆహార ఉత్పత్తులను విక్రయిస్తోంది. కంపెనీకి దేశ వ్యాప్తంగా పది రాష్ట్రాల్లో 23 ప్లాంట్లు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.51,55.24 కోట్లుగా ఉంది. కాగా సోమవారం బీఎస్ఈలో అదానీ విల్మర్ షేరు స్వల్ప నష్టంతో రూ.329.50 వద్ద క్లోజైంది. సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.42,824 కోట్లుగా ఉంది.

చడీ చప్పుడూ లేకుండా గెంటివేతలు

ఉద్యోగుల ఉద్వాసనకు కొత్త వ్యూహం

ముంబై: సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మకంగా మారిపోతూ ఉండడంతో ఉద్యోగుల ఉద్వాసనకు కంపెనీలు తమ వ్యూహాన్ని మార్చాయి. ఇంతమందిని తీసేస్తాం...అంత మందిని పంపేస్తాం అనే భారీ ప్రకటనలు ఏవీ లేకుండా...ఉద్యోగులు తమంత తామే ఉద్యోగాలు వదిలిపెట్టి పారిపోయేలా పరోక్షంగా ఒత్తిడి (సైలెంట్ ఫైరింగ్) చేస్తున్నాయి. తాజాగా ఈ ధోరణి బాగా పెరిగిందని స్టాఫింగ్ సొల్యూషన్స్, హెచ్ఆర్ సర్వీసెస్ కంపెనీ జీనియస్ కన్సల్టెంట్స్ తాజా నివేదికలో తెలిపింది. అవసరాన్ని మించి ఉన్న ఉద్యోగులను తొలగించడానికి లేఆఫ్ బాట పడుతున్నట్టు 10% కంపెనీలు తెలిపాయి. 79% కంపెనీలు మాత్రం కొత్త టెక్నాలజీలు అలవరచుకునేలా తమ ఉద్యోగుల నైపుణ్యాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించాయి. పని తీరు సంతృప్తికరంగా లేని వారిపై అధిక పనిభారం వేసి వారు ఉద్యోగం వదులుకుని పోయేలా వ్యూహాన్ని తాము అనుసరిస్తున్నట్టు 6% కంపెనీలు తెలిపాయి. మొత్తం 1,223 కంపెనీలు, 1,069 మంది ఉద్యోగులను ఈ సర్వే సందర్భంగా ప్రశ్నించి నివేదిక రూపొందించారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ఆధునిక టెక్నాలజీల వినియోగాన్ని పెంచి ఉద్యోగుల అవసరం కనిష్ఠ స్థాయికి తగ్గించుకోవాలనుకుంటున్నట్టు 39% యాజమాన్యాలు తెలిపాయి. అయితే 31% మంది మాత్రం ఆధునిక టెక్నాలజీలు ఉపయోగించుకుంటూనే సమాంతరంగా మానవ వనరులను వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపాయి.

కొత్త టెక్నాలజీల్లో 10 లక్షల ఉద్యోగాలు

క్వాంటమ్ కంప్యూటింగ్, జెనరేటివ్ ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ రంగాల్లో 2030 నాటికి 10 లక్షల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయని క్వెస్ ఐటీ స్టాఫింగ్ తాజా నివేదికలో అంచనా వేసింది. అదే కాలంలో కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, బ్లాక్ చెయిన్ వంటి ఆధునిక టెక్నాలజీలు ఆర్థిక వ్యవస్థకు 15 వేల కోట్ల డాలర్ల (రూ.12.75 లక్షల కోట్లు) వాటాను అందిస్తాయని అంచనా వేసింది. 43.5 శాతం వాటాతో టెక్నాలజీ రంగంలో నియామకాలకు బెంగళూరు కేంద్ర స్థానంగా కొనసాగుతుందని కూడా తెలిపింది. 13.4 శాతం వాటాతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలుస్తుందని పేర్కొంది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 31-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 273 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగమూ

కేంద్రం చేతికే!

అలైన్‌మెంట్ ఖరారు చేసి భూసేకరణకు అనుమతివ్వండి

భూములకు చెల్లించే పరిహారంలో 50% వాటా మేమిస్తాం

ఉత్తర, దక్షిణ పనులు ఒకేసారి ప్రారంభించేలా చూడండి

లేదా రెండో విడత కిందైనా దక్షిణ భాగం పనులు చేపట్టండి

కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన రాష్ట్ర సర్కారు

దక్షిణ భాగాన్ని విజన్-2047లో చేర్చిన కేంద్ర ప్రభుత్వం!

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం.. మళ్లీ కేంద్రం చేతికే వెళ్లింది! ఈ భాగాన్ని కేంద్రమే నిర్మించాలని, రహదారి కోసం సేకరించే భూములకు చెల్లించే పరిహారంలో వాటాను చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అంతేకాదు ఉత్తర భాగంతో పాటు సమాంతరంగా దక్షిణభాగం పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని.. అలా సాధ్యం కాకపోతే, ఉత్తర భాగం పూర్తయిన వెంటనే దక్షిణ భాగం పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తూ కేంద్రానికి ఇటీవల లేఖ రాసింది. వాస్తవానికి కేంద్రం తెలంగాణకు ఆర్‌ఆర్‌ఆర్ మంజూరు చేసినప్పుడు.. ఉత్తర, దక్షిణభాగాలను తానే నిర్మించనున్నట్టు తెలిపింది. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. దక్షిణ భాగాన్ని రాష్ట్రప్రభుత్వమే చేపట్టాలని నిర్ణయించి ఆ దిశగా పలు చర్యలు కూడా తీసుకుంది. ఇప్పుడు మాత్రం మనసు మార్చుకుని కేంద్రానికి లేఖ రాయడం గమనార్హం. "రోజురోజుకూ రాష్ట్రంతో పాటు హైదరాబాద్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఐటీ రంగం, ఫార్మా పరిశ్రమలు, లాజిస్టిక్ పార్కులతో ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతోంది. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఔటర్ రింగు రోడ్డుపైనా వాహన రద్దీ పెరుగుతోంది. వచ్చే 5 ఏళ్లలో ఆ రద్దీ మరింత పెరుగుతుంది. ఆర్‌ఆర్‌ఆర్‌లో భాగంగా కేవలం ఉత్తరభాగాన్ని మాత్రమే నిర్మిస్తే ట్రాఫిక్ రద్దీని నియంత్రించలేం. ఈ రోడ్డుకు సమాంతరంగా దక్షిణ భాగాన్ని కూడా నిర్మించాలని నిర్ణయించాం. కానీ రెండు భాగాలూ ఒకేసారి నిర్మిస్తేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. లేదంటే దక్షిణ భాగంవైపు

మిగతా 11వ పేజీలో...



సత్య నాదెళ్లను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు

స్కిల్స్ వర్సిటీ.. అద్భుత ఆలోచన

ఇది తెలంగాణను మరో స్థాయికి తీసుకెళ్తుంది

నైపుణ్యాలు, మౌలిక వసతులతోనే ఆర్థికాభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టుల్లో భాగస్వాములవుతాం

సీఎం రేవంత్‌తో మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల

ఏఐ, క్లౌడ్ రంగాల్లో సహకరించాలన్న సీఎం

ఏఐ ప్రాజెక్టులపై ప్రజెంటేషన్ ఇచ్చిన శ్రీధర్‌బాబు

సత్య నాదెళ్ల నివాసంలో గంటకుపైగా భేటీ

11

ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు సరిపడా నైపుణ్యాలే ఉపాధి అవకాశాలను నిర్దేశిస్తాయి. ఈ దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆకట్టుకున్నాయి.

\- సత్య నాదెళ్ల

కక్ష్యలో కలుద్దాం!



రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

స్పేస్ డాకింగ్ మిషన్‌లో తొలి ఘట్టం విజయవంతం

రోదసిలోకి స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు.. సత్తాచాటిన ఇస్రో

15.13 నిమిషాల్లోనే కక్ష్యలోకి చేర్చిన పీఎస్ఎల్వీ-సీ60

జనవరి 7న అనుసంధానం!: ఇస్రో చైర్మన్ సోమనాథ్

డాకింగ్ దశ కూడా పక్కాగా పూర్తయితే.. ఇప్పటికే ఆ సామర్థ్యం ఉన్న అమెరికా, రష్యా, చైనా సరసన భారత్!

నూతన సంవత్సర కానుక

ఈ విజయం దేశానికి నూతన సంవత్సర కానుక. జంట ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశ పెట్టడం ఈ మిషన్‌లో తొలి భాగం. డాకింగ్ ప్రక్రియకు మరో వారం పడుతుంది. జనవరి 7న జరిగే అవకాశం ఉంది. మన సొంత అంతరిక్ష కేంద్ర నిర్మాణంలో ఇదో మైలురాయి.

\- సోమనాథ్, చైర్మన్, ఇస్రో

10



అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో మరో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలోకి ప్రవేశ పెట్టి.. ఆపై వాటిని అనుసంధానం చేసే దిశగా చేపట్టిన ప్రయోగంలో తొలి ఘట్టాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. ఈ మిషన్‌లో భాగంగా ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) ఉపగ్రహాలను నింగిలోకి తీసుకెళ్లిన ఇస్రో విజయాశ్వం పీఎస్ఎల్వీ-సీ60.. వాటిని 476 కిలోమీటర్ల దూరంలోని వృత్తాకార భూ కక్ష్యలో విజయవంతంగా విడిచిపెట్టింది. ప్రస్తుతం ఆ కక్ష్యలో విడివిడిగా తిరుగుతున్న ఈ ఉపగ్రహాలను కొద్దిరోజుల తర్వాత ఓ సంక్లిష్ట విన్యాసంతో ఇస్రో శాస్త్రవేత్తలు అనుసంధానం (డాకింగ్) చేయనున్నారు. ఇది కూడా విజయవంతమైతే.. ఇప్పటికే డాకింగ్ సామర్థ్యం కలిగిన అమెరికా, రష్యా, చైనా సరసన భారత్ సగర్వంగా నిలుస్తుంది!

గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చారు

తొక్కిసలాట జరగడం బాధాకరం

అల్లు అర్జున్ తరఫున వెంటనే బాధితులను పరామర్శించాల్సింది

క్షమాపణలు చెప్పి ఉంటే బాగుండేది

సమస్య పెద్దది అయ్యేది కాదు

రేవంత్‌రెడ్డి కక్షసాధింపులకు పోలేదు

పరిష్కారంలో సినిమా టీమ్ ఫెయిల్

హీరోను ఒంటరి వ్యక్తిని చేశారు

సంధ్య థియేటర్ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ వ్యాఖ్యలు



అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సంధ్య థియేటర్ వద్ద పుష్ప-2 బెనిఫిట్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన, అల్లు అర్జున్ అరెస్టుపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొదటిసారి స్పందించారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తీసుకువచ్చారని వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ సమానమేనని అన్నారు. సంఘటన జరిగిన వెంటనే అల్లు అర్జున్ తరఫున బాధితుల కుటుంబం వద్దకు వెళ్లి ఉంటే బాగుండేదన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వైసీపీ విధానాల తరహాలో

మిగతా 7వ పేజీలో...

అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన విచారణ... తీర్పు జనవరి 3న

వారానికి 4 సిఫారసు లేఖలు

తిరుమలలో తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల లేఖలకు అనుమతి

రెండేసి వీఐపీ బ్రేక్, ప్రత్యేక దర్శనాలు

ప్రతి దానిపై ఆరుగురికి అనుమతి

రేవంత్‌కు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ



వికారాబాద్/హైదరాబాద్/అమరావతి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫారసు లేఖలపై తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారు. శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను కూడా అనుమతించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాసిన నేపథ్యంలో చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ సోమవారం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తెలుగుజాతి సత్సంబంధాలను కొనసాగించడంతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి తిరుమల వచ్చే

మిగతా 12వ పేజీలో...



హుజూర్‌నగర్ ఫణిగిరిగుట్ట వద్ద నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్న మోడల్ కాలనీ

ఆ ఇళ్లకు మోక్షం

2013లో హుజూర్‌నగర్‌లో 2,160 ఇళ్ల మంజూరు

దశాబ్దంగా నిలిచిన పనులు.. ఉత్తమ్ చొరవతో షురూ

రూ.74 కోట్లు మంజూరు చేసిన గృహ నిర్మాణ సంస్థ

హైదరాబాద్, హుజూర్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా 11 ఏళ్ల తర్వాత ఆ ఇళ్లకు మోక్షం లభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో అప్పటి ప్రభుత్వం హుజూర్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని సీతారామస్వామి గుట్ట ప్రాంతంలో 2,160 సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లను మోడల్ కాలనీగా మంజూరు చేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ఆ ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోలేదు. ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు ఆ ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని పలుసార్లు ఉద్యమాలు చేశారు. ఇళ్ల సాధన కమిటీ పేరుతో ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ఆరు నెలల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని నాలుగేళ్ల క్రితం బీఆర్ఎస్ నాయకులు, ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. చివరికి ఈ ఏడాది జనవరిలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆ ఇళ్లను పరిశీలించి, పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ఆగిపోయిన ఆ ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.74.80 కోట్లను మంజూరు చేసింది. ఈమేరకు పనులను ఒక నిర్మాణ సంస్థకు అప్పగించింది. ఇప్పటి వరకు 1,024 ఇళ్ల పనులు పూర్తవ్వగా.. 832 ఇళ్లు చివరి దశలో ఉన్నాయి. మరో 304 ఇళ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అదేవిధంగా ఆ కాలనీలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపైనా అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా

మిగతా 11వ పేజీలో...

తెలంగాణ గుండెల్లో..

కలకాలం మన్మోహన్

ప్రధానమంత్రిగా.. రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్ ఆయన

సోనియాగాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చిన గొప్ప నాయకుడు

పైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

శాసనసభలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని తీర్మానం.. ఆమోదం

రుణ మాఫీకి ఆయనే స్ఫూర్తి: భట్టి

మన్మోహన్ ప్రతిభను గుర్తించింది పీవీ

ఆయనకూ రాజధాని ఢిల్లీలో స్మారకం ఏర్పాటు చేయాలి: కేటీఆర్

స్కిల్స్ యూనివర్సిటీకి మన్మోహన్ పేరు పెట్టాలి: హరీశ్

ఈ సమయంలో వియత్నాంకు రాహుల్

సంతాప తీర్మానాల్లో ఏలేటి కలకలం



మన్మోహన్‌సింగ్‌కు అసెంబ్లీలో నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పురస్కారమైన భారత రత్నను ప్రదానం చేయాలని తెలంగాణ శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయన మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. శోకార్తులైన ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించడానికి సోమవారం శాసనసభ ప్రత్యేకంగా సమావేశమైంది. ఇందులో మన్మోహన్‌కు భారత రత్న పురస్కారం ప్రదానం చేయాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టి సీఎం రేవంత్ ప్రసంగించారు. "మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసిన నాయకుడు. ప్రధాని హోదాలో తెలంగాణకు రాష్ట్ర హోదా కల్పించారు. తెలంగాణతో ఆయన అనుబంధం విడదీయలేనిది. పార్లమెంటు ఉభయ సభల్లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందేలా చేసిన, రాష్ట్రానికి పురుడు పోసిన డాక్టర్‌గా మన్మోహన్ సింగ్‌ను తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది" అని అన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ ఇచ్చిన మాటను పార్లమెంట్ ప్రక్రియ ద్వారా నెరవేర్చే బాధ్యత తీసుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. ఉద్యమాలను, ప్రజల మనోభావాలను

మిగతా 7వ పేజీలో...

డ్రగ్స్ సరఫరాదారులపై మెరుపు దాడి

హైదరాబాద్‌లో పక్కా సమాచారంతో రంగంలోకి టీజీన్యాబ్, పోలీసులు

8 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ

నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక బృందాలు

12

25 వేల తనిఖీలు.. 4 వేల మందిపై చర్యలు

ఈ ఏడాదిలో 573 కేసులు నమోదు

పెద్దఎత్తున దాడులు.. నిల్వల స్వాధీనం

ఔషధ నియంత్రణ సంస్థ నివేదిక

7

బడిలో బోరు నీరే దిక్కు!

వేలాది స్కూళ్లలో భగీరథ నల్లాలు నిరుపయోగం

కొన్ని విద్యా సంస్థలకు మాత్రమే స్వచ్ఛమైన నీరు

చాలా పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లతోనే వెల్లదీత

గురుకులాలు, హాస్టళ్లకు తప్పని ఇబ్బందులు

నిర్వహణ లోపమే.. శాపంగా మారిన పరిస్థితి

చాలా చోట్ల అపరిశుభ్రంగా వాటర్ ట్యాంకులు

బ్లీచింగ్ లేకపోవడంతో నాచు పెరిగి అధ్వానం

ప్రైవేట్ భవనాల్లోని గురుకులాలకు కనెక్షన్లే లేవు

కలుషిత నీటితో అనారోగ్యం బారిన విద్యార్థులు

'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో సమస్యల గుర్తింపు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం. ఈ పాఠశాలకు ఇప్పటిదాకా మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో స్థానికంగా అందుబాటులో ఉన్న బోరు మోటార్‌తో ట్యాంకులోకి నీటిని ఎక్కిస్తున్నారు. ఆ నీటినే మధ్యాహ్నం వేళ విద్యార్థులు వినియోగించుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని ప్రజలందరికీ పైపులైన్ ద్వారా సురక్షిత తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన పథకం.. మిషన్ భగీరథ. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. వేలాది గ్రామాల్లో పైపులైన్లు, వాటర్ ట్యాంకులను నిర్మించింది. కానీ, చాలా చోట్ల పనులు పూర్తి కాకపోవడం, నిర్వహణ లోపాలు ఈ పథకానికి శాపంగా మారాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలకు మిషన్ భగీరథ కింద పైపులైన్ కనెక్షన్లు ఇచ్చినా.. ఇబ్బందులు తప్పడం

మిగతా 12వ పేజీలో...



జిమ్మీ కార్టర్ కన్నుమూత

10

వందేళ్ల వయసులో తుదిశ్వాస

1977-81 మధ్య అమెరికా అధ్యక్షుడిగా..

ఐఏఆర్ఐ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు

నియామకం సరైనదే!

ఐసీఏఆర్‌పై ఆరోపణలు నిరాధారం.. అవగాహన లేక విమర్శలు

వ్యవసాయ పరిశోధన మండలి స్పష్టీకరణ

11

నదిలో పడిన ట్రక్కు.. 71 మంది మృతి

ఇథియోపియాలో ఘోర ప్రమాదం

10

ఎన్నికల్లో పోటీకి సాయం చేయరూ..

ఆన్‌లైన్‌లో విరాళాల సేకరణ ప్రారంభించిన ఆప్ నేత సిసోడియా

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

దౌత్య పరీక్ష

'ఆమెను తిరిగిపంపకూడదన్న రాజకీయ నిర్ణయం ఇప్పటికే జరిగిపోయింది' అంటూ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సలహాదారు ఆదివారం మీడియా సమక్షంలో ఓ వ్యాఖ్య చేశారు. ప్రస్తుతం మన దేశంలో ఆశ్రయం పొందుతున్న బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింత విషయంలో అధికారికంగా భారత్ ప్రతిస్పందించకముందే పొరుగుదేశం పాలకులు ఇలా హడావుడి నిర్ధారణలు చేయడం సరికాదు. హసీనాను తమకు అప్పగించాలని ఢాకా ఇటీవల దౌత్య ప్రక్రియ ద్వారా భారత ప్రభుత్వానికి సందేశం పంపింది. ఆ విషయాన్ని మన విదేశాంగ శాఖ ధ్రువీకరించింది తప్ప, దానిపై మరెలాంటి వ్యాఖ్య చేయలేదు. కానీ, అభ్యర్థించిన స్వల్పకాలంలోనే సమాధానాన్ని కూడా ఎదుటిపక్షం వారే ఇలా సిద్ధం చేసుకుంటున్నారు. హసీనా అప్పగింతకు భారత్ అంగీకరించకపోయే అవకాశాలే అధికంగా ఉన్నప్పటికీ, అభ్యర్థన ప్రక్రియ అన్నిదశలూ పూర్తయ్యేవరకూ ఇటువంటి వ్యాఖ్యలు చేయకూడదు.

దేశం విడిచి వెళ్ళిపోయేందుకు హసీనాను మిలటరీ అనుమతించినప్పటికి ఆమె మీద కేసులేమీ లేవు. అప్పుడు అందరికీ కావాల్సింది ఆమె ఉన్న పళంగా నిష్క్రమించడమే. ఆ తరువాత తాత్కాలిక ప్రభుత్వం ఆమెమీద కేసులు పెట్టింది, న్యాయస్థానం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. నేరస్థుల అప్పగింతపై భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం హసీనాను తిరిగి పంపించాలని ఢాకా కోరుతున్నది. ఉగ్రవాద కార్యకలాపాలను నిరోధించే లక్ష్యంతో చేసుకున్న ఒప్పందమది. అయితే రాజకీయ సంబంధిత అభియోగాలు ఎదుర్కొంటున్నవారికి ఈ ఒప్పందం వర్తించదని అందులోని నిబంధన 6 స్పష్టం చేసింది. ఈ నిబంధన అంతర్జాతీయ న్యాయసూత్రాలకు అనుగుణమైనది. ఐక్యరాజ్యసమితి విశ్వ మానవ హక్కుల ప్రకటన ఆ నిబంధనకు ప్రాతిపదిక. 'రాజకీయ అభిప్రాయాలు, చర్యల కారణంగా శిక్షను తప్పించుకునేందుకై ఇతర దేశాలలో ఆశ్రయాన్ని కోరేందుకు, పొందేందుకు ప్రతి ఒక్కరికీ హక్కు ఉందని' విశ్వ మానవ హక్కుల ప్రకటన పేర్కొంది. నేరస్థుల అప్పగింతపై ఐక్యరాజ్యసమితి నమూనా చట్టం ప్రకారం అప్పగించిన వ్యక్తిపై న్యాయవిచారణ నిష్పాక్షికంగా జరిగి తీరాలి. అందుకు ఆస్కారం లేదని భావించిన పక్షంలో అభ్యర్థనను తిరస్కరించే హక్కు సంబంధిత దేశానికి ఉంటుంది. బంగ్లాదేశ్ న్యాయవ్యవస్థ ఇటీవల తీసుకున్న వివిధ నిర్ణయాలు హసీనాపై నిష్పాక్షిక విచారణ జరగగలదనే భరోసానివ్వడం లేదు. గతంలో అసోంలో తీవ్ర హింసాకాండకు పాల్పడి, ఆ తరవాత బంగ్లాదేశ్ లో ఆయుధాలను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ వేర్పాటు వాద సంస్థ ఉల్ఫా నేత పరేష్ బారువాకు విధించిన మరణశిక్షను యావజ్జీవ శిక్షగా కుదించడం జరిగింది. అలాగే హసీనాపై హత్యాయత్నం కేసులో మరణ శిక్షను ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ కి చెందిన మాజీ మంత్రి లుత్ఫోజ్జమన్ బాబర్ ను ఇటీవలే పూర్తిగా విడిచిపెట్టారు. ఇక, మైనారిటీ హిందువుల పక్షాన రంగంలోకి దిగిన చిన్మోయ్ కృష్ణదాస్‌కు బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఆయన తరఫున వాదించేందుకు ఏ న్యాయవాది ముందుకు రావడం లేదన్నది సాకు. ఈ పరిస్థితులలో హసీనాను అప్పగించినా ఆమెపై విచారణ నిష్పాక్షికంగా జరిగేందుకు ఆస్కారం లేదన్నది స్పష్టం.

షేక్ హసీనాను ఎలాగైనా స్వదేశానికి రప్పించి ఆమెను ప్రాసిక్యూట్ చేసేందుకు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించే అవకాశం లేదు. అయితే ఆమెను అప్పగించాలన్న ఢాకా అభ్యర్థన భారత్‌కు దౌత్య పరీక్షగా పరిణమించనున్నది. ఏ కారణం చేతనైనా హసీనాను అప్పగించాలన్న బంగ్లా ప్రభుత్వ డిమాండ్‌ను అంగీకరించిన పక్షంలో భారత్ విశ్వసనీయతను కోల్పోతుంది. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే బంగ్లాలో ఇప్పటికే తీవ్రస్థాయిలో ఉన్న భారత్ వ్యతిరేకత మరింత ఉధృతమవుతుంది. హసీనాకు బాసటగా నిలుస్తూనే బంగ్లాదేశ్‌తో సుస్థిర సత్సంబంధాలను పునరుద్ధరించుకోవడం ఇప్పుడు భారత్ ముందున్న విషమ సమస్య. ఈ దౌత్య సంకటాన్ని అధిగమించడంలో ఎటువంటి పొరపాటు చేసినా దక్షిణాసియాలోనే కాకుండా విశాలప్రపంచంలో కూడా సంక్లిష్ట పర్యవసానాలను ఎదుర్కోవలసిన అగత్యం భారత్‌కు ఏర్పడుతుంది. భారత్‌లో ఉంటూ, బంగ్లాదేశ్ వ్యవహారాలమీదా, మహ్మద్ యూనుస్‌కు వ్యతిరేకంగానూ ఆమె వరుసగా చేసిన వ్యాఖ్యలు ఈ పరిణామానికి ఒక కారణం. భారత్‌లో ఉండదల్చుకుంటే, ఆమె మౌనంగా, తన ప్రపంచంలో తానుండటం మంచిది. ఆమె నోరువిప్పనంతకాలం బంగ్లాపాలకులు కూడా ఆమె జోలికి రాకపోవచ్చు. ఆమెకు, రెండుదేశాలకు కూడా ఇది క్షేమకరమైన మార్గం.

'సంస్కర్త' హృదయంలో సామాన్యుడు


నన్ను ఆర్బీఐ (భారతీయ రిజర్వ్ బ్యాంక్) గవర్నర్‌గా సెప్టెంబర్ 2008లో నియమించారు. ఈ నియామకం సమయంలో నేను న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా ఉన్నాను. ముంబైకు వెళ్లే ముందు, నా మీద నిండు నమ్మకంతో ఈ బృహత్తర బాధ్యత అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపేందుకై ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లాను. ఆయనతో నా సమావేశం క్లుప్తంగా— కేవలం 15 నిమిషాల పాటే జరిగింది. దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు, ప్రభుత్వ ద్రవ్య విధానానికి సంబంధించిన సవాళ్లు, ఇంకా ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా రూపాయి విలువను కాపాడడంలో ఆర్బీఐకి ఎదురయ్యే సమస్య గురించి మేము మాట్లాడుకున్నాం.

డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎదుటి వ్యక్తి చెప్పేది శ్రద్ధగా వినే వ్యక్తి. ఈ గుణ విశేషం తక్కువ మందిలో ఉంటుంది, నాయకులలో కొద్దిమందిలో మాత్రమే ఉంటుంది. ఆయనకు అప్పటికే తెలిసిన విషయాన్ని చెప్పినా చాలా ఓర్పుగా వింటారు. తెలిసిన విషయమైనా మీ వివరణలో ఏమైనా సున్నిత సూక్ష్మాలూ, కొత్త దృక్కోణాలు ఉన్నాయేమోనని ఆయన శ్రద్ధ చూపుతారు. ఆయనలో నేను అభిమానించే విషయాలలో ఇది ఒకటి.

పది నిమిషాల పాటు మాటా మంతీ అయినాక నేను ఇలా అన్నాను: 'సర్, మీరూ ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారు. నాకు ఏమైనా సలహా ఇవ్వగలరా?' ఆయన స్వాభావికంగా ఒక అస్ఫుటమైన చిరునవ్వు (ఈ మందహాసాన్ని మీరు మన్మోహన్ పెదవులపై కంటే ఆయన కళ్లలోనే ఎక్కువగా చూడగలరు)తో విముఖత తెలిపారు. 'సుబ్బారావు, మీకు నేను ఏమి సలహా ఇవ్వగలను? మీరు ఐఏఎస్‌లో ఉన్నారు. మీకు దేశం తెలుసు, ప్రభుత్వం తెలుసు. ఆర్బీఐ వ్యవహారాలు మీకు సుపరిచితమే. ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు, పురోగతికి ఏది అత్యుత్తమమని మీరు భావిస్తారో అదే చేయండి. మీరు మన ఆర్థిక వ్యవస్థకు తప్పక మేలు చేస్తారనడంలో నాకు సందేహం లేదు' అని మన్మోహన్ అన్నారు.

రెండు నిమిషాల అనంతరం ప్రధానమంత్రితో నా సంభాషణని ముగించాను. వెళ్ళేందుకు లేచి నిలబడగా ఆయన తన కుర్చీ నుంచి లేచి వచ్చి నాకు వీడ్కోలు చెప్పేందుకు ద్వారం దాకా వచ్చారు. ద్వారం వద్ద నా భుజం చుట్టూ తన చెయ్యి వేసి ఇలా అన్నారు: 'సుబ్బారావు, ఇంతకు ముందు మీరు నా సలహా కోసం అడిగారు. మీకు ఒక సలహా ఇవ్వదలుచుకున్నాను. మీరు ఐఏఎస్ నుంచి ఆర్బీఐకి వెడుతున్నారు. అదొక పెద్ద మార్పు. ఐఏఎస్‌లో వలే కాకుండా ఆర్బీఐలో మీరు ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, ద్రవ్య సరఫరా, ఋణ పెరుగుదల అంకెల అరణ్యంలో చిక్కుకుపోయే ప్రమాదం ఉన్నది. ఆర్బీఐ తీసుకునే నిర్ణయాలు, చేపట్టే చర్యలు ప్రజలకు, వారి జీవనాధారాలకు ఎంత ముఖ్యమో మీరు మరచిపోవచ్చు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని మీ నిర్ణయాలు, చర్యల ఫలితంగా నెలకొనే పరిస్థితులను తెలుసుకునేందుకు సదా జాగరూకతతో ఉండండి'.

ముంబైకు వెళ్లే ముందు ఢిల్లీలో ముగించవలసిన అనేక పనుల విషయం నా మనస్సునిండా ఉండడంతో ఆ సలహా, నేను ప్రధానమంత్రి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన నిమిషంలోగానే నా మనసు నుంచి అదృశ్యమయింది. ఆ తరువాత కొద్ది నెలల్లో ఆర్బీఐ గవర్నర్‌గా నా బాధ్యతల నిర్వహణలో నేను తలమునకలుగా ఉండగా మన్మోహన్ సలహాలో ఇమిడి ఉన్న భావం, దాని ప్రాముఖ్యత నాకు తెలిసివచ్చాయి. ఈ విషయాన్ని చూడండి. ప్రతి త్రైమాసికంలోను ద్రవ్య విధాన సమీక్ష జరుగుతుంది. ఇందుకు సన్నద్ధంగా సంబంధిత వ్యక్తులు, సంస్థలు— ఆర్థికవేత్తలు, బ్యాంకులు, బ్యాంకేతర ఫైనాన్స్ కంపెనీలు, మార్కెట్ల ప్రతినిధులు అందరితో సంప్రదింపులు జరుగుతాయి. ఏ ఆర్బీఐ గవర్నర్ కూడా ఎప్పుడూ ఇలా చెప్పలేదు : 'ఓకె, ఇప్పుడు వీధుల్లో ఉన్న 25 మంది సామాన్య పౌరులను తీసుకురండి. ద్రవ్యోల్బణం, ఉద్యోగాలు తదితర ప్రధానమైన ఇతర అంశాల గురించి వారిని నేను సంప్రదించదలుచుకున్నాను'. చెప్పవచ్చిన దేమిటంటే ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టే చర్యలు ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తాయి. ద్రవ్యోల్బణమనేది ఒక తిరోగామి పన్ను. అది సంపన్నుల కంటే పేదవారిని ఎక్కువగా నష్టపరుస్తుంది. కనుక పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నదే మన్మోహన్ న్యూఢిల్లీలో నాకు వీడ్కోలు చెప్తూ ఇచ్చిన సలహా.



> డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప శ్రద్ధాళువు. ఎదుటి వ్యక్తి చెప్పేది తెలిసిన విషయమే అయినా ఆ వివరణలో సున్నిత సూక్ష్మాలూ కొత్త దృక్కోణాలు ఉన్నాయేమోనని ఆయన ఆసక్తి చూపుతారు. ఆర్బీఐ స్వతంత్ర ప్రతిపత్తిని మన్మోహన్ సంపూర్ణంగా సమర్థించేవారు. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టే చర్యలు ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తాయి. ద్రవ్యోల్బణం సంపన్నుల కంటే పేదవారిని ఎక్కువగా నష్టపరుస్తుంది. కనుక పేదల సంక్షేమాన్ని సదా దృష్టిలో ఉంచుకోవాలని ఆయన గట్టిగా చెప్పేవారు.

ఆర్బీఐ పట్ల మన్మోహన్ సింగ్‌కు గొప్ప గౌరవం ఉన్నది. దాని స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడవలసిన అవసరాన్ని ఆయన బాగా అర్థం చేసుకున్నారు. ఆర్బీఐ స్వతంత్రంగా, స్వేచ్ఛగా వ్యవహరించగలిగేందుకు ఆయన చేయగలిగినదంతా చేశారు. గతంలో ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన మన్మోహన్ అది తన విశ్వసనీయతను కొనసాగించుకోవాలని సదా ఆకాంక్షించేవారు. ఆర్థిక మంత్రిగా ద్రవ్య విధానం విషయంలో ఆయన ఎటువంటి జోక్యం చేసుకోలేదు. విధాన నిర్దేశాలు, లక్ష్యాల విషయంలో ప్రభుత్వం, ఆర్బీఐ మధ్య విభేదాలు ఏ ఒక్క ప్రభుత్వానికి గానీ లేదా ఏ ఒక్క ఆర్బీఐ గవర్నర్‌కు గానీ పరిమితమైనవీ కావు, ప్రత్యేకమైనవీ కావు. ఒక విధంగా అవి వ్యవస్థలోనే ఉన్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ ఆ అభిప్రాయ బేధాలు వ్యక్తమయ్యాయి. అలాగే ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలోను ఆ భిన్నాభిప్రాయాలు బాగానే ఉన్నాయి. ఇది సహజం మీరు వాటిని ఆమోదించకపోయినా ఆ విభేదాలు తలెత్తుతూనే ఉంటాయి. ఆర్థిక వ్యవస్థ పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పుడు ఈ విభేదాలు మరింత తీవ్రంగా ఉండడం కద్దు. యూపీఏ రెండో ప్రభుత్వ హయాం (2009–14)లో ఇదే జరిగింది ప్రభుత్వంలోనే అంతర్గతంగా విధాన వైకల్యం ఏర్పడిందని ఆనాడు అందరూ భావించారు. అంతే కాకుండా శ్టాగ్‌ఫ్లేషన్ (స్తబ్ధతా ద్రవ్యోల్బణం— గిరాకీలో గానీ, ఉద్యోగితలో గానీ పెరుగుదల లేకుండా ద్రవ్యోల్బణం ఏర్పడిన స్థితి) గురించి భయాలు కూడా ముమ్మరంగా నెలకొన్న రోజులవి. విధాన నిర్దేశాలు, లక్ష్యాల విషయమై నాటి ఆర్థిక మంత్రులు —ప్రణబ్ ముఖర్జీ, పి.చిదంబరం—తో నాకు విభేదాలు ఉన్నాయి. విధాన సమీక్ష, మార్పుల చేర్పుల విషయంలో మన్మోహన్ ఎన్నడూ జోక్యం చేసుకోకపోవడం ఆయన గొప్పదనానికి ఒక తార్కాణం. విధాన సమీక్ష విషయమై ఆయనకు వివరించేందుకు వెళ్లినప్పుడు ఆర్థిక మంత్రితో మీ విభేదాలు పరిష్కరించుకున్నారని నేను ఆశిస్తున్నానని అనేవారు. ఆయన ఈ వ్యాఖ్య నాకు ఎంత మాత్రం సంతృప్తినిచ్చేది కాదు. అయినప్పటికీ ఆర్థిక మంత్రి అభ్యంతరాల గురించి ఆయనకు చెప్పేవాణ్ణి ఆ విషయం అంతటితో ముగిసేది.

కేంద్ర బ్యాంకుతో సంబంధం లేని విషయాలపై కూడా తన భావాల మంచి చెడ్డలను తెలుసుకునేందుకు ఆయన ఆర్బీఐని ఉపయోగించుకునేవారు. సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గ్రామీణ ఉపాధి హామీ పథకం విస్తరణ, భూసేకరణ బిల్లు మొదలైన వాటిపై మా అభిప్రాయాలను అడిగి తెలుసుకునేవారు. ఇలా ఆర్బీఐకి సంబంధం లేని విషయాలపై మాతో సంప్రదించడం, సలహాలు తీసుకోవడం ఆర్బీఐ పట్ల ఆయన గౌరవానికి, విభిన్న వర్గాల వారి భావాలు, అభిప్రాయాలు తెలుసుకోవడంలో ఆయన శ్రద్ధాసక్తులకు నిదర్శనాలుగా చెప్పి తీరాలి. నా స్వరాష్ట్రమైన



ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యల గురించి కూడా ఒకసారి ఆయన నన్ను అడిగారు. క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవడానికి ఆయన విశేష శ్రద్ధ చూపేవారు. ఇది ఆయనలో ఉన్న ఒక ప్రశంసనీయమైన గుణ విశేషం. ఒకసారి అనుకోకుండా తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో బ్యాంకులు పని చేస్తున్నాయా అని ఆయన అడిగారు. ఈ విషయాన్ని తరచి చూడాలన్న ఆలోచన నాకు ఎన్నడూ రాలేదు. ఈ కారణంగానే ఆయన హఠాత్తుగా అడిగిన ప్రశ్న నన్ను ఇబ్బంది పెట్టింది.

డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రి అయినప్పుడు ఆర్థిక మంత్రిత్వ శాఖలో నేను మధ్యస్థాయి అధికారిగా ఉన్నాను. ఆర్థికమంత్రికి నాలుగు లేదా ఐదు స్థాయిల దిగువన ఉన్నాను. ఈ కారణంగా నేను అప్పుడు ఆయనతో పెద్దగా మాట్లాడడం జరగలేదు. అయితే ఆయన మా మంత్రి గనుక కొన్ని సమావేశాల్లో ఆయన్ను చూస్తుండేవాణ్ణి. మన్మోహన్ ఆర్థికమంత్రిగా రావడానికి మూడు సంవత్సరాల ముందు నుంచీ నేను ఆ శాఖలో ఉన్నాను. తొలుత నేను 1983 నుంచి 1993 దాకా ఆర్థిక వ్యవహారాల విభాగానికి డైరెక్టర్‌గా ఉండేవాణ్ణి. చెల్లింపుల సమతౌల్యత, వ్యవహారాల పర్యవేక్షణ నా బాధ్యతగా ఉండేది. ఆ తరువాత డాక్టర్ సి. రంగరాజన్ అధ్యక్షతన గల ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలికి కార్యదర్శిగా ఉన్నాను. అప్పుడు ప్రధానమంత్రితో కలిసి అనేక సమావేశాల్లో పాల్గొనేవాణ్ణి. ఉన్నతస్థాయి విధాన నిర్ణయ సమావేశాలకు హాజరయ్యే అవకాశం నాకు లభించింది. మన్మోహన్ గొప్ప శ్రద్ధాళువు. ఆర్బీఐ స్వతంత్ర ప్రతిపత్తిని సంపూర్ణంగా సమర్థించేవారు. అప్పట్లో దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నది. భావి అవసరాలకు నయాపైసా సైతం మిగుల్చుకోవడానికి లేని దుస్థితి. విదేశీ మారకద్రవ్య నిల్వలు అడుగంటిపోయిన విపత్కర రోజులవి. మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన మొదటి వారంలోనే రూపాయి విలువను రెండు దశల్లో తగ్గించారు. ఈ చర్య గొప్ప సత్ఫలితాన్నిచ్చింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ ఎట్టకేలకు మనకు సహాయమందించడానికి సంసిద్ధత తెలిపింది.

మన దేశ చరిత్రను మౌలికంగా మార్చివేసిన ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. 'ఒక భావానికి ఎప్పుడో అప్పుడు సమయం వస్తుంది. అప్పుడు దాని ప్రభావశీలతను ఈ ధరిత్రిపై ఏ శక్తీ అడ్డుకోలేదు' అని ఫ్రెంచ్ మహారచయిత విక్టర్ హ్యూగో చెప్పిన సత్యాన్ని మన్మోహన్ సింగ్ 1991 జూలై 24న తన బడ్జెట్ ప్రసంగంలో ఉటంకించారు. మన ఆర్థిక చరిత్రలో గొప్ప మార్గదర్శక ప్రసంగమది. ఆ ప్రసంగాన్ని మన్మోహన్ సింగే స్వయంగా సిద్ధం చేసుకున్నారు. సమకాలీన విమర్శకులు, వ్యాఖ్యాతల కంటే చరిత్ర తన పట్ల దయా భావంతోను, ఉదారంగాను ఉంటుందని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా తన చివరి విలేఖరుల సమావేశంలో అన్నారు. మన దేశానికి హుందాగా, గౌరవపూర్ణంగా సేవలు అందించిన ఈ విద్వత్ పరుడు, వినమ్రశీలి, మృదుభాషి తనను గురించి తాను చెప్పుకున్న విషయంలో నూటికి నూరు పాళ్లు నిజం ఉందనడంలో సందేహం లేదు.

■ దువ్వూరి సుబ్బారావు
భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్

...ఇవన్నీ వైఫల్యాలేనా?

సీపీఐ 99వ జన్మదినోత్సవాన ఆంధ్రజ్యోతిలో మిత్రులు చెరుకూరి సత్యనారాయణ వ్యాసం వచ్చింది. సారాంశం "భారతదేశంలో కమ్యూనిస్టులు సాయుధపోరాటంలో విఫలమయ్యారు." ఇందులో వాస్తవం ఎంత? పరిశీలించడానికి ఇది సరైన సమయం.

అక్టోబర్ విప్లవం ఇచ్చిన ఉత్తేజంతో ప్రపంచంలో అనేక దేశాలలో లాగే భారత్‌లో కూడా 1925 డిసెంబర్ 26న సీపీఐ ఆవిర్భవించింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదం పెట్టిన అనేక 'కుట్ర కేసుల్లో' పార్టీ నాయకులు సుదీర్ఘ జైలుశిక్షలు అనుభవించారు. ప్రజాసంఘాలు ఏర్పాటు చేసి శ్రామికులు, రైతులు, మేధావులు, కళాకారులు, విద్యార్థుల సమస్యల మీద పోరాటాలు నడిపింది. అనేక హక్కులు సాధించారు. విజయాలు సాధించారు. నేను వాటి వివరాల్లోకి వెళ్లటం లేదు.

హైదరాబాద్ సంస్థానంలో సాయుధ పోరాటాన్ని సీపీఐ 1947 సెప్టెంబరులో ప్రారంభించింది. అది సోషలిస్టు విప్లవం కోసం ఇచ్చిన పిలుపు కాదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నిజాం హైదరాబాదు సంస్థానాన్ని స్వతంత్ర రాజ్యంగా ప్రకటిస్తే, దానిని భారత యూనియన్‌లో విలీనం చేయాలని, వెట్టిచాకిరి రద్దు చేయాలని, భూస్వామ్య వ్యవస్థ రద్దు కావాలని పోరాటం జరిగింది.

సాయుధ పోరాటంలో లక్షలాది మంది పాల్గొన్నారు. 4500 మంది మరణించారు. ప్రధానంగా సాయుధ పోరాట ఫలితంగా యూనియన్ సైన్యాలు 'పోలీసు యాక్షన్' పేరుతో హైదరాబాదును స్వాధీనం చేసుకున్నాయి. నిజాం భారత యూనియన్‌లో విలీనమౌతున్నట్లు ప్రకటించాడు. తిరువాన్కూర్ కొచ్చిన్ సంస్థానంలో సీపీఐ సాయుధ పోరాటం నడిపింది. సంస్థానం రద్దయింది. భారత యూనియన్‌లో విలీనమైంది.



> కమ్యూనిస్టులుగా మేము తప్పులు చేయలేదని కాదు. కొన్ని తప్పులు జరిగాయి. చారిత్రక పొరపాట్లు జరిగాయి. ఇప్పటికీ కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యత సాధించలేకపోతున్నాం. నూతన తరం వీటిని సవరించుకుని ముందుకు సాగిపోవాలి. ఇంకా అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాల్సి ఉండింది.

తెలంగాణ సాయుధ పోరాటం 1948 సెప్టెంబరు తర్వాత కొనసాగించడం సరైంది కాదు. సాయుధ పోరాట లక్ష్యం నెరవేరింది. దాని విజయాలను అతిగా భావించుకొని ఇతర ప్రాంతాలకు విస్తృతం చేయడం సరైంది కాదు. సాయుధపోరాటం ద్వారా భూకేంద్రీకరణ బద్దలైంది. కానీ పేద ప్రజలకు న్యాయమైన భూమి దక్కలేదు. కౌలు రైతులకు న్యాయం జరిగింది. యూనియన్ సైన్యాలు రజాకార్లకు నామమాత్రపు శిక్షలు వేసి, కమ్యూనిస్టులపై వేట సాగించడంతో, పోరాటం తక్షణం విరమించలేని పరిస్థితి ఏర్పడింది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా అధికారంలోకి రావడానికి ప్రయత్నించడంతో పాటు, చట్టబద్ధ పద్ధతుల్లో ప్రజా ఉద్యమాలు నడపడం, ప్రజల గొంతుక వినిపించడం అంతే ప్రధానమైనవి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉన్న పరిమితుల్లో సీపీఐ అనేక విజయాలు సాధించింది. మొదటి పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షమైంది. ప్రజల వాణి సమర్థంగా వినిపించింది. ప్రపంచంలో మొదటిసారి బ్యాలెట్ ద్వారా కేరళలో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత పార్టీ చీలి నష్టపోయింది. అయినా కమ్యూనిస్టులు పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చారు. 140 కోట్ల ప్రజలున్న దేశంలో యునైటెడ్ ఫ్రంట్ ద్వారా అధికారంలో భాగస్వామ్యం వహించి హోం, వ్యవసాయ శాఖల మంత్రిత్వ బాధ్యత తీసుకుంది.

రాజభరణాలు రద్దు చేయడంలో, బ్యాంకులు, బొగ్గు గనుల జాతీయకరణలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ప్రధానపాత్ర నిర్వహించాయి. ప్రభుత్వరంగ పరిరక్షణలో ముందు భాగాన నిలబడ్డాయి. యూపీఏ–1 హయాంలో కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా ఆహారభద్రతా చట్టాన్ని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని, సమాచార హక్కు చట్టాన్ని, గృహహింస నిరోధక చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని సాధించింది. అలీన విదేశీ విధానాన్ని కొనసాగించడంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. కార్మికుల హక్కులకై, విద్యార్థి యువజన హక్కులకై పోరాడింది. భాషాప్రయుక్త రాష్ట్రాలు సాధించింది. ఫాసిస్టు తరహా పాలనను ఎండగట్టేందుకు సెక్యులర్, ప్రజాతంత్ర వామపక్షాల ఐక్యత కోసం పోరాటం నడిపింది. ఇవి కొన్ని మాత్రమే.

ఇవన్నీ వైఫల్యాలా? మీరే ఆలోచించుకోండి. కమ్యూనిస్టులుగా మేము తప్పులు చేయలేదని కాదు. కొన్ని తప్పులు జరిగాయి. చారిత్రక పొరపాట్లు జరిగాయి. ఇప్పటికీ కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యత సాధించలేకపోతున్నాం. మరికొన్ని తప్పులుండవచ్చు. చెప్పండి. ఆలోచిద్దాం. నూతన తరం వీటిని సవరించుకుని ముందుకు సాగిపోవాలి. ఇంకా అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాల్సి ఉండింది. మరింత మిలిటెంట్ పోరాటాలు నడపాల్సి ఉండింది. వినమ్రతతో అంగీకరిస్తాం. ఇవన్నీ నా వ్యక్తిగత అభిప్రాయాలు. మా పోరాటాలలో ఎర్రజండాతో సాగిపోతాం.

ఈనాడు దేశ ప్రజలను భయభ్రాంతులకు లోను చేస్తూ శ్రామికవర్గ వ్యతిరేక, అభివృద్ధి నిరోధక చట్టాలను చేస్తున్న ఆరెస్సెస్, కార్పొరేట్ చేతుల్లో ఉన్న కీలుబొమ్మ ప్రభుత్వం నుండి ప్రజలను రక్షించుకోవడానికి, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి కలిసి వచ్చే అన్ని శక్తులతో కలిసి పోరాటాలు చేయడానికి పునరంకితమవుదాం. ఈ బాధ్యతలు నిర్వహించగల మరొక సిద్ధాంతం, రాజకీయ శక్తులు దేశంలో ఉన్నాయా? చర్చించుకుందాం. నిరాశావాదం వద్దు. ఉజ్వలమైన లక్ష్యాల వైపు విశ్వాసంతో సాగిపోదాం. కమ్యూనిస్టు సిద్ధాంతం అజరామరం.

● సురవరం సుధాకర్‌రెడ్డి
పూర్వ ప్రధాన కార్యదర్శి, సీపీఐ

డిటెన్షన్ విధానం సరికాదు

2009 విద్యా హక్కు చట్టాన్ని సవరిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అమలులో ఉన్న నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ 5, 8 తరగతుల విద్యార్థులకు డిటెన్షన్ విధానం తీసుకువచ్చింది. ఈ విధానం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మూడు వేల కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సైనిక పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలులోకి రానుంది.

విద్యా హక్కు చట్టం 2009లోని సెక్షన్ 16 ప్రకారం ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో 8వ తరగతి వరకు ఏ విద్యార్థినీ కూడా అదే తరగతిలో మళ్ళీ కొనసాగించేందుకు లేదా పాఠశాల నుంచి తొలగించేందుకు వీలులేదు. దీనినే నో డిటెన్షన్ విధానం అంటారు. పరీక్షలలో ఉత్తీర్ణతతో సంబంధం లేకుండా విద్యార్థులు పై తరగతులకు వెడతారు. ప్రాథమిక స్థాయిలో పిల్లల ఎన్‌రోల్‌మెంట్ పెంచడం, ఆహ్లాదకరమైన అభ్యసనం, పరీక్షల పట్ల భయం తగ్గించడం, డ్రాప్ ఔట్స్ కాకుండా చూడటం నో డిటెన్షన్ పాలసీ ప్రధాన లక్ష్యాలు.

అయితే ఈ విధానం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, అసెర్ నివేదికలు తెలుస్తున్నాయి. విద్యార్థులలో అభ్యసన పట్ల శ్రద్ధ తగ్గిందని, ఫలితాలకు ప్రాధాన్యత లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించడం లేదని విమర్శకుల వాదన. అదే విధంగా 9, 10 తరగతుల్లో డ్రాప్ ఔట్స్ అధికం అవుతున్నాయని వీరి విమర్శ. ప్రాథమిక స్థాయిలో 100 శాతం ఎన్‌రోల్‌మెంట్ ఉండగా, 9, 10 తరగతుల్లో డ్రాప్ ఔట్ శాతం 17గా ఉండటం గమనార్హం.

నో డిటెన్షన్ విధానం వల్ల అభ్యసన సామర్థ్యాలు తగ్గుతున్నాయని, దానిని మార్చవలసిందిగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విజ్ఞప్తులు అందాయి. దేశంలో 23 రాష్ట్రాలు డిటెన్షన్ విధానాన్ని తీసుకురావాలని ప్రతిపాదించాయి. 2018లో విద్యా హక్కు చట్టానికి సవరణలు తెచ్చాక 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో డిటెన్షన్ విధానం అమలులోకి వచ్చింది. అయితే ఉభయ తెలుగు రాష్ట్రాలు నో డిటెన్షన్ విధానమే కొనసాగిస్తున్నాయి. మరికొన్ని రాష్ట్రాలు ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

నూతన విధానం ప్రకారం 5, 8వ తరగతి విద్యార్థులు సంవత్సరాంతంలో నిర్వహించే పరీక్షల్లో ఖచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి. ఉత్తీర్ణత సాధించని వారికి రెండు నెలల పాటు శిక్షణ అందించి, మళ్ళీ పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. రెండవసారి కూడా ఉత్తీర్ణత సాధించకుంటే అదే తరగతిలో కొనసాగిస్తారు. అదే తరగతిలో కొనసాగించినపుడు విద్యార్థి అభ్యసన లోపాలు గమనించి వాటిని పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలి. 8వ తరగతి పూర్తి చేయకుండా ఏ విద్యార్థినీ బడిలో నుంచి తొలగించరాదని కేంద్ర ప్రభుత్వం గెజిట్‌లో పేర్కొంది. అందరికీ విద్య అందాలి, కానీ అదే సమయంలో విద్యార్థులు ఆశించిన సామర్థ్యాలు పొందేందుకు నూతన విధానం దోహదపడుతుందని, అభ్యసనలో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందని కేంద్రం వాదన.

కానీ డిటెన్షన్ విధానం తిరోగాత్మక చర్యగా విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రాథమిక విద్యకు కూడా దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని విద్యాహక్కు చట్టం ఉద్యమకారులు వాదిస్తున్నారు. డిటెన్షన్ విధానం వల్ల పిల్లల్లో పరీక్షల పట్ల భయం పెరిగే అవకాశం ఉంది. ఫెయిల్ అయిన విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం ఉంది. వారిలో న్యూనతాభావం ఏర్పడుతుంది. మళ్ళీ అదే తరగతి చదవాల్సి రావటం వారిలో నిరాసక్తతను పెంచుతుంది. బాలకార్మికులు పెరిగే ప్రమాదం ఉంది. డిటెన్షన్‌ను అధిగమించేందుకు పరీక్షలలో అనైతిక విధానాలకు పాల్పడే అవకాశం ఉంది. ప్రాథమిక స్థాయిలో ఆహ్లాదంగా జరగాల్సిన అభ్యసనం ఆందోళనాయుతంగా ఉంటుంది. డిటెన్షన్ విద్యావిధానం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై, మొదటి తరం అభ్యాసకులపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణుల అభిప్రాయం.

నో డిటెన్షన్ విధానంలో ఉన్న లోపాలను అధిగమించేందుకు విద్యావ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలి. విద్యార్థుల అభ్యసనం, ఉపాధ్యాయుల బోధన అభివృద్ధిచెందేందుకు పర్యవేక్షణ ఉండాలి. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావాలి. నేర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించకుండా, డిటెన్షన్ ద్వారా అవరోధాలు సృష్టించడం వారిని శాశ్వతంగా విద్యకు దూరం చేస్తుంది. అందుకని డిటెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించాలి.

— డాక్టర్ అనుమాండ్ల వేణుగోపాలరెడ్డి

సినీ మా(యా) పరిశ్రమ

సినిమా నటులంటే బతుకుతెరువు కోసం లేదా వారికున్న నటనా వ్యామోహంతో నటించడానికి వస్తారు. ప్రజలు ఓహో అనేలా నటించవచ్చు. నిజమే అనుకునేంతగా భ్రమింపజేయవచ్చు, తమ నటనతో ప్రేక్షకులను కట్టిపడేయవచ్చు. దానికి తగిన పారితోషికం తీసుకుని వారి నటనలో వైవిధ్యాలను జోడిస్తూ కొత్త కొత్త నటకౌశలాలను ప్రదర్శించి మెరుగులు దిద్దుకోవచ్చు. అంతమాత్రాన వాళ్ళు దైవాంశ సంభూతులు అయిపోరు. అభిమానం ఉండొచ్చు, కానీ కని పెంచిన తల్లితండ్రులను, కష్టసుఖాల్లో ఆదుకునే తోడబుట్టినవాళ్ళు, కలిసి పనిచేసే సహోద్యోగులు, అవసరాల్లో ఆసరా అయ్యే మన చుట్టుపక్కల వారికన్నా వాళ్ళే గొప్పనుకునేంత శృతిమించిన దురభిమానంలోకి యువత జారిపోవటం దురదృష్టకరం.

మనిషికి అవసరం వినోదం. ఆ వినోదం శత్రువులను చెండాడే దేశభక్తికి, సమాజాన్ని ఉద్ధరించేందుకు అలాగే తనను తాను ఉద్ధరించుకునేందుకు తోడ్పడాలి. ఈ రోజున టీవీ షోలు మొదలుకుని సినిమాలు, సోషల్ మీడియా మాత్రమే కాదు, చివరికి ఒకటి, రెండు సంవత్సరాల వయసున్న చిన్నపిల్లల్ని కూడా అశ్లీల బట్టలతో నాట్యం చేయిస్తూ పైపెచ్చు... బట్టలెందుకు చూస్తారు, టాలెంట్ చూడండి అంటూ నిర్లజ్జగా సమర్థించుకోవడం కనిపిస్తుంది. పూర్వం అభిమానం సహజంగా పుడితే, నేడు సోషల్ మీడియా వేదికగా 'వైరల్' అనే వైరస్ జొరబడి కల్పించుకున్న అభిమానులకు.. తమకు తామే సృష్టించుకునే స్టార్‌డమ్‌ల వరకు ఎదిగి ఎదిగి... వందలు వేలల్లో ఉన్న పారితోషికాలు కోట్లల్లోకి వెళ్ళింది. అయితే, దర్శక నిర్మాతలు మాత్రం 'మేము సమాజంలో జరిగే నిజాల్ని జనాలకు చూపిస్తున్నాం' అంటూ తేనెపూసిన మాటలెన్ని మాట్లాడినా... ఒక హత్యో, అత్యాచారమో జరిగిందని తెలపడానికి, దాన్ని ఎలా తప్పించుకోవచ్చో కూడా జతచేసి వివరంగా సినిమా తీసి జనాల్లోకి వదలటం వల్ల పిల్లలు, యువత ప్రేరేపితమై చెడుదారి పట్టే అవకాశం కల్పించడానికి చాలా తేడా ఉంటుందని తెలిసి కూడా ధనవ్యామోహంతో ముందుకెళ్తున్నారు. ఒక సెలబ్రిటీగానో, ప్రజా నాయకుడిగానో గుర్తింపు పొందిన పౌరులు సమాజం పట్ల మరింత బాధ్యతగా ప్రవర్తించడం, మాట్లాడటం తమకు తామే అలవరుచుకోవాలి. ఎందరికో జీవనోపాధిని ఇస్తున్నామన్న పేరుతో సినిమానొక పరిశ్రమగా చేసి, వ్యాపారంగా మార్చామంటూ సమర్థించుకోవడం అంతకన్నా సరికాదు. జనం కూడా పాతకాలంలో లాగా తెరవెనుక నటులుంటారని, జరిగేదంతా నిజమనుకునే భ్రమ నుంచి తేరుకుని తామే నటులై సోషల్ మీడియాలో రాజ్యమేలుతూ కూడా, సినిమా నటుల్ని ఆకాశానికెత్తేస్తూ మొదటిరోజే సినిమా చూడకుంటే ప్రాణం పోతుందన్నంత మూర్ఖత్వంతో బతకడం శోచనీయం.

సమాజమా గుర్తించు... ఎవరి స్వార్థప్రయోజనాల కోసమో తయారై ప్రయోగించబడుతున్న మాయల ఉచ్చులోకి నిన్ను నువ్వే తోసేసుకుని నశించి పోకుండా జాగ్రత్తపడు. సైబర్ నేరాలు మాత్రమే కాదు అంతకు మించిన మాయ వలలు మనచుట్టూ అల్లుకుని ఉన్నాయని గుర్తెరిగి మసలుకుంటే కుటుంబాలు, దేశం బాగుంటాయి. దానివల్ల నీ జీవితమూ సుఖమయమౌతుంది.

— డేగల అనితాసూరి, హైదరాబాద్

పత్తి రైతుకు 'మద్దతు' లభించేదెప్పుడు?

మన దేశం పత్తి సాగులో ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. ఇక దేశంలో మహారాష్ట్ర, గుజరాత్ తర్వాత తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. ఆసియాలోనే డిమాండ్ ఉన్న తెలంగాణ పత్తి గురించి అందరూ చెప్పుకుంటున్నా, దాన్ని సాగు చేస్తున్న రైతుకు మాత్రం సాయం దక్కడం లేదు. పత్తి సాగు చేస్తున్న రైతులకు ఏటా మద్దతు ధర ప్రకటించడం వరకే ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. అది కూడా కంటితుడుపు చర్యగానే. ఏటా ఎరువులు, పురుగు మందుల ఖర్చు విపరీతంగా పెరిగిపోతోంది. దీనికితోడు స్థానికంగా ఉన్న భూమి, వాతావరణ పరిస్థితులు పత్తి పంట సాగులో ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ఇక్కడ ప్రధానంగా చెప్పుకోవాల్సిన విషయమేంటంటే 60శాతం మంది కౌలు రైతులే. దీంతో పత్తిపంట సాగు చేసేందుకు వీరు కౌలు రూపంలో అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి. మరోవైపు యాంత్రీకరణ వల్ల పనిముట్ల ధరలు, కూలీల రేట్లు అమాంతం పెరిగి రైతుకు పెట్టుబడి పెరుగుతోంది. దీనికితోడు బ్యాంకులు ఇచ్చే అప్పు సరిపోక, వడ్డీకి తెచ్చి పంట సాగు చేస్తే చివరకు పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో పంట నేలపాలవుతోంది. పత్తి ఏరేందుకు కూలీలను పిలిస్తే వారికి కిలోకు పది నుంచి పదిహేను రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. పంటను పొలంలో వదిలేయలేక ఇంటికి తెచ్చి అమ్ముకుందామంటే మార్కెట్లో తేమ, గూడు, రంగు మారిందని సీసీఐ కొనుగోలుకు ఆదిలోనే నిరాకరిస్తోంది. దీంతో రైతుల కష్టం పరోక్షంగా దళారుల పాలవుతోంది. తేమ 8 నుంచి 12 శాతం లోపు ఉంటేనే కొంటామని చెప్పడం, మద్దతు ధర రూ.7,525గా నిర్ణయించడంతో రైతులు వర్షానికి తడిసిన పత్తిని సీసీఐకి అమ్మలేక, ఇంటికి తీసుకెళ్లలేక చివరకు వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఈ ఏడాది పత్తి రైతులకు మార్కెట్లో వ్యాపారులు ఇచ్చిన ధర అక్షరాలా.. 6700 నుంచి 6900 మాత్రమే. ఇక చివరలో సీసీఐ కొనుగోలు చేసినా, తేమ తక్కువైనా మద్దతు ధర మాత్రమే లభించింది.

ఈ ఏడాది రాష్ట్రంలో నల్గొండ, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్, ఖమ్మంతో పాటు ఇతర జిల్లాల్లో అధికంగా పత్తిపంట సాగు చేశారు. మిగతా జిల్లాల్లో కాస్త తక్కువగానే పత్తిపంట సాగైందని వ్యవసాయ శాఖ చెబుతున్నది. మరి రాష్ట్రంలో సాగవుతున్న పత్తి పంటకు ఎకరానికి అవుతున్న ఖర్చెంత.. లభిస్తున్న ధర ఎంత.. రైతుకు ఎంత దక్కుతున్నదో తెలిస్తే.. అసలు వ్యవసాయం చేసే రైతుల పరిస్థితి ఇంత దయనీయంగా ఉంటుందా అనిపిస్తుంది.



పత్తి రైతుకు ఎకరానికి 65వేల నుంచి 75వేల వరకు ఖర్చవుతుంది. దళారుల వద్ద అప్పు తెస్తే నూటికి 25శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే 20వేల వరకు వడ్డీ చెల్లించాల్సిందే. అంటే ఎకరానికి మొత్తం 95వేల వరకు ఖర్చవుతుంది. ఎకరానికి చెలక అయితే 8 క్వింటాళ్లు, నల్లరేగడి అయితే 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటాలు పత్తిని మార్కెట్లో సీసీఐ ద్వారా విక్రయిస్తే ధర 7,525 రూపాయలు అనుకుంటే సుమారు 12 క్వింటాళ్ల పత్తి అమ్మితే 90,300 రూపాయలు వస్తాయి. మిగతాది రైతు జేబులో నుంచే అప్పు చెల్లించాలి. ఇక దిగుబడి తగ్గితే అప్పుల్లో కూరుకుపోవడమే. అదే తేమ అధికంగా ఉందని సీసీఐ నిరాకరించిన పత్తిని ప్రయివేటు వ్యాపారులకు అమ్మితే ధర 6,950గా నిర్ణయించినా, తేమ పేరుతో వారు 6,700 మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ లెక్కన 80,400 రూపాయలు మాత్రమే రైతుకు దక్కుతోంది. ఇక ప్రకృతి సహకరించక పంట నష్టపోతే అది అదనమే.

ఇక ప్రభుత్వం కనీస మద్దతు ధర అంటూ ఆర్భాటం చేస్తున్నా.. అది కూడా రైతుకు దక్కడం లేదు. అందువల్ల కార్పొరేట్ వ్యాపారులు ఎలా అయితే తమ ఉత్పత్తులకు తామే ధర నిర్ణయించి అమ్ముకుంటున్నారో, అలాగే రైతులకు కూడా ధర నిర్ణయించి విక్రయించుకునే వెసులుబాటు కల్పించాలి. రైతు వద్దకే వచ్చి పంట కొనుగోలు చేసే రోజులు రావాలి. బ్యాంకులు ఇచ్చే రుణాల పరిమితి పెంచాలి. ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ అంటూ ఆర్భాటపు ప్రచారాలు కాకుండా, రైతులకు ఏది అవసరమో.. పంట అమ్ముకునేందుకు ఏ విధంగా చర్యలు తీసుకుంటే వారికి లాభసాటిగా ఉంటుందో చూడాలి. నష్టమొస్తే దాన్ని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. రైతుకు సాయం కాదు.. పెట్టుబడి ఖర్చులు పోగా అతడు తన కుటుంబాన్ని పోషించుకునేందుకు అయినా కాస్త మిగిలేలా చూడాలి. అప్పుడే పత్తి రైతు నిలదొక్కుకోగలడు.

○ వామన్ మామిళ్ల





న్యూఇయర్ వేడుకలకు ఓరుగల్లు రెడీ

- 'వెల్కమ్' జోష్ కోసం ఎవరిప్లాన్స్‌లో వారు
- నగరంలో పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు
- మ్యూజిక్, డిస్కో డ్యాన్స్ నైట్‌తో హోరెత్తనున్న ఓరుగల్లు

4



గల్లీ గల్లీలో.. మఫ్టీ

న్యూఇయర్ వేడుకలపై పోలీస్ ఫోకస్

- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- పటిష్ట నిఘాకు కార్యాచరణ
- సివిల్ డ్రెస్‌లో షీటీమ్స్, ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ బృందాలు
- డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు డ్రగ్స్ టెస్టులు
- నగరంలో జరిగే పలు ఈవెంట్లపై నజర్
- వేడుకల్లో అశ్లీలం, అభ్యంతరకరం ఉంటే చర్యలు తప్పవు
- ర్యాష్ డ్రైవింగ్, డీజే మోతపై నిషేధం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నయాసాల్ ఈవెంట్స్‌పై పోలీసులు ఫోకస్ పెంచారు. గల్లీగల్లీలో మఫ్టీలో నిఘా పెడుతున్నారు. నూతన సంవత్సర వేడుకల వేళ పోకిరీల మత్తు దించేందుకు ఖాకీ బృందాలను రంగంలోకి దించుతున్నారు. డ్రగ్స్, గంజాయి తదితర నిషేధిత మత్తు పదార్థాలను ఆరికట్టేందుకు ఇతర శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. అర్ధరాత్రి 12.30గంటలలోపు హోటళ్లు, క్లబ్‌లను మూసి వేయాలని ఖాకీలు ఇప్పటికే హుకూం జారీ చేశారు. రాష్ డ్రైవింగ్, డీజేల మోతలపై నిషేధం విధించారు. స్పెషల్ ఈవెంట్లు జరిగే ప్రాంతాల్లో, సెలబ్రిటీస్ పాల్గొనే వేడుకల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తంగా పోలీసుల నిఘా నీడలో నయాసాల్ వేడుకలు జరగబోతున్నాయి.

డ్రగ్స్, గంజాయిపై ప్రధాన దృష్టి

ప్రధానంగా ఈవెంట్లలో డ్రగ్స్ ఊసేలేకుండా చేసేందుకు షీటీమ్స్, ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ, నార్కోటిక్స్ తదితర విభాగాలతో కలిసి వరంగల్ కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా నిఘా పెట్టారు.

ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలు రవాణా కాకుండా ఇప్పటికే నిఘా పెట్టారు. గతంలో గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల కేసుల్లో అరెస్ట్ అయినా పాత నిందితుల కదిలికలపై నిఘా పెట్టారు. వరంగల్ ఈస్ట్ సిటీలో మిల్స్‌కాలనీ, మామునూరు, ఎనుమాముల పోలీస్ స్టేషన్‌పరిధిలో గంజాయి కేసులు ఎక్కువ నమోదవుతుండటంతో పలు కాలనీల్లో పోలీసులు మఫ్టీలో తిరుగుతున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే హనుమకొండ, సుబేదారి, కేయూ, హసన్‌పర్తి, కాజీపేట, మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఈవెంట్స్‌పై ఖాకీలు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా

మిగతా 4వ పేజీలో...

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఖిలావరంగల్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఖిలావరంగల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖిలావరంగల్ మండలంలో సుమారు ఆరువేల మంది గుడిసెవాసులు ఉన్నారని, వారికి ఇళ్ళ పట్టాలిస్తామని, పక్కాఇళ్ళు నిర్మిస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు మాటతప్పాయన్నారు. బీజేపీ ప్రభుత్వం సైతం ఇళ్ళు లేని పేదలకు ఆవాస్ యోజన కింద ఇళ్ళు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా పేదలకు ఇంటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సింగారపు బాబు, చుక్క ప్రశాంత్, ఆవుల ఉదయ్, ఉదయశ్రీ, ధర్మారపు సాంబమూర్తి, టి.భవానీ, మంజుల, మల్లన్న, సమీనా, ప్రకాశ్, భాగ్య, స్వాతి, ఎమ్డీ జరీనా, లక్ష్మి, మానస, అప్పాజీ, కవిత, స్వరూప, శంకర్, ఆసిస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి..

- స్వచ్ఛ ఆటోలతో డ్రైవర్ల ధర్నా
- బల్దియా కార్యాలయం ఎదుట ఉద్రిక్తత


బల్దియా ఎదుట బైఠాయించిన స్వచ్ఛ ఆటో కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 31తో తమ అగ్రిమెంట్ కాలం ముగుస్తుందని తిరిగి తమ ఆటోలతో పాటు తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్వచ్ఛ ఆటో ఓనర్ కం డ్రైవర్లు బల్దియా ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. దీంతో బల్దియా ఎదుట ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్వచ్ఛ ఆటో ఓనర్ కం డ్రైవర్లు వందకు పైగా ఆటోలతో ధర్నాకు దిగారు. బల్దియా కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ అధికారుల తీరుపై నినాదాలు చేశారు. బల్దియా స్వచ్ఛ ఆటో డ్రైవర్ కం ఓనర్ల సంఘం అధ్యక్షుడు మురళి, కోశాధికారి విజయ్‌కుమార్ సంయుక్తంగా మాట్లాడారు. ఈ నెల 31తో తమ అగ్రిమెంట్ కాలం ముగుస్తుందని తిరిగి తమ ఆటోలతో పాటు తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాల అగ్రిమెంట్‌పై తమను బల్దియాకు నియమించుకుని బ్యాంకులలో ఆటోలో ఇప్పించి అప్పుల పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నెలకు రూ. 36 వేలు ఇస్తామని చెప్పి 2021 నుంచి నెల వారి జీతాలు సమయానికి వేయకపోవడంతో పాటు బల్దియా తమ బ్యాంకు కిస్తీలు చెల్లించకపోవడంతో బ్యాంకు డిఫాల్టర్‌లుగా ముద్ర పడి ఏ రుణానికి నోచుకోకుండా పోయామన్నారు. తమ అగ్రిమెంట్ ఐదు సంవత్సరాలు అని చెప్పి మరో రెండు సంవత్సరాలు అదనంగా పని చేయించుకున్నారని కరోనా కాలానికి సంబంధించిన 24 నెలల జీతాలు కూడా బల్దియా చెల్లించాలని డిమాండ్ చేశారు. చివరికి సీఎంహెచ్‌వో రాజారెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ధర్నా వద్దకు వచ్చి న్యాయం జరిగే విధంగా చూస్తామని, మరో మూడు మాసాలు అగ్రిమెంట్ పొడిగిస్తున్నట్టు చెప్పారు. దీంతో ధర్నా విరమించారు. సుమారు మూడు గంటల పాటు బల్దియా ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ కార్యక్రమంలో సుమారు వంద మంది ఆటో ఓనర్ కం డ్రైవర్లు పాల్గొన్నారు.

నేటి బల్దియా కౌన్సిల్ సమావేశం వాయిదా

త్వరలో మరో తేదీ ప్రకటిస్తామన్న కార్యదర్శి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య (కౌన్సిల్) సమావేశం మంగళవారం జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్టు బల్దియా సెక్రెటరి అలివేలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. భారత మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్ దివంగతులైన కారణంగా ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సంతాప దినాలు జరుగుతుండడంతో కౌన్సిల్ సమావేశం వాయిదా వేసినట్టు తెలిపారు. తిరిగి కౌన్సిల్ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారు అనేది త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

మరింత.. సహకారం



సిబ్బందిలేక ఇబ్బందులు..

- సొసైటీల బలోపేతానికి కేంద్రం కార్యాచరణ
- త్వరలో అందుబాటులోకి 23 రకాల డిజిటల్ సేవలు
- కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటు
- ఇప్పటికే పెట్రోల్ బంకులు, గోదాముల నిర్మాణానికి అనుమతి
- ప్రభుత్వ నిర్ణయంతో సమకూరనున్న ఆర్థిక పరిపుష్టి
- ఉమ్మడి జిల్లాలో 92 సహకార సంఘాలు
- సాంకేతిక సహకారం లేకుండా సాధ్యమేనా?
- పల్లెల్లో ఇంటర్నెట్ పని చేయక ఇబ్బందులు

హనుమకొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోబోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీఎస్) ఆధునికీకరించేందుకు ఉపక్రమిస్తోంది. అన్ని పీఏసీఎస్‌లలో డిజిటల్ సేవా పోర్టల్‌లో అందుబాటులో ఉన్న అన్ని రకాల సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ), మీ సేవా లాంటి ఆన్‌లైన్ సేవలను ప్రవేశపెట్టి ప్రజలకు సేవలను అందించడంతో పాటు సంఘాలకు ఆదాయం సమకూర్చి బలోపేతం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 92 పీఏసీఎస్‌లకు ఆర్థిక పరిపుష్టి సమకూరనుంది. గతంలో ఉమ్మడి జిల్లాలో 232పీఏసీఎస్‌లు ఉండగా.. ఎన్టీఆర్ హయాంలో నష్టాల్లో ఉన్న సంఘాలను లాభాల్లో ఉన్న వాటిలో విలీనం చేయడంతో వీటి సంఖ్య 92కు తగ్గింది. అయినా చాలా సంఘాలు ఆర్థిక పరిపుష్టిలేక రైతులకు పూర్తి స్థాయిలో సేవలను అందించలేక పోతున్నాయి. వీటిని బలోపేతం చేయడానికి గత ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకున్నాయి. సహకార రంగంలో సంస్కరణల ఫలితంగా ఇటీవల వీటి పరిస్థితి కొంత మెరుగైంది. అయితే వీటిని మరింత బలోపేతం చేసేందుకు కసరత్తు జరుగుతోంది. పీఏసీఎస్‌లు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాల విక్రయం, వ్యవసాయ రుణాలు అందచేయడం లాంటి సేవలను అందిస్తున్నాయి. వీటితో పాటు పెట్రోల్ బంకుల నిర్వహణ, గోదాముల నిర్మాణం, సూపర్ మార్కెట్ల ఏర్పాటు లాంటి వ్యాపారాల ద్వారా అవి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నాబార్డు వాటికి రుణసహాయాన్ని కూడా అందజేస్తోంది. దీనితో ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కొత్త వ్యాపారాల్లోకి అడుగు పెట్టి లాభాలు గడిస్తున్నాయి.

23 రకాల సేవలు

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పీఏసీఎస్‌లో కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సేవలను వీటి ద్వారా అందిస్తారు. దీని కోసం ఇప్పటికే ఆయా సంఘాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు, సీఈవోలకు సాంకేతిక శిక్షణ అందించారు. కేంద్రాల ఏర్పాటు కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. ప్రజలకు ఆధార్ కార్డు ద్వారా నగదు తీసుకునేలా మినీ ఏటీఎం, ఆదాయం, ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు, బీమా పింఛన్లు, రుణాల చెల్లింపులు, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, ఆప్‌డేట్, ఆధార్ అనుసంధాన ప్రక్రియ లాంటి పనులు చేయనున్నారు. రుణాలు పొందేందుకు దరఖాస్తులు, పాస్‌పోర్టు, రిజిస్ట్రేషన్లు, మొబైల్, డీటీహెచ్ రీచార్జ్‌లు, పాన్, ఓటరు గుర్తింపు కార్డులు లాంటివి చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఎల్‌పీజీ సౌకర్యం, వ్యవసాయం, స్కిల్ డెవలప్‌మెంట్, హెల్త్ సర్వీసులు, ఎంప్లాయిమెంట్ సేవలందించనున్నారు. రేషన్‌కార్డు, ఓటరు కార్డు దరఖాస్తు, వాహన బీమా, డ్రైవింగ్ లైసెన్సు, ఈపీఎఫ్ సేవలు, ఐటీఆర్ ఫిల్లింగ్, ఎన్‌పీఎస్ రిజిస్ట్రేషన్, విమానం, రైల్వే, బస్సు బుకింగ్, న్యాయ సలహాలు, ఈ-స్టోర్, ఈ-శ్రమ్ కార్డు, పీవీసీ కార్డు, డాక్‌మిత్ర స్పీడ్ పోస్టు, ఫసల్ బీమాయోజన, ఎల్ఐసీ చెల్లింపులు, ఆయుష్మాన్ భారత్, జీవన్ ప్రమాన్ లైఫ్ సర్టిఫికెట్, హెల్త్ ఇన్సూరెన్స్, తదితర సేవలు సంఘాల ద్వారా జరిగేలా ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు రైతులకు అవసరమైన ప్రతీ వస్తువు కొనుగోలు చేసేందుకు సంఘంలోనే ఆన్‌లైన్ నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. జనరిక్ ఔషధాలను అందుబాటులో ఉంచడం, ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేట్ వైద్యుల ద్వారా ఆన్‌లైన్ సలహాలు, సూచనలు, రక్త నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ కూడా అందేలా చూస్తారు. కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రుణ సహాయం చేస్తుంది.

బలోపేతానికి కార్యాచరణ

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయడానికి కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఇప్పటికే సంఘాల్లోని సిబ్బందికి శిక్షణ ఇచ్చి సీఎస్‌సీ సెంటర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఏసీఎస్‌ల ద్వారా డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం వల్ల పల్లె ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఆన్‌లైన్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తప్పుతాయి.

సంఘాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించకుండా ఇప్పటికే విధులు నిర్వహించే వారితో సేవలను అందించాలని నిర్ణయించడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. కంప్యూటర్ ఆపరేటర్లు, సీఈవోలకు శిక్షణ అందించినా పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో కొందరు సీఈవోలు నిరాసక్తత చూపుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సేవలు పెంచితే ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానం సరిపోతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కోర్ బ్యాంకింగ్ ద్వారా రోజువారీ ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మోడెం ద్వారా ఇవి జరుగుతున్నాయి. సేవలు పెరిగితే ఇది సరిపోదు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావాలంటే అందుకు తగిన విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లోని చాలా సంఘాలకు సొంత భవనాలు లేవు. సొంత భవనాలు ఉన్న సంఘాల్లో కనీస సౌకర్యాలు లేవు. గ్రామాల్లో ప్రధానంగా ఇంటర్నెట్ సమస్య ఆన్‌లైన్ సేవలకు అడ్డంకి కానుంది. ఇప్పటికే పలు సంఘాల్లో ఇంటర్నెట్ సరిగా పని చేయక సర్వర్‌డౌన్ సమస్యను ఎదుర్కొంటున్నారు.

సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి వచ్చే బాధితుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 140 వినతులు వచ్చాయి. బాధితుల నుంచి కలెక్టర్ ప్రావీణ్య ఓపికగా వినతులు స్వీకరించి సంబంధిత అధికారిని పిలిచి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ప్రజలకు ప్రజావాణికి వస్తే సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం కలిగించాలని, ప్రజల సమస్యల పరిష్కరిస్తే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. ప్రజావాణిలో డీఆర్‌వో వై.వి గణేష్, పాల్గొన్నారు.

- తమ కుమారుడు తమకు అన్నం పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నాడని హనుమకొండ ఇందిరానగర్‌కు చెందిన వృద్ధ దంపతులు సదువాల కోర్వి కనకమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- వృద్ధుడినైన తనకు వృద్ధాప్య పెన్షన్ రావడం లేదని, పెన్షన్ ఇప్పించాలని జిల్లాలోని ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన గోపు ఐలయ్య ఫిర్యాదు చేశారు.


హనుమకొండలో బాధితుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య


వరంగల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య శారద

వెంటనే పరిష్కరించాలి: సత్యశారద

వరంగల్ కలెక్టరేట్ : ప్రజావాణిలో ఫిర్యాదులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఆమె ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణికి అధిక సంఖ్యలో భూ సంబంధిత దరఖాస్తులు వస్తున్నాయని, వాటిని సాధ్యమైనంత వరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 122 వినతులు అందగా శాఖల వారీగా ఎండార్స్ చేశారు. భూ సంబంధిత సమస్యలపై 36, జిల్లా విద్యాశాఖకు 6, జిల్లా పంచాయతీ శాఖకు 8, జడ్పీ సీఈవో 18, జీడబ్ల్యూఎంసీ 8 వినతులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- వృద్ధాప్యంలో ఉన్న తమను కుమారుడు పట్టించుకోవడంలేదని గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన గట్టు నర్సిరెడ్డి ఫిర్యాదు చేశారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మోహన్‌సింగ్

ఎంజీఎంను పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలోని అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మోహన్ సింగ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జ్వరాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. చలికాలం నేపథ్యంలో వృద్ధులు, పిల్లల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద, ఏఎన్ఎం సులోచన, రాము, రాజేష్‌ఖన్నా పాల్గొన్నారు.

డీసెట్ ఫేజ్-3 వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డీసెట్-2024లో అర్హత సాధించి ఫేజ్-1, 2లలో వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోని అభ్యర్థులు జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు ఎంపిక చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ.అబ్దుల్ హై సోమవారం ప్రకటనలో కోరారు. 9న సీట్ల కేటాయింపు ఉంటుందని, 13 లోపు ఫీజు చెల్లించి ఫైనల్ అడ్మిషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకొని 16న సంబంధిత కళాశాలలో రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



విష్ణు (ఫైల్)

గీసుగొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ చదువుతున్న విద్యార్థి తల్లిదండ్రులకు తెలియకుండా ఫైనాన్స్‌లో బైక్ తీసుకున్నాడు. హైదరాబాద్‌లో ఆక్సిడెంట్ చేయడంతో కేసు నమోదైంది. దీనికి తోడు ఫైనాన్స్ కిస్తీలు కట్టలేకపోయాడు. దీంతో మనస్తాపం చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గీసుగొండ మండలం నందనాయక్‌తండాకు చెందిన బాదావత్ విష్ణు(22) హనుమకొండలో ఉంటూ ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొద్ది నెలల క్రితం తను తల్లిదండ్రులకు తెలియకుండా ఫైనాన్స్‌లో బైక్ తీసుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లగా అక్కడ యాక్సిడెంట్ అయింది. దీనిపై పోలీసులకు కేసు నమోదు చేశారు. ఇటీవల క్రిస్మస్ పండుగకు స్వగ్రామానికి రాగా బైక్ ఎక్కడిది అని తల్లిదండ్రులు అడిగితే హైదరాబాద్‌లో జాబ్ చేస్తూ ఫైనాన్స్‌లో తీసుకున్నానని చెప్పాడు. అనంతరం ఈ నెల 26న కాలేజీ వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. ఈలోగా ఏం జరిగిందో తెలియదు.. కాని, సోమవారం ఉదయం విష్ణు తల్లిదండ్రులు వ్యవసాయబావి వద్దకు వెళ్లేసరికి అక్కడ బైక్, చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. దీంతో విష్ణు బావిలో దూకి మృతిచెంది ఉంటాడనే అనుమానం వచ్చి 100కు డయల్ చేయగా ఫైర్‌సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బావిలో నీటిని తోడగా అతడి మృతదేహం బయటపడింది. హైదరాబాద్‌లో యాక్సిడెంట్ కేసు ఒకవైపు, మరోవైపు ఫైనాన్స్ కట్టలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని తల్లిదండ్రులు అనుమానిస్తున్నారు. తండ్రి నరసింహ ఫిర్యాదు మేరకు సీఐ మహేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తగూడ అడవిలోకి పెద్దపులి ?



రుద్రగూడెం ఏనే అడవిలో గాలిస్తున్న డ్రోన్

నల్లబెల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుద్రగూడెం గ్రామ శివారులోని రైతు భయ్యా వెంకటేష్ పంట చేనుకు మందు కొడుతుండగా పులి పిల్ల కనబడినట్లు తెలిపారు. దీంతో పోలీసులు, ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలిని పరిశీలించారు. అవి పులిపిల్ల అడుగులు కావని తేల్చారు. ఏనే అడవిలో డ్రోన్ కెమెరాతో ఫారెస్ట్ అధికారులు సోమవారం గాలించి ఇక్కడ లేదని తేల్చారు. పులి ఏనే అడవికి మూడు రోజుల ముందు వచ్చింది నిజమే కానీ, ప్రస్తుతం పులి పాదముద్రల ఆనవాళ్లతో అది కొత్తగూడ అడవిలోకి వెళ్లి ఉంటుందన్నారు. ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి సోమ, ఎస్సై గోవర్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరో పాపం..!

నగరంలో గుర్తు తెలియని మృతదేహాలు

ఈ యేడాది 99 మంది మృత్యువాత

ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ అసువులుబాస్తున్న అభాగ్యులు



గుర్తు తెలియని మృతదేహం(ఫైల్)

మట్టెవాడ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వారెవరో తెలియదు.. ఎక్కడి నుంచి వస్తున్నారో తెలియదు.. ఎంజీఎం ఆస్పత్రి, వరంగల్ రైల్వేస్టేషన్, వరంగల్ స్టేషన్ రోడ్డు, దేవాలయాల పరిసరాల్లో ఆవాసం పొందుతూ.. ఏదో ఒకరోజు అసువులు బాస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల జాబితాలో మిగిలిపోతున్నారు. ప్రతీ నెల 10-12 మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఈ ఏడాదిలో 99 గుర్తుతెలియని మృతదేహాలను గుర్తించారు. వారి ఆచూకీ కనుగొనడం పెద్ద సమస్య అవుతోంది.

మృతదేహాల గుర్తింపు సమస్య...

ఆత్మహత్యలు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు ఇలా అనేక ఘటనల్లో చనిపోయిన వారి మృతదేహాలను గుర్తు పట్టడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఇలా 2021 నుంచి 2024 వరకు నాలుగేళ్లలో 465 గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమైనట్లు పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ రికార్డులు తెలుపుతున్నాయి. సిబ్బంది కొరత, పని ఒత్తిడి వల్ల మృతదేహాల గుర్తింపు కష్టసాధ్యం అవుతోందని పోలీసులు అంటున్నారు.

భద్రపరిచేది నాలుగు రోజులే..

గుర్తుతెలియని మృతదేహాన్ని నాలుగు రోజుల పాటు ఎంజీఎం మార్చురీలో భద్రపరుస్తారు. పంచనామా తర్వాత వాల్‌పోస్టర్లు.. ప్రకటనలతో పాటు అనేక రకాలుగా మృతదేహాలను గుర్తు పట్టేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తారు. అయినప్పటికీ ఎవరూ రాకపోతే మృతదేహాలను ఖననం చేసేందుకు మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగిస్తారు.

ఆవాసం.. ఆహారమే కారణం..

ఎంజీఎం ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో నిత్యం అన్నదానాలు జరుగుతుంటాయి. విశాలమైన రోడ్లు ఉండటంతో పాటు ఎంజీఎం పరిసరాల ప్రాంతాల్లో దేవాలయాలు ఉండటంతో అనేక మంది యాచకులు దాతలు ఇచ్చింది తింటూ కాలం గడుపుతుంటారు. తదుపరి అనారోగ్యంతో రోడ్డుపైనే మృతి చెందుతూ ఉంటారు.

అయినవారే వదిలేసుకుంటున్నారా..

అనాథల చావుల వెనుక మరో కోణం దాగిఉందనే వాదనలు విన్పిస్తున్నాయి. వృద్ధాప్యం కారణంగా, మానసిక స్థితి సరిగాలేని కారణంగా వారిని కుటుంబ సభ్యులు భారంగా భావించి వదిలేస్తున్నారనే వాదనలు ఉన్నాయి. వయస్సు పైబడి అనారోగ్యంతో బాధపడే వారిని ఎలాగైనా వదిలించుకోవాలనే ఉద్దేశంతో కొందరు వారిని వాహనాల్లో తిసుకువచ్చి ఎంజీఎంలో చేర్పించి చిరునామా ఇవ్వకుండా వెళ్ళిపోతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. కొంత మందిని ఆస్పత్రి ఆవరణలోనే వదిలివెళ్తున్న వారు కూడా ఉన్నారు.

ఆలయ భూముల దుర్వినియోగం

- ఎలక్ట్రికల్ బస్సుల పార్కింగ్‌కు ఇవ్వొద్దు
- సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేటాయించవద్దు
- గవర్నర్‌కు దేవాలయ పరిరక్షణ సమితి విజ్ఞప్తి

హనుమకొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవాలయ భూములను ధార్మిక సేవల కోసం కాకుండా ఇతరత్రా వాటికి వినియోగించరాదని, వాటిని ఆదాయార్జన కోసం ఇతరవాటికి లీజుకు ఇవ్వరాదని దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చీకటి రాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం గవర్నర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఎలక్ట్రిక్ బస్సు నిర్వహణ బాధ్యతను వాటికి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది తెలిసిందే. అయితే ఈ బస్సుల పార్కింగ్‌కు, అలాగే సోలార్ ప్లాంట్ల ఏర్పాటు సైతం రాష్ట్రంలోని ఆయా దేవా లయాలకు చెందిన 231 ఎకరాల భూమిని లీజుకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా ఇవ్వ డాన్ని చీకటి రాజు తప్ప పట్టారు. ఇలా చేయడం దేవాదాయ, ధర్మాదాయ చట్టం సెక్షన్ 17,21లకు విరుద్ధమని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇతర మతాలకు చెందిన ప్రార్థనా మందిరాలకు చెందిన భూముల జోలికి వెళ్లకుండా ఒక్క హిందూ దేవాలయాల భూములనే అభివృద్ధి, సంక్షేమం పేరుతో అన్యులకు అప్పగించాలని చూడడం దారుణమని అన్నారు. ఇలాంటి చర్య అన్ని మతాలను సమా నంగా చూడాలన్న, వాటి హక్కులను కాపాడాలన్న రాజ్యాంగంలోని అధికరం 14కు విరుద్ధమని రాజు అభిప్రాయపడ్డారు. హిందూ దేవాలయాల భూములు, ఆస్తులను మాత్రమే ప్రభుత్వ ఆదీనంలోకి తీసుకొని ఇలా హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి చర్యలను మానుకోవాలని, దేవాలయాల భూ ములకు పూర్తి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

యేడాదైనా పునాది కూడా తీయలే

- ముందుకు సాగని వరంగల్ బస్టాండ్ పనులు
- ఈ దుస్థితికి మంత్రి కొండా సురేఖ అసమర్థతే కారణం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్



మహాధర్నాలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

గిర్మాజీపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం గడిచినా ఇంత వరకు వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో ఎలాంటి కదలికలేదని, కనీసం పునాదులు కూడా తీయలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ఆరోపించారు. ఈ దుస్థితికి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ కోట్ల రుపాయలతో వరంగల్ రైల్వేస్టేషన్‌ను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తుంటే దీనికి ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణ పనులు కనీసం ప్రారంభించకపోవడం మంత్రి పనితీరుకు నిదర్శనమని అన్నారు. ఇందుకు నిరసనగా సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో బస్‌స్టేషన్ నిర్మాణ స్థలంలో వరంగల్ ఆత్మగౌరవ పోరాటం పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. గత శాసనసభ ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోట్ల రూపాయలతో అధునాతన బస్టాండ్ నిర్మిస్తున్నట్లు ప్రకటించి అప్పటి మంత్రి కేటీఆర్‌తో శిలాఫలకం వేయించారని, పాత భవనాన్ని కూల్చివేయడంతో ప్రజలు రోడ్డున పడ్డారని విమర్శించారు. తాత్కాలిక బస్‌స్టేషన్‌లో కనీస సదుపాయాలు లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సర కాంగ్రెస్ పాలనలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. తక్షణం బస్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీ సీతారాంనాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో బీజేపీకి ఎమ్మెల్యేలు లేకున్నా నగర అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కోట్ల రుపాయలు కేటాయిస్తున్నదని, కేంద్రం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రిబ్బన్‌లు కట్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ, మామునూరు ఎయిర్‌పోర్టు, ములుగు గిరిజన యూనివర్సిటీ, ప్రపంచ పర్యాటక ప్రాంతంగా రామప్ప అభివృద్ధి కోసం కేంద్రం కోట్ల రుపాయలు వెచ్చిస్తోందని అన్నారు. మహాధర్నాలో బీజేపీ నాయకులు రత్నం సతీష్ షా, గురుమూర్తి, వంగాల సమ్మిరెడ్డి, బాకం హరిశంకర్, రాణాప్రతాప్ రెడ్డి, పరమేశ్వర్, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 8 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్ చందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ చందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 30 : (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రికెటర్లను గుర్తించి వారిని ప్రోత్సహించడమే ధ్యేయంగా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ఆధ్వర్యంలో జనవరి 8 నుంచి 18 వరకు జిల్లా స్థాయి తెలంగాణ గోల్డ్ కప్ పేరుతో మెగా క్రికెట్ టోర్నీని నిర్వహించనున్నట్లు టీసీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం హనుమకొండ సుబే దారిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో విజయ్‌చందర్‌రెడ్డి పాల్గొని క్రికెట్ టోర్నీ వివరాలను వెల్లడించారు. బీసీసీఐ గైడ్ లైన్స్‌తో జనవరి 8న హనుమకొండ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఓపెన్ టూ అల్, బాలుర, పురుషుల క్రికెట్ టోర్నీ ప్రారంభమై జనవరి 18 వరకు నగరంలోని వివిధ క్రికెట్ క్రీడా మైదానాలలో 20 ఓవర్లతో లీగ్ కం నాకౌట్ పద్ధతిన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనే ఒక్కో జట్టు రూ.5 వేల ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుదని, జిల్లా స్థాయి టోర్నీలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25వేలు నగదు పారితోషికం అందించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఒక్కో జిల్లా నుంచి ఒక్కో జట్టును జనవరి 26 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి గోల్డ్ కప్ ప్రీమియర్‌లీగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)పూర్తిగా అవినీతిలో కూరుకుపోవడంతో కోర్టులు, సీబీఐ, ఇతర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టిన సంగతి తెలిసిన విషయమే అన్నారు. హెచ్‌సీఏ హైదారాబాద్ నగరానికే పరిమితమై హెచ్‌సీఏ సభ్యులు వారి పిల్లలను ప్రోత్సహించుకోవడానికే తప్ప ప్రతిభ కలిగిన క్రికెటర్లను పట్టించుకోవడం లేదని విమర్శించారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఒక్క రంజీ స్థాయిలో ఆడే క్రికెటర్‌ను తయారు చేయకపోవడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రికెటర్లను తయారు చేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. టీసీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి జయపాల్ మాట్లాడుతూ... ఏదైన అసోసియేషన్లు ముందుగా జిల్లా స్థాయిలో క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించి అందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని కానీ హెచ్‌సీఏ సభ్యులు మాత్రం ముందస్తుగా రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి తదుపరి జిల్లా ఎంపిక పోటీలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. డిసెంబరు 31 నుంచి క్రికెట్ టోర్నీలో పాల్గొనే జట్ల నుంచి ఎంట్రీలను స్వీకరించడం జరుగుతుందన్నారు. క్రికెట్ క్రీడా అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అవసరమన్నారు. ఈ సమావేశంలో టీసీఏ జిల్లా సంయుక్త కార్యదర్శి అలీ, సమీఅక్మల్, సీనియర్ క్రికెటర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పులలో బైక్ చోరీ.. నగరంలో షికారు..

పట్టుకున్న వరంగల్ ట్రాఫిక్ పోలీసులు



బైక్‌ను యజమానికి అప్పగిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

మట్టెవాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా దేవరుప్పలలో బైక్ చోరీ చేసిన వ్యక్తి నగరంలో షికార్లు కొడుతూ ట్రాఫిక్ పోలీసులకు దొరికిపోయాడు. వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎమ్డీ సాజిద్ సోమవారం రైల్వేస్టేషన్ వద్ద ఓ వ్యక్తి బైక్‌పై అనుమానస్పదంగా తిరుగుతుండటాన్ని గమనించారు. వెంటనే సదరు బైక్ నెంబరును ఆన్‌లైన్‌లో చూడగా వచ్చిన ఫోన్ నెంబరుకు కాల్ చేసి అడుగగా తన బైక్ ఆదివారం రాత్రి అపహరించారని, తాను వెతుకుతున్నాని తెలిపాడు. వెంటనే అతడిని వరంగల్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు పిలిపించి నిందితుడితో పాటు బైక్‌ను స్టేషన్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ వివరాలు సేకరించి బైక్‌ను యజమాని జోగు మహేందర్‌కు అందజేశారు. కానిస్టేబుల్ ఎమ్డీ సాజిద్ పాషాను అభినందించారు.

ఇద్దరు ఎస్సైలు బదిలీ

వరంగల్ క్రైం, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పరిధిలో పని చేస్తోన్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మసాగర్ పీఎస్‌లో ఉన్నయు. నరసింహారావును సీసీఆర్‌బికి, ఐటి కోర్‌లో ఉన్న పి. రాజ్‌కుమార్‌ను మడికొండ పీఎస్‌కుబదిలీ చేస్తూఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇట్స్ పార్టీ టైమ్..

- న్యూఇయర్ వేడుకలకు ఓరుగల్లు రెడీ
- 'వెల్కమ్' జోష్ కోసం ఎవరిప్లాన్స్‌లో వారు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నగరంలో నయాసాల్‌కా జోష్ ప్రారంభమైంది. గతం కంటే భిన్నంగా ఈ ఏడాది నగరంలో వేడుకల సందడి కొత్త ఒరవడిని సృష్టిస్తోంది. పార్టీ కల్చర్ పెరిగినట్టుగా ఏర్పాట్లను చూస్తే అర్థమవుతోంది. అంతేకాదు సోమవారం ఎవరి నోట విన్నా న్యూఇయర్ వేడుకల ముచ్చట్లే. 'హే ఇట్స్ పార్టీ టైం.. చిల్ అవుదాం ఎంజాయ్ చేద్దాం అంటూ స్నేహితులు..' మీ న్యూఇయర్ ప్లాన్స్ ఏంటి?' అంటూ పెద్దలు చర్చించుకోవడం కనిపించింది. మంగళవారం రాత్రి జరుపుకోబోయే న్యూఇయర్ వేడుకల గురించే సర్వత్రా చర్చ సాగింది. తమ ఏరియాలో మ్యూజికల్ అండ్ డ్యాన్స్ నైట్ షో ఉందని ఒకరు... హరిత హోటల్‌లో ది స్లయ్ బాండ్ మ్యూజిక్ నైట్ ఉంది.. ముక్క, చుక్కతో పాటు మ్యూజిక్ ఎంజాయ్ చెయ్యొచ్చని.. అక్కడికే వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇంకొకరు తమ ప్లాన్స్‌ను షేర్‌చేసుకున్నారు. మరికొందరైతే తమ స్నేహితుల ఇంట్లో ఫ్యామిలితో పార్టీ చేసుకుంటున్నామని, లేదంటే ఫామ్‌హౌస్‌లో ఫ్రెండ్స్‌తో చిల్ అవుతామని చెబుతున్నారు. ఓరుగల్లు వాసులు ఈ సారి హైదరాబాద్ తరహాలో న్యూ ఇయర్ జోష్‌లో మునిగితేలేందుకు రెడీ అవుతున్నారు.

ఈ సారి వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాల్లో హనుమకొండ సుబేదారిలోని కాఫీ లాంచ్‌లో మ్యూజిక్ డిస్కో నైట్, కడిపికొండ, వరంగల్ క్లబ్, బీజేఆర్ గార్డెన్, హరితా హోటల్, టీటీడీల్లో పలు ఈవేంట్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలువురు మోడల్స్, సినీ ఆర్టిస్టులు, సంగీత కళాకారులు రంగంలోకి దిగుతున్నా రు. హరితలో అయితే ముక్క, చుక్కతో పాటు మ్యూజి క్‌ను ఆస్వాదించేలా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఇక ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేసేవారు ఓపెన్ ఎయిర్ పార్టీలకు ప్రాధాన్యమిస్తున్నారు. డెస్టినేషన్ పార్టీస్ చేసుకునేందుకు కొందరు నగరం నుంచి స్వస్థలాలకు వెళుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లభించే పొద్దాడు కల్లుతో పాటు నాటు కోడి, మాంసంతో విందుకు రెడీ అవుతున్నారు. కొంతమంది యువ ఉద్యోగులు, వ్యాపా రులు, న్యూఇయర్ సంబరాల కోసం హైదరాబాద్, గోవా లాంటి ప్రాంతాలకు బయలుదేరుతున్నారు.

గల్లీ గల్లీలో.. మఫ్టీ

(3వ పేజీ తరువాయి)

న్యూఇయర్ వేడుకల్లో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవారిని గుర్తించేందుకు మఫ్టీలో షీటీమ్స్ రంగంలోకి దిగుతున్నాయి. సోమవారం నుంచే కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల డ్రగ్స్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్టు గుర్తిస్తే.. వారిపై కఠినంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధాన రోడ్లపై, కాలనీల్లో ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించవద్దని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా హెచ్చరించారు. నిబంధనల గీత దాటిన వారిపై 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

శృతి మించొద్దు..

డిసెంబరు 31వ తేదీని జీరో యాక్సిడెంట్.. జీరో ఇన్సిడెంట్ నైట్‌గా చేయడానికి పోలీస్‌శాఖ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాష్ డ్రైవింగ్‌పై ఖాకీలు ప్రత్యేకంగా నిఘా పెట్టారు. హనుమకొండ, వరంగల్ నగరాలతో పాటు జనగామ జిల్లా కేంద్రంలోనూ ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రత్యేకంగా పోలీసు టీమ్‌లను ఏర్పాటు చేశారు. విస్తృతంగా తనిఖీలు ఏర్పాటు చేసేలా ఏర్పాట్లు చేశారు. కాగా, న్యూఇయర్ వేడుకల్లో సభ్యత, భద్రత మరవద్దని సూచిస్తున్నారు. ముఖ్యంగా వరంగల్ మహానగరంలో రాత్రి 12.30గంటల వరకే నయాసాల్ వేడుకలు జరుపుకోవాలని ఖాకీలు హుకూం జారీ చేశారు. ప్రతీ ఈవెంట్లకు అనుమతి తప్పనిసరితో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

తాగి డ్రైవ్ చేస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో న్యూఇయర్ వేడుకలు జరుపుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలుంటాయని ఖాకీలు హెచ్చరిస్తున్నారు.

పోలీసుల మార్గదర్శకాలు ఇవే..

- కమిషనరేట్ పరిధిలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవటంతో పాటు సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాలను నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాలి.
- ఈవెంట్స్‌కు వచ్చే ఆర్టిసులతో పాటు పాల్గొనే వారు కూడా వస్త్రధరణలో పరిమితులు దాటొద్దు. అసభ్యకరంగా, అశ్లీలతకు తావులేకుండా ఉండాలి.
- ఈవెంట్లలో ఏర్పాటు చేసే సౌండ్ సిస్టమ్స్ పొరుగున ఇళ్లలో ఉండేవారికి ఇబ్బంది కలిగించకుండా ఉండాలి.
- న్యూఇయర్ వేడుకల్లో మాదకద్రవ్యాల వినియోగానికి తావు లేదు. వీటిని సేవించి వచ్చినవారిని గుర్తించి హోటల్స్, క్లబ్‌ల నిర్వాహకులు లోనికి రానివ్వద్దు.
- యువతకు సంబంధించి ఎలాంటి విశృంఖలత్వానికి తావు లేకుండా, మైనర్లు పార్టీలకు రాకుండా నిర్వాహకులే చూసుకోవాలి
- వరంగల్ నగరంలోని కొత్త ఎన్‌హెచ్‌పై ఏలాంటి పార్టీలకు అనుమతులు లేవు.

ప్రశాంతంగా న్యూఇయర్ వేడుకలు

- అంబర్ కిషోర్ ఝా, పోలీస్ కమిషనర్, వరంగల్

న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి. 31వ తేదీ రాత్రి 12.30గంటల లోపే ఈ వేడుకలు నిర్వహించుకోవాలి. వరంగల్ కమిషనరేట్ పరిధిలో షీటీమ్స్, ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ, నార్కోటిక్స్ తదితర విభాగాలతో కలిసి పర్యవేక్షిస్తున్నాం. అడుగడుగనా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతాం. ఈవెంట్‌లు ఏర్పాటు చేసే నిర్వాహకులు అనుమతితో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. డీజేలపై నిషేధం, రాష్ డ్రైవింగ్‌పై నిఘా ఉంది. ట్రైసిటీస్‌తో పాటు గ్రామాల్లో కూడా నిఘా ఉంది. అశ్లీలత, అసభ్యతకు తావు లేకుండా ప్రశాంతంగా వేడుకలు జరు పుకోవాలి. ఎదైనా సమస్య ఉంటే 100కు డయల్ చేయొచ్చు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సీఎం కప్ అథ్లెటిక్స్, రెజ్లింగ్ క్రీడలు

హాజరుకానున్న 2వేల మంది క్రీడాకారులు



వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీఎస్ఏ కోచ్‌లు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 30 : (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా హనుమకొండ జేఎన్ఎస్‌లో మంగళవారం నుంచి జనవరి 2వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, రెజ్లింగ్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం హనుమకొండ జేఎన్ఎస్‌లో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ఏర్పాట్లను అశోక్‌కుమార్ పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఇప్పటికే జేఎన్ఎస్ వేదికగా పలు క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించడం జరిగిందన్నారు. చివరి విడతగా రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్, రెజ్లింగ్ క్రీడలు మూడు రోజుల పాటు పండుగా వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ జిల్లాల నుంచి 2వేల మంది క్రీడాకారులు పాల్గొనడం జరుగుతుందని, ఇందులో పాల్గొనే క్రీడాకారుల కు భోజన, బస వసతులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, పీఈటీలు, పీడీలు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు, ఆత్మగౌరవం కోసం శ్రమిస్తున్న మహేందర్

దివ్యాంగుల గొంతుకై..



ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించిన కవిత్వ సమ్మేళనంలో మహేందర్ (ఫైల్)

కోమటిపల్లి తండాలో ఉపాధ్యాయుడిగా విధులు

హసన్‌పర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆయన వర్ధమాన తెలుగు సాహితీవేత్త. సమాజ సేవకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సంపాదకుడు, ప్రచురణకర్త, విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, దివ్యాంగుల సామాజిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ రచయితల సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న ఓ సాధారణ కుటుంబానికి చెందిన దివ్యాంగుడు. ఓ వైపు తన ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే దివ్యాంగుల హక్కులు, ఆత్మగౌరవం కోసం వారి గొంతుకై.. తన రచనల ద్వారా మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దివ్యాంగుల హక్కుల కార్యకర్తగా ఆయన చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అవార్డులు ఇచ్చి సత్కరించింది. ఆయనే బిల్ల మహేందర్. వేలేరు గ్రామంలో జయ, రాజమౌళి దంపతులకు జన్మించిన ఆయన హసన్‌పర్తి మండలం కోమటిపల్లి తండాలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2 నివసిస్తున్నారు. ఆయన పుట్టుకతోనే పోలియో కారణంగా అంగవైకల్యానికి గురైనా ఆత్మవిశ్వాసంతో అంచెలంచెలుగా ఎదిగి అందరికి స్ఫూర్తిదాయంగా నిలుస్తున్నారు.

సాహితీ సేవలో సామాన్యుడు

'కాళ్లు లేకపోవచ్చు..! ఉన్నా వంకర తిరిగో, వేళ్లు ముడుచుకొని పోయో ఉండొచ్చు.. కదలికైతే ఉంది కదా.. చేతులు లేకపోవచ్చు. ఉన్నా కండలేక బక్కచిక్కి మొండిపోయే ఉండొచ్చు. ఓ రూపాన్ని అయితే మలుస్తున్నాయి కదా. ఒరేయ్ నాన్న. మనిషంటే కళ్లు, కాళ్లు, చెవులు, నోరు, చేతులే కాదురా. మనస్సు కూడా' అంటూ దివ్యాంగులపై కవిత్వం రాసిన గొప్ప రచయిత. ఎపిడికెడు మట్టిని తీసుకురండి. మొలకెత్తడం నేర్చుకుందాం. వస్తూ ఉన్నప్పుడు ఓ అనాథ ముంగిళిని ముద్దాడండి. ఇక ఎలాగైనా బతికేయొచ్చు' అంటూ అనాథలపై ప్రేమ కురిపించిన ప్రేమికుడు. 'ఇప్పుడు నాకొక కవిత కావాలి. చీకటి తెరలను చీల్చుకుంటూ పొద్దున్నే మొలిచే సూర్యుడు లాంటి కవితొకటి కావాలి. ఇప్పుడు నాకొక పాట కావాలి. భుజమ్మీద తుపాకీ మొనలొంచి దొరల గుండెల్లో సూటిగా దూసుకెళ్లే తూటాలాంటి సాయుధ పాటొకటి కావాలి' అంటూ ధిక్కార పతాకాన్ని ఎగరేసిన శైలి ఆయన సొంతం. మలిదశ తెలంగాణ ఉద్యమానికి ప్రభావితమైన మహేందర్ ఇప్పటి వరకు 11 పుస్తకాలను రాశారు. ఉద్యమ సందర్భంలో పోరుగానం, పిడికిలి కవితా సంపుటాలను రచించి ఉద్యమానికి అందించారు. దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపే ప్రయత్నంలో భాగంగా కాలాన్ని గెలుస్తూ, గెలుపు చిరునామా లాంటి ప్రత్యేక ప్రతిభావంతులపై కవిత్వ పుస్తకాలు అచ్చువేసి తెలుగులో భిన్నమైన సాహిత్యానికి బీజం నాటారు. తాను రాసిన కొన్ని ప్రశ్నలు కొన్ని జ్ఞాపకాలు, ఇప్పుడొక పాట కావాలి, తను నేను వాక్యం లాంటి కవిత్వ సంపుటాలు మహేందర్‌ను మంచి కవిగా తెలుగు సాహిత్యంలో నిలబెట్టాయి. తన సంపాదకత్వంలో కొవిడ్-19, వలస దుఃఖం, బిల్కిస్ బానోపై సంఘీభావ కవిత్వం లాంటి సమకాలిన అంశాలపై సంకలనాలు తీసుకొచ్చి సాహిత్యంలో నిరంతర కృషి చేస్తూనే పలు


మహేందర్ రచనలు

ఎన్నో రచనలు, కవితలతో మార్పు కోసం తపన
విద్య ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు

ఆదర్శం

సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలలో తనవంతు చురుకైన పాత్రను కొనసాగిస్తూ ఓరుగల్లు కవులకు తలలో నాలుకలా ఉంటున్నారు.

విద్య ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవ..

విద్య ద్వారానే సమానత్వం సాధ్యమన్న అంబేద్కర్ మాటను స్ఫూర్తిగా తీసుకొని, ప్రార్థించే పెదాల కన్నా సహాయం చేసే చేతులే మిన్న అన్న మదర్ థెరిస్సా సూక్తిని తనలో నింపుకొని కలిసి వచ్చిన మిత్రుల సహకారంతో 2014లో అంబేద్కర్ జన్మదినమైన ఏప్రిల్ 14న విద్య ఫౌండేషన్ అనే సంస్థను స్థాపించారు మహేందర్. ఆ సంస్థ ద్వారా వికలాంగ, అనాథ, నిరుపేద విద్యార్థులకు తగిన చేయూతనిస్తూ వారిలో ఆత్మస్థైర్యం నింపే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2019లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో దివ్యాంగుల సాంస్కృతికోత్సవం పేరుతో వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి దివ్యాంగ కళాకారులచే అద్భుతమైన ప్రదర్శన ఏర్పాటు చేసి వారిలో చైతన్యం నింపాడు. నిరుపేద విద్యార్థులను ఫౌండేషన్ ద్వారా దత్తత తీసుకొని చదువు కొనసాగించేవిధంగా కృషి చేస్తున్నాడు. 2021లో కోవిడ్ సమయంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బడితండాలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.50లక్షలతో ఇంటిని నిర్మించి నాటి కలెక్టర్ పి.గౌతమ్ చేతుల మీదుగా గృహప్రవేశం చేయించారు.

దివ్యాంగుల హక్కుల కార్యకర్తగా ..

మహేందర్ గతంలో వికలాంగుల హక్కుల పోరాట సమితిలో సభ్యుడిగా ఉంటూ దానికి అనుబంధంగా ఏర్పడిన ఫిజికల్లీ చాలెంజ్డ్ టీచర్స్ యూనియన్ వరంగల్ జిల్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా సేవలందించాడు. ప్రస్తుతం డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వేల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తూ దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారు. దశాబ్దన్నర కాలంగా దివ్యాంగుల హక్కులు, ఆత్మగౌరవం కోసం కృషి చేస్తూ పలు సమస్యల పట్ల స్పందిస్తూనే సాహిత్యపరంగా దివ్యాంగుల అస్తిత్వం కోసం రచనలు చేస్తూ పుస్తకాలను ప్రచురిస్తున్నారు. సుబేదారిలోని ప్రభుత్వ దివ్యాంగుల బాలికల అవస్థను గమనించిన మహేందర్ అప్పటి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి వసతి గృహానికి రోడ్డు వేయించడంలో విశేష కృషి చేశారు. 2021లో రెండు తెలుగు రాష్ట్రాల్లోని దివ్యాంగ మేధావులు, ఉద్యమకారులతో సమాలోచన జరిపి దివ్యాంగుల సామాజిక వేదిక అనే సంస్థను స్థాపించి దాని ద్వారా దివ్యాంగులకు సంబంధించిన సమాచారాన్ని అందజేయడంతో పాటు పలు దివ్యాంగ అంశాలపై అవగాహన కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. అదేవిధంగా ఇదే వేదిక ద్వారా కవిత్వం, వ్యక్తిత్వ వికాసం, విజేత, కళలు, ఇంటర్వ్యూ ద్వారా దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే దిశగా అడుగులు వేస్తూ వారి అస్తిత్వం కోసం కృషి చేస్తున్నారు. అలాగే ఇంకెన్నో సామాజిక ఉద్యమాల్లో పాల్గొంటూ చైతన్యవంతమై కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



రాష్ట్ర ప్రభుత్వం నుంచి బెస్ట్ రోల్ మోడల్ అవార్డు అందుకుంటున్న మహేందర్ (ఫైల్)

అందుకున్న అవార్డులు...

మహేందర్ చేసిన సాహితీ కృషికి గాను బోవేరా సాహితీ పురస్కారం-2015, డాక్టర్ ద్వానా శాస్త్రి కవితా పురస్కారం, కాళోజీ పురస్కారం-2019 (తెలంగాణ రచయితల సంఘం, కరీంనగర్), బీఎస్.రాములు స్ఫూర్తి పురస్కారం-2019, డాక్టర్ రాదేయ కవితా పురస్కారం-2020, కవి సంగమం రొట్టె మాకు రేపు అవార్డు-2022 తదితర రాష్ట్ర స్థాయి పురస్కారాలతో పాటు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, మహాత్మా జ్యోతిరావు పూలే అవార్డు లాంటి ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. దివ్యాంగుల సాధికారత కోసం కృషి చేస్తున్నందుకు గాను 2022వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బెస్ట్ రోల్ మోడల్ కేటగిరీలో అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే 2023లో కేంద్ర సాహిత్య అకాడమీ ఆహ్వానం మేరకు ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ రైటర్స్ మీట్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొని తెలుగు భాష నుంచి కవిత్వాన్ని వినిపించారు.


గవర్నర్ నుంచి అవార్డును అందుకుంటున్న మహేందర్ (ఫైల్)


విద్య ఫౌండేషన్ విద్యార్థులతో మహేందర్

కళ

సబ్బు బిళ్లే ఆయన కాన్వాస్

- కమనీయ చిత్రాల రూపకల్పనలో నేర్పరి
- ప్రముఖుల ప్రశంసలు అందుకున్న గోకా రామస్వామి


గోకా రామస్వామి

నర్సంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆయనకు సబ్బు బిళ్లలే కాన్వాస్‌లు. అవి ఆయన చేతికి దొరికాయంటే చాలు అద్భుత కళాఖండాలు రూపుదిద్దుకున్నట్టే. రవీంద్రనాథ్ ఠాగూర్, జాతిపిత మహాత్మా గాంధీ, చాచా నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మాజీ ప్రధానులు వాజ్‌పేయి, ఐకె గుజ్రాల్, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ఇలా ఎందరో వ్యక్తుల చిత్రాలను ఆయన సబ్బు బిళ్లలపై చెక్కి ఔరా అనిపించారు. అంతేకాదు శివుడు, నంది, విఘ్నేశ్వరుడు, కళశంతో పాటు మరెన్నో ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలను కూడా చిత్రీకరించారు. చిన్న బ్లేడు ముక్కసాయంతో సబ్బుబిళ్లలపై అద్భుతాలు గీస్తున్నారు గోకారామస్వామి. చాక్ పీసులపై కూడా శిల్పాలు, వివిధ బొమ్మలు చెక్కడంలో నేర్పరి అయిన ఆయనకు చిన్నతనంలో కాగితాలపై చిత్రాలు గీయడం అలవాటు కాగా.. క్రమంగా సబ్బు బిళ్లలపై శిల్పాలు చిత్రించే నైపుణ్యాన్ని పెంచుకున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనల్లో గోకా రామస్వామి పాల్గొని ప్రదర్శించిన సబ్బు బిళ్లలపై చెక్కిన చిత్రాలకు బహుమతులు లభించాయి. రామస్వామి ఇప్పటివరకు రెండు వేలకు పైగా వివిధ రకాల చిత్రాలను సబ్బు బిళ్లలపై చిత్రీకరించారు. గతంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి, ఐకె గుజ్రాల్ చిత్రాలను చిత్రించి స్వయంగా వారికి అందించి ప్రశంసలను అందుకున్నారు. ఎఅగ్గిపుల్ల... సబ్బు బిళ్ల.. కాదేదీ కళకు అనర్హ్ అన్న శ్రీశ్రీ సూక్తిని స్ఫూర్తిగా తీసుకొని శిల్పాలు చెక్కుతూనే.. తనకు వచ్చిన ఈ కళను పది మందికి నేర్పాలి, చేరవేయాలన్న లక్ష్యంతో చిత్రకళా పోటీలు, ప్రదర్శనలు నిర్వహించారు. గతంలో బాలల చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించి బాల బాలికలకు బహుమతులు అందజేశారు. వివిధ సామాజిక సేవాకార్య క్రమాలు నిర్వహించి మొక్కలు నాటే కార్యక్రమాలతో పాటు మొక్కలు పెంపకం కార్యక్రమాలు చేపట్టారు. 2002లో అటవీ శాఖ నుంచి వన ప్రేమికుడి అవార్డును అందుకున్నారు. గతంలో జాతీయ స్థాయిలో లైఫ్-లింక్ స్వీడన్‌వారి ప్రశంసాపత్రంతో పాటు జాతీయస్థాయిలో యునెస్కో అవార్డును అందుకున్నారు.


సబ్బు బిళ్లపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రం, గణపతి


అబ్దుల్ కలాం | శంకరుడు

అనుమతులు లేకపోతే చర్యలు తప్పవు

- నేడు అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం విక్రయాలు
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ అంజిత్ రావు

ఫటాఫట్


డీసీ అంజిత్‌రావు

ఆంధ్రజ్యోతి : న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో మీరు తీసుకుంటున్న చర్యలు?

డీసీ : న్యూఇయర్ వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలకు అనుమతులిచ్చాం. మద్యం విందులు జరుపుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే అనుమతులు ఇస్తాం. కమర్షియల్ అయితే రూ.50వేలు, కమర్షియల్ కాకపోతే రూ.9,వేలు చెల్లించాలి. అనుమతులు తీసుకోకుండా విందులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : ఉమ్మడి జిల్లాలో వైన్స్, బార్లపై పర్యవేక్షణ ఎలా ఉంది?

డీసీ : ఉమ్మడి జిల్లాలోని 17పోలీస్‌స్టేషన్ల పరిధిలో 294 వైన్ షాపులు, 130 వరకు బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. నెలనెలా ఆయా జిల్లాల పరిధిలోని ఎక్సైజ్ సీఐలు షాపుల్లోని స్టాక్ రిజిస్టర్ పరిశీలించి, మద్యం కల్తీపై పరీక్షలు జరిపి. వేళలు పాటించని షాపుల వివరాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు అందిస్తారు. నిబంధనలు ఉల్లంఘించే నిర్వహకులపై చర్యలు తీసుకుంటారు.

ఆంధ్రజ్యోతి : గంజాయి నియంత్రణ, ఎన్‌డీపీఎల్ మద్యం విషయంలో వస్తున్న విమర్శలు గురించి?

డీసీ : ఐదారు మండలాలు కలిపి ఒక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో నియంత్రించలేకపోతున్నామనేది కొంత వాస్తవమే అయినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటి వరకు 20 మందిని అరెస్టు చేసి 17 కేసులు నమోదు చేశాం. ఎన్‌డీపీఎల్ మద్యం అనేది వరంగల్ డివిజన్‌లో పూర్తిగా తగ్గిపోయింది వాటి కేసులు నిల్.

ఆంధ్రజ్యోతి : బెల్ట్‌షాపులు, అనుమతుల్లేకుండా సిట్టింగ్ రూమ్‌ల నిర్వహణపై చర్యలు తీసుకుంటున్నారా?

డీసీ : బెల్ట్‌షాపుల నిర్వహణపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. మండలాల్లోని వైన్స్‌షాపుల్లో నిబంధనల ప్రకారం సిట్టింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : గుడుంబా, బెల్లం విక్రయాల నియంత్రణ గురించి మీరేమంటారు?

డీసీ : గ్రేటర్‌లో పూర్తిగా తగ్గిపోయింది. ఇక్కడ పీడీ యాక్టు పెట్టి నిలువరించగలిగాం. మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి జిల్లాలో కొంత నడుస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు 4577 మందిని అరెస్టు చేశాం. 1066 వాహనాలను సీజ్ చేశాం. బైండోవర్ ఉల్లంఘించిన 197మందితో రూ. 50లక్షలు జరిమానా వసూలు చేయించాం.

- వరంగల్ క్రైం, ఆంధ్రజ్యోతి

అట్టహాసంగా ముగిసిన

నాటకోత్సవాలు

ఓరుగల్లు చరిత్రను చాటి చెప్పిన కళాకారులు

హసన్‌పర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ, చలనచిత్ర అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో చివరి రోజున వనం లక్ష్మీకాంతరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తడకమ్మల రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ బుర్ర కథ కళాకారుడు, రంగస్థలం నటుడు, హనుమకొండ జిల్లా నాటక సమాజాల అధ్యక్షుడు డాక్టర్ ఓడపల్లి చక్రపాణి, యోగా గురువు బండారి సుభాష్‌లను నాటకోత్సవాల కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కాకతీయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు రాజారపు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పారితోషక దాత ఓడపల్లి చక్రపాణి సమక్షంలో తడకమళ్ల రాంచందర్‌రావు దర్శకత్వంలో సురభి కొండల్‌రావు సంగీతంలో మహారాణి నిర్వహించిన రుద్రమదేవి చారిత్రాత్మక పద్యనాటకం ఆహూతులను ఆకట్టుకుంది. కాజీపేట తిరుమలయ్య వ్యాఖ్యానకర్తగా వ్యవహరించగా అటికం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆటికం రవీందర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కళాకారులకు భోజన వసతి కల్పించగా ఆకుల సదానందం టెంట్ సమకూర్చగా ఆకుల సునీల్ కళాకారులకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, కళాకారులు గూడూరు బాలాజీ, సురభిహారిక, మాడిశెట్టి రమేష్, సీతవెంకటేశ్వర్లు, వనపర్తి ప్రసాద్, మాలి విజయరాజ్, నాగరాజు, రామదాసు, రవీందర్, ముంద్రాతి రవీందర్, శివసాయి కళామండలి ఎలుకుర్తి హవేలి కళాకారులు, మనోహర్ రావు, సాదు శ్యాంప్రసాద్, నిభానిపాడి సుబ్బరాజు, రాజమౌళి, డివిజన్ నాయకులు రాయికంటి సురేష్, ఏనుగు శివాజీనాయుడు, కవులు, కళాకారులు, కళాభిమానులు, పాల్గొన్నారు.


ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతు దినోత్సవం సందర్భంగా హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్‌లో సోమవారం యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలపై అవగాహన పెంపొందించుకోవాలి

▸▸ షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్



ఓటుహక్కు వినియోగించుకున్న విద్యార్థులు, విద్యాసంస్థల చైర్మన్ కుమార్

రాంనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కేవలం పుస్తకాలకు పరిమితం కాకుండా దేశ రాజకీయాలపై అవగాహన పెంపొందించుకోవాలని షైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ సూచించారు. రాంనగర్‌లోని షైన్ ఉన్నత పాఠశాలలో మాక్ ఎలక్షన్స్ నిర్వహించారు. మాక్ ఎన్నికల్లో భాగంగా విద్యార్థులు మూడు వర్గాలుగా ఏర్పడి (డెమాక్రటిక్, సోషలిస్టు, రిపబ్లిక్) ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా విద్యార్థులు మాట్లాడుతూ ఓటు హక్కు సామాజిక బాధ్యతని, ఓటును అమ్ముకోవద్దని అన్నారు. ఈసందర్భంగా మూగల కుమార్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, రాబోయే రోజుల్లో గొప్ప నాయకులుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మూగల రమ, ప్రిన్సిపాల్ ప్రగతి రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట హాస్టల్ వర్కర్ల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్లు, సెక్యూరిటీగార్డులు, శానిటేషన్ కార్మికులు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి మాట్లాడుతూ.. 22 సంవత్సరాలుగా కాకతీయ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కార్మికులకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బాధిత వర్కర్లు పాల్గొన్నారు.

గణితం ఒలింపియాడ్‌లో రామన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మాదాల సతీష్, ప్రిన్సిపాల్ రజిత

హన్మకొండటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గణిత మేధావి రామానుజన్ జ్ఞాపకార్థం తెలుగు రాష్ట్రాల్లో ప్రతియేట నిర్వహించే గణిత ఒలంపియాడ్‌లో సుబేదారిలోని రామన్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ రజిత తెలిపారు. విజయవాడలో ఇటీవల నిర్వహించిన ఒలంపియాడ్ ప్రతిభాన్వేషణ పోటీలలో 3వ తరగతి విద్యార్థిని ఎం.విభాస్‌కశ్యప్ ప్రథమ స్థానం, 9వ తరగతి విద్యార్థిని డి.యుక్తశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు. కాగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వడుప్సా అధ్యక్షుడు మాదాల సతీష్ సోమవారం అభినందించి మాట్లాడారు. క్రింది తరగతుల నుంచే గణితం పట్ల విద్యార్థుల్లో అభిరుచిని రామన్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు పెంపొందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేష్‌కుమార్, డైరెక్టర్ పురుషోత్తం, మడికొండ బ్రాంచ్ ప్రిన్సిపాల్ స్రవంతి పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, గణిత ఉపాధ్యాయులను అభినందించారు.

3న కేయూలో సావిత్రిబాయి పూలే జయంతి

కేయూ క్యాంపస్ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం పూలే దంపతుల విగ్రహాల వద్ద జనవరి 3న సావిత్రి బాయి పూలే 194వ జయంతి వేడుకలను నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. జనవరి 3న శుక్రవారం ఉదయం 10 గంటలకు బోధన, బోధనేతర సిబ్బందితో పాటు స్కాలర్లు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా కాళోజీ కళాశాల 11వ వార్షికోత్సవం

▸▸ ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



వేడుకల్లో పాల్గొన్న యాజమాన్యం

హసన్‌పర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 55వ డివిజన్ రామారం జగతి గార్డెన్స్‌లో కాళోజీ జూనియర్ కళాశాల 11వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వైకేఎస్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఎస్.శ్యాంసుందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి సమయపాలన పాటించి క్రమశిక్షణతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. యువత మంచి నాయకత్వ లక్షణాలు కలిగి ఉత్తమ పౌరులుగా దేశాభివృద్ధికి దోహదపడాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ వైకేఎస్ మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా కళాశాల యాజమాన్యం పనిచేస్తోందన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి గొప్ప పాలకులుగా రాణించాలన్నారు. అనంతరం గత సంవత్సరంలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కె.తిరుపతిరెడ్డి, ఈ.అనిల్‌రెడ్డి, టి.మధుకర్‌రెడ్డి, ఎం.సతీష్‌కుమార్, అధ్యాపక సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేయూలో భూసర్వే చేపట్టిన అధికారులు

కేయూ క్యాంపస్ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ భూముల అన్యాక్రాంతంపై జిల్లా రెవెన్యూ అధికారులు, వర్సిటీ అభివృద్ధి అధికారులు భూసర్వే పనులను వేగవంతం చేశారు. గత శనివారం నుంచి భూ సర్వే పనులను పునఃపరిశీలించిన వర్సిటీ అధికారులు సోమవారం పలివేల్పుల ప్రాంతంలోని 373 సర్వే నెంబర్‌లోని భూములను సర్వే చేశారు. వర్సిటీ భూములు ఎక్కడి వరకు ఉన్నాయనే విషయాల్ని గుర్తించి మార్కింగ్ చేశారు. 373 సర్వే నెంబర్‌లోని భూమి ఎంత.. ఎంత అక్రమణకు గురైందనే అంశాల్ని వర్సిటీ అధికారులు తేల్చారు. సర్వేలో రెవెన్యూ డిపార్టుమెంట్ అధికారులు డీఐ పవన్, రాజేశ్, వర్సిటీ అభివృద్ధి అధికారులు ఎన్. వాసుదేవరెడ్డి, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం

▸▸ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

▸▸ ఘనంగా అఖిల భారత పెన్షనర్స్ డే వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

వడ్డెపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను విస్మరించిందని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి దుయ్యబట్టారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అఖిల భారత పెన్షనర్స్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెన్షనర్లకు ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదురహిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోఉన్న నాలుగు డీఆర్‌లను వెంటనే ప్రకటించి విడుదల చేయాలని కోరారు. పీఆర్‌సీని ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, హనుమకొండ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు మాదిరెడ్డి మల్లారెడ్డి, కందుల సంజీవరెడ్డి, జిల్లా నాయకులు ఎండీ నిజాముద్దీన్, పి.సాంబయ్య, ఆగయ్య, రవీందర్, బాబురావు, కె.మల్లారెడ్డి, ఎ.జనార్ధన్, జి.లక్ష్మయ్యతోపాటు ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, ఏటీవోలు శ్రీనివాస్‌రెడ్డి, అన్వర్ హుస్సేన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, టీజీవో జిల్లా సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొని మాట్లాడారు. అనంతరం అఖిల భారత పెన్షనర్స్‌డే వేడుకలను పురస్కరించుకొని సీనియర్ పెన్షనర్స్‌ను ఘనంగా సత్కరించారు.

ప్రతీ ఒక్కరికి స్ఫూర్తినిచ్చేవి సమ్మేళనాలే..

● పూర్వ విద్యార్థుల సదస్సులో డీఈవో రాజేందర్



కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరిలో నూతనత్వం నింపి చైతన్యవంతులను చేసేది పూర్వ విద్యార్థుల సమ్మేళనాలేనని భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ అన్నారు. ఆదివారం రాత్రి పొద్దుపోయాక హనుమకొండ నక్కలగుట్టలోని పాపడమ్స్ బ్లూ కాన్ఫరెన్స్ హాల్‌లో కోలాహలంగా జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన ఒక విద్యార్థిగా మారి తన బాల్య మిత్రులందరితో సందడి చేశారు.

హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో సుమారు 40 సంవత్సరాల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆడంబరంగా జరిగింది. 30 మంది పాల్గొన్న వేడుకలకు స్వరాజ్యం కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. బ్యాంకుమేనేజర్‌గా బెంగుళూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఈశ్వర్‌నాథ్, సతీష్, రామచంద్రారెడ్డి, రామారావు, విజయలక్ష్మి, నిర్మల, శ్రీదేవి, శోభ, నళిని, జ్యోతి, కరుణ తదితర బాల్య మిత్రులంతా అలనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. క్రమం తప్పకుండా కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా కలుసుకోవాలని, చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారు తీర్మానించారు.

విద్యార్థినికి ఉపాధ్యాయుల ఆర్థిక సాయం

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ సీటు సాధించిన హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని గుగులోతు సేవికకు ఫీజు నిమిత్తం పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సేవికకు రూ. 26,001 మెడికల్ కళాశాల ఫీజు కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీవి. రామారావు, ఉపాధ్యాయుడు వాసు, మధుసూదన్, రాజిరెడ్డి, నర్సయ్య, వేణుగోపాల్, రమాదేవి, సమ్మిరెడ్డి, రజిత, పద్మ, మనోహర్, స్వామి, విద్యాసాగర్, లింగమూర్తి, కాంతయ్య పాల్గొన్నారు

ప్రాన్ నెంబర్లు కేటాయించాలి : యూటీఎఫ్

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో ఎంపికై ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన కొత్త ఉపాధ్యాయులందరికీ ప్రాన్ నెంబర్లు కేటాయించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు జిల్లా ఖజానా అధికారికి వినతి పత్రం అందజే సినట్లు పేర్కొన్నారు. 45 రోజులు దాటినా కొత్త ఉపాధ్యాయులకు ప్రాన్ నెంబర్లు కేటాయించకపోవడంతో సకాలంతో వేతనాలు అందడం లేదని పేర్కొన్నారు. అధి కారులు వెంటనే ప్రాన్ నెంబర్లు కేటాయించాలని కోరారు.

అంధుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ కావ్య

హనుమకొండ సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల విద్యార్థులు రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సోమవారం ఆవిష్కరించారు. అంధుల కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిలో క్యాలెండర్ రూపొందించిన విద్యార్థులను ఎంపీ అభినందించారు. అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ సాధారణ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని రంగాల్లో వారి ప్రతిభను కనబరుస్తున్నారని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా జనవరి 4న లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల స్థాపకుడు దివంగత నలివెల కుమారస్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నలివెల కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలి

▸▸ వామపక్ష పార్టీల నాయకుల డిమాండ్



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నేతలు

వడ్డెపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానపర్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలని, పార్లమెంట్ నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నేత బొట్ల చక్రపాణి ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి నున్న అప్పారావు, ఎంసీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నీలం రవి తదితరులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అమిత్‌షా అహంకారపూరిత, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల జిల్లా నేతలు చుక్కయ్య, ఆర్. రమేష్, రాజిరెడ్డి, వెంకట్, వాంకుడోత్ వీరన్న, తిరుపతి, లింగయ్య, సాంబయ్య, సంపత్, రాధిక, ఉపేందర్, స్వేత తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవు

▸▸ ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్



పెన్షనర్ల డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌కుమార్

బాలసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోట్రెజరీ సిబ్బందిపై పెన్షనర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవని ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా పెన్షనర్స్ డే పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జన్నపురెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించగా శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వడానికి మార్చి 31 వరకు గడువు ఉందన్నారు. మొబైల్‌లోని మీ సేవా యాప్ ద్వారా పంపవచ్చని తెలిపారు. అసోసియేషన్ జిల్లా గౌరవ సలహాదారు ఎస్. రామనర్సింహాచార్యులు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన పెన్షనర్ల డిమాండ్‌ను నూతన సంవత్సర కానుకగా పరిష్కరించాలని కోరారు. తూపురాణి సీతారాం మాట్లాడుతూ 1982 డిసెంబరు 17న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పాలకులు నిర్వీర్యం చేశారని వాపోయారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరపు డైరీని, క్యాలెండర్‌ను శ్రీనివాస్‌కుమార్ ఆవిష్కరించారు. రాష్ట్ర సంఘం భవనానికి భూ విరాళం ఇచ్చిన 35 మంది పెన్షనర్లను శాలువా కప్పి మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు మహ్మద్ అన్వర్ హుస్సేన్, వై.శ్రీనివాస్‌రెడ్డి, పెండ్యాల బ్రహ్మయ్య, నారాయణగిరి వీరన్న, ఎ.విద్యాదేవి, ఎంఏ రహీం, ఎస్.సదానంద్, జి.రాజేందర్, నర్సింహారెడ్డి, జ్యోతిరాణి, కుసుమ కుమారి, ఉషారాణి పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

▸▸ కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్దేశించిన మేరకు ఉపాధిహామీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, చేయూత పెన్షన్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు టార్గెట్ ఇచ్చిన మొత్తం పనిదినాలు ఉపాధిహామీ కూలీలకు కల్పించాలన్నారు. మహిళా శక్తి ఉపాధి భరోసా కింత పశువుల పాకలు, వర్మి కంపోస్టు పిట్ల నిర్మాణం, కోళ్ల ఫారాలు, ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములు అభివృద్ధి చేయాలన్నారు. పారిశుద్ధ్యంలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణం ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు తమ మండలంలో ఉన్న నర్సరీని విధిగా పర్యవేక్షించి 100 శాతం మొక్కలు పెరిగే విధంగా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తాం..

జిల్లా నుంచి ఎగుమతి చేసే ఉత్పత్తులకు అన్ని వసతులు కల్పిస్తామని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎగుమతులు చేసే ఉత్పత్తుల పరిమాణాన్ని ఆయా ఎగుమతులకు అసోసియేషన్ ద్వారా సేకరించి తెలియజేయాలని, సంబంధిత ఉప సంఘాలలో చర్చించి నివేదిక సమర్పించాలన్నారు. ముఖ్యంగా జిల్లా నుంచి బియ్యం, గ్రానైట్, మిరపకాయలు, టెక్స్‌టైల్ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయన్నారు. మిర్చి, ధాన్యం పండించే ప్రతి రైతుకు అవగాహన కల్పించి నాణ్యమైన ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ప్రోత్సహించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఉప సంచాలకులు శైలజ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి

కేయూ క్యాంపస్ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ జూనియర్ కళాశాల ఇంటర్ ఎస్టీ విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో కళాశాల యాజమాన్యంపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వారు సంఘటనపై ఫిర్యాదు చేశారు. గత బుధవారం హనుమకొండలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత పరకాల ఇన్‌చార్జి నరేశ్, ఈసీ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు పంజాల రేవంత్, రామ్మోహన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మడికొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రతీ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ విద్యలో ఉత్తమప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను గుర్తించి నాలుగు సంవత్సరాలుగా ఉల్లాస్ ట్రస్టు ప్రోత్సహిస్తోంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బీరం సంధ్యారాణి చేతుల మీదుగా 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ట్రస్టు సభ్యులను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు అభినందించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ట్రస్టు సభ్యులు

ఎమ్మార్పీఎస్ టీఎస్ 4వ డివిజన్ అధ్యక్షుడిగా కుమార్



రెడ్డికాలనీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ స్టేట్ గ్రేటర్ 4వ డివిజన్ అధ్యక్షుడిగా ఎర్ర కుమార్‌ను నియమిస్తూ హనుమకొండ మండల అధ్యక్షుడు తీగల సుదన్ తెలిపారు. కొంతకాలంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో పని చేస్తూ దళిత సమస్యలపై స్పందిస్తున్నందున డివిజన్ అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు.

మెప్మా స్టాల్ ఏర్పాటు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరికి నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో సోమవారం స్టాల్ ఏర్పాటు చేశారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల ప్రతినిధులు తయారుచేసిన కాటన్ దుస్తులు, పచ్చళ్లు, కాటన్ బ్యాగులు విక్రయించేందుకు ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, జడ్పీ సీఈఓ విద్యాలత, ఇతర అధికారులు పరిశీలించారు.

మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి

▸▸ ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

వడ్డెపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్‌మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని పల్లా రవీందర్‌రెడ్డి విద్యుత్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీకళాకారుల అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం మాదిగ కళా మండలి ఉమ్మడి జిల్లాల కన్వీనర్ జూపాక శివ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మంద కుమార్‌మాదిగ మాట్లాడుతూ.. వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయడం కోసం జనవరి 3 నుంచి కళాకారుల రథ యాత్రలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని తెలిపారు. ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా వచ్చిన సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శనను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు వేల్పుల సూరన్న కాపు, బొడ్డు దయాకర్, గుగ్గిళ్ల పీరన్న, కొయ్యడ మల్లేష్, గద్దల సుకుమార్, బిర్రు మహేందర్, గోలకొండ బుచ్చన్న, బండారి సురేందర్, శాగంటి రమేష్ పాల్గొన్నారు.


కేయూ రిటైర్డు బోధనేతర ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక

▸▸ అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ నాగేశ్వర్‌రావు, సంజీవరావు

కేయూ క్యాంపస్ డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన కేయూ రిటైర్డు బోధనేతర ఉద్యోగుల సంఘం నేతృత్వంలో పెన్షనర్స్ డే, జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉద్యోగుల సంఘానికి నూతన కార్యవర్గం కోసం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ప్రిన్సిపాల్ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్ వ్యవహరించారు. ఎన్నికల్లో అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ ఎ.నాగేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్.సంజీవరావులు గెలుపొందిన తర్వాత సమావేశంలో మాట్లాడారు. వర్సిటీలో పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. 70 ఏళ్ళు నిండిన రిటైర్డు పెన్షనర్లను ఘనంగా శాలువ, పుష్పగుచ్ఛం అందచేసి సన్మానించారు. రెండేళ్ళకాలానికి ఎంపికైన కేయూ రిటైర్డు బోధనేతర ఉద్యోగుల సంఘానికి అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ ఎ.నాగేశ్వర్‌రావు, వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్ఆర్ మూర్తి, మలుకోజు ప్రకాశం, ఎ.నర్సింహామూర్తి, జనరల్‌సెక్రటరీ డాక్టర్ ఎస్.సంజీవరావు, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీలుగా వి. కృష్ణమాచార్య, పి. మల్లయ్య, ప్రభాకర్, వెంకట్రాంనర్సయ్య, ఎమ్డీ అక్తర్, జాయింట్ సెక్రటరీగా (రిక్రియేషన్) ఎస్.గిడియన్, ట్రెజరర్‌గా జి.చంద్రమౌళి, మహిళ రిప్రజెంటీవ్‌గా సుగుణలను ఎన్నుకున్నారు. సమావేశంలో రిటైర్డు, కేయూబోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రపంచంలో సంస్కారాన్ని మించిన ఆస్తి లేదు

▸▸ రిటైర్డు ఉపాధ్యాయుడు నర్సింహారెడ్డి




సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో సంస్కారాన్ని మించిన ఆస్తి మరొకటి లేదని రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇ.నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతి విహార్‌లో హసన్‌పర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎస్‌సీ 1974-75 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా ఆదివారం స్వర్ణోత్సవాలు జరుపుకున్నారు. పూర్వ విద్యార్థి డాక్టర్ ఎం.రాజమహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమ్మేళనంలో పూర్వ గురువు ఇ.నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దశాబ్దాలు గడిచినా విద్యా బోధన చేసిన గురువుల పూ పూజ్యభావం కలిగి ఉండడం అభినందనీయమన్నారు. 50 సంవత్సరాలు గడిచినప్పటికీ పూర్వ విద్యార్థులు ఐఖ్యతతో తమకు చదువు చెప్పిన గురువులను గుర్తుంచుకొని సమ్మేళనం ఏర్పాటు చేయడం పూర్వ విద్యార్థుల ఉత్తమ సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు సముద్రాల రాంనర్సింహాచారి, కె.నర్సింహారెడ్డి, చిదర రుద్రయ్య, ఈ.వెంకటేశ్వర్లు, పి.కృష్ణయ్య, పూర్వవిద్యార్థులు సుధాకర్, స్వామి, దుర్గం సమ్మయ్య, కందుకూరి ప్రభాకర్, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 9 వరకూ హరీశ్‌ను అరెస్టు చేయొద్దు

- ఫోన్‌ట్యాపింగ్ కేసులో మధ్యంత ఉత్తర్వుల పొడిగింపు
- క్వాష్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసిన హైకోర్టు



హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఆయనను అరెస్ట్ చేయరాదని ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను జనవరి 9 వరకు పొడిగిస్తూ హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అప్పటి మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు తనతోపాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లను ఎస్‌ఐబీ అధికారులు ట్యాప్ చేశారన్న చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీసులు డిసెంబరు 3న కేసు నమోదు చేశారు. అయితే, ఆ కేసును కొట్టేయాలంటూ హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై డిసెంబరు 5న విచారణ జరగ్గా.. హరీశ్‌రావును అరెస్ట్ చేయరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఈ పిటిషన్‌పై జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. హరీశ్ తరఫున సీనియర్ న్యాయవాది రామచంద్రరావు వాదిస్తూ రాజకీయ కక్షతోనే చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు చేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ.. హరీశ్‌రావుపై వచ్చిన ఆరోపణల స్వభావం తీవ్రమైనదని, ఫోన్ ట్యాపింగ్ చేయించడం ద్వారా స్వేచ్ఛ, గోప్యత హక్కులను హరించారని విమర్శించారు. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను జనవరి 9కి వాయిదా వేసింది. హరీశ్‌రావును అరెస్ట్ చేయరాదని, కేసును దర్యాప్తు చేసుకోవచ్చని ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు పొడిగించింది.

అల్లు అర్జున్ అరెస్టు తర్వాత పుష్ప కలెక్షన్లు పెరిగాయి: ఎంపీ చామల

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ తర్వాత పుష్ప సినిమా కలెక్షన్లు పెరిగాయని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ అరెస్ట్ విషయంలో అధికార పార్టీని వ్యతిరేకించడానికి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు పోటీ పడ్డారన్నారు. అయితే, ఈ విషయంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వాస్తవ పరిస్థితులు మాట్లాడారని తెలిపారు. రాజకీయ నాయకుడిగా ఆయన మాట్లాడలేదని తెలిపారు. తమకు అనుకూలంగా పవన్ మాట్లాడారని తాను అనుకోవట్లేదని, మానవీయ కోణంలో మాట్లాడారని అన్నారు. అల్లు అర్జున్ అరెస్టుపై దేశవ్యాప్తంగా చర్చ జరిగిందని, ఆయన అరెస్టుతో సినిమాకు ఇంకా ఎక్కువ కలెక్షన్లు వచ్చాయని చెప్పారు.

ఎన్నికల కేసు కొట్టేయాలని స్పీకర్ పిటిషన్

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారనే ఫిర్యాదుతో వికారాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా గడ్డం ప్రసాద్‌కుమార్, తదితరులు ముందస్తు అనుమతి లేకుండా వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు దిగినట్లు ఎన్నికల అధికారులు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ గడ్డం ప్రసాద్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వివరణ ఇవ్వాలని పేర్కొంటూ ప్రభుత్వానికి, అప్పుడు క్షేత్ర స్థాయి ఎన్నికల అధికారిగా ఉన్న ఉద్యోగి రాంబాబుకు నోటీసులు జారీ చేసింది.

నా ఆస్తిని సుజనా చౌదరి తాకట్టు పెట్టారు

- దర్యాప్తును వేగవంతం చేసేలా పోలీసులను ఆదేశించాలని హైకోర్టులో ఓ వ్యక్తి పిటిషన్

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రూ.400కోట్ల విలువైన తన ఆస్తిని తాకట్టు పెట్టి ప్రస్తుత ఏపీ ఎమ్మెల్యే, సుజనా యూనివర్సల్ ఇండస్ట్రీస్ చైర్మన్ సుజనా చౌదరి రుణాలు పొందారని, ఆ రుణాలు చెల్లించకపోవడంతో తన ఆస్తిని వేలానికి పెడుతున్నారంటూ హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన హబీబ్ అల్లాడిన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అమీర్‌పేట్ మండలం, బహల్లాఖాన్‌గూడ టౌన్ సర్వే నంబర్ 17లో 26,432 గజాల తన ఆస్తిని తాకట్టు పెట్టారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఫిబ్రవరిలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని.. విచారణ వేగవంతం చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై వాదనలు విన్న జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. ఈ వ్యవహారంపై పోలీసుల వైఖరి ఏంటో తెలియజేయాలని ఆదేశాలు జారీచేసింది.

ఆర్ఆర్ఆర్‌కు మేమే 76% భూమి సేకరించాం

- అబద్ధాలు చెప్పడంలో సీఎం, మంత్రుల పోటీ: ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేసిన మంచి పనులు చెప్పేందుకు కూడా కాంగ్రెస్ నేతలకు నోరు రావడంలేదని, ఉత్తర రీజినల్ రింగ్‌రోడ్డుపై మంత్రి కోమటిరెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. అబద్ధాలు చెప్పడంలో ముఖ్యమంత్రి, మంత్రులు పోటీపడుతున్నారని, 2021లోనే ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌కు కేంద్రం అనుమతించిందని చెప్పారు. దక్షిణభాగం రీజినల్ రింగ్ రోడ్డును తమ భూముల చూట్టూ అలైన్ మెంట్ మార్చేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దక్షిణ భాగం రీజినల్ రింగ్ రోడ్డుకు బీఆర్ఎస్ హయాంలోనే సూత్రప్రాయంగా కేంద్రం అంగీకారం తెలిపిందని.. దాన్ని తమ ఘనతగా కాంగ్రెస్‌నేతలు గొప్పలు చెప్పుకొంటున్నారని విమర్శించారు. భూసేకరణకోసం కేంద్రం వద్ద బీఆర్ఎస్ సర్కారు రూ.100కోట్లు డిపాజిట్ చేసిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్ వెళ్లే నాలుగు జిల్లాల్లో ప్రత్యేకాధికారులను నియమించి.. 76శాతం భూసేకరణ పూర్తి చేశామని చెప్పారు.. కాగా కాంగ్రెస్ పాలనలో నేరాలు, హత్యోదంతాలు పెరిగాయని., డీజీపీ కొన్నింటిని మాత్రమే వెల్లడించారని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణలో డబ్బులకోసం హత్యలు 40శాతం, 18ఏళ్లలోపు ఆడపిల్లలపై 82శాతం అత్యాచారాలు పెరిగాయన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడిగా చావ రవి

నల్లగొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో టీఎస్‌యూటీఎఫ్ ఆరో రాష్ట్రస్థాయి మహాసభలు సోమవారం ముగిశాయి. చివరి రోజు ప్రతినిధుల సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. అలాగే 2024-26కు గాను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చావ రవి, ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకట్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.జంగయ్య, సీహెచ్.దుర్గభవాని, కోశాధికారిగా లక్ష్మారెడ్డి, కార్యదర్శులుగా సీహెచ్.రాములు, సోమశేఖర్, ఎం.రాజశేఖర్‌రెడ్డి, వి.శాంతకుమారి, జి.సమ్మారావు, జి.సత్యానంద్, జి.నాగమణి, బి.రాజు, కె.రంజిత్‌కుమార్, ఎస్.రవిప్రసాద్‌గౌడ్, ఎస్.మల్లారెడ్డి, కె.రవికుమార్, జీ.శ్రీధర్, సింహాచలం, జ్ఞానమంజరి, ఎన్.వెంకటప్ప‌లను ఎన్నుకున్నారు.

ఔషధ నియంత్రణ సంస్థ వార్షిక నివేదిక విడుదల

- ఈ ఏడాదిలో పెద్ద ఎత్తున దాడులు
- భారీగా నిల్వల స్వాధీనం
- 25,253 తనిఖీలు, 4,102 మందిపై చర్యలు
- మొత్తం 573 కేసులు నమోదు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఔషధ నియంత్రణ సంస్థ ఈ ఏడాది విస్తృతంగా దాడులు నిర్వహించి భారీ ఎత్తున నిల్వలను స్వాధీనం చేసుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి సరఫరా చేస్తున్న మందుల సరఫరాపై దాడులు నిర్వహించడంతో పాటు, హైదరాబాద్ కేంద్రంగా అక్రమ మందుల నిల్వలు, నకిలీ మందులు, అక్రమ మెడికల్ దుకాణాల వ్యాపారాలకు కళ్లెం వేసింది. అక్రమ మందుల నిల్వలను గుట్టురట్టు చేయడంతో పాటు, తయారీ, అమ్మకాలకు అడ్డుకట్ట వేసినట్లు ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. 2024లో 573 కేసులు నమోదు చేసి భారీ స్థాయిలో మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 25,253 తనిఖీలు నిర్వహించి, 4,102 మందిపై చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ మందులను స్వాధీనం చేసుకోవడంతో పాటు నార్కోటిక్ డ్రగ్స్ అక్రమ మళ్లింపును అడ్డుకున్నట్లు చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా తయారయ్యే నకిలీ మందులు, బ్రాండెడ్ కంపెనీల మందులు, యాంటీ కేన్సర్ నకిలీ మందులను భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్నట్లు కమలాసన్‌రెడ్డి వివరించారు.

తెలంగాణ గుండెల్లో.. కలకాలం మన్మోహన్

(మొదటిపేజీ తరువాయి)

అర్థం చేసుకొని తెలంగాణ ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని, అటువంటి మహనీయుడికి నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలపడమే కాకుండా ఘనంగా నివాళి అర్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ప్రజలు సోనియా గాంధీకి ఎంత రుణపడి ఉంటారో.. మన్మోహన్ సింగ్‌కు కూడా అంతే రుణపడి ఉంటారని అన్నారు. "ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ (ఎల్‌పీజీ) విధానాలను తీసుకొచ్చి.. ప్రపంచ దేశాలతో మన దేశం పోటీ పడేలా తీర్చిదిద్దడంలో తెలంగాణ బిడ్డ పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ వేసిన పునాదులే కారణం. ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త ఆయన. ఆయన మరణం కుటుంబానికే కాదు.. దేశానికి, ప్రపంచానికే తీరని లోటు. నీతి, నిజాయతీ, నిబద్ధతలో ఎవరినైనా ఆదర్శంగా తీసుకోవాలంటే అది మన్మోహన్ సింగ్. దేశ ప్రధానిగా పదేళ్లపాటు పని చేసిన ఆయన ప్రజాస్వామ్య రక్షణ కోసం మాతో కలిసి ధర్నాలో కూర్చున్నారు. నాకు, ఉత్తమ్, కోమటిరెడ్డికి ఆ సంఘటన జీవితకాలం గుర్తుండిపోతుంది" అని వివరించారు. ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టి.. అనంతపురం, మహబూబ్‌నగర్‌ల్లో ఆ పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాతగా గొప్ప పరిపాలన అందించడానికి పునాది వేసిన అంబేడ్కర్ స్ఫూర్తిగా భూ సేకరణ చట్టంలో మార్పులు చేశారని, 2013 భూసేకరణ చట్టంలో గ్రామంలో ఉన్న వారందరికీ పరిహారం ఇచ్చేలా చేశారని గుర్తు చేశారు. అటవీ హక్కుల రక్షణ చట్టం-2006 వల్లే పోడు భూములకు పట్టాలిస్తున్నామని చెప్పారు.

తెలంగాణకు మన్మోహన్ ఆశీస్సులు

"మన్మోహన్ మరణ వార్త విని.. ఢిల్లీ వెళ్లి ఆయన సతీమణిని కలిశాను. నివాళులర్పిస్తూ.. నేను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అని పరిచయం చేసుకున్నాను. అప్పుడు.. కూర్చో అని చెప్పి, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇచ్చారు. ఆ రాష్ట్రాన్ని మీరు కష్టపడి అభివృద్ధి పథంవైపు నడిపించాలి. మన్మోహన్ సింగ్ ఆశీస్సులు తెలంగాణకు ఉంటాయని మన్మోహన్ సింగ్ సతీమణి చెప్పారు" అని సీఎం రేవంత్ వివరించారు. ఎన్నో విషయాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. 140 కోట్ల మంది ప్రజలకు, అన్ని సంఘాలు, ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు, కమ్యూనిస్టుల నుంచి మిగతా అన్ని రాజకీయ పార్టీలు





మన్మోహన్ సింగ్ విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేసే పరిస్థితి ఉందని చెప్పారు. క్లిష్టమైన పరిస్థితుల్లో ఆయన చతురతతో తెలంగాణ ఏర్పడిందని, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆయన విగ్రహం పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

రాష్ట్రం ఉన్నంత వరకూ మన్మోహన్ పేరు: భట్టి

తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం మన్మోహన్ పేరు చిరస్థాయిగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో మొట్టమొదటిసారి రైతు రుణమాఫీ చేశారని, రాష్ట్రంలో రెండు లక్షల రుణమాఫీ పథకానికి స్ఫూర్తి ఆయనేనని తెలిపారు. దేశ రాజకీయాల్లో మహోన్నత శిఖరాలకు ఎదిగి.. నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ ఏర్పాటు చేసిన పునాదులపై సమున్నత ఆర్థిక సౌధాన్ని మన్మోహన్ నిర్మించారని మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు. మన్మోహన్ సింగ్ తన పదేళ్లకాలంలో 114 విలేకరుల సమావేశాలు పెట్టినా.. మౌన ప్రధానిగా మీడియా, విపక్షాలు ప్రచారం చేశాయని ఆక్షేపించారు. దేశంలో ప్రస్తుతం ఉన్న స్టార్టప్‌లకు ఆయనే స్ఫూర్తి అని తెలిపారు. దేశంలో పేదల సంక్షేమం కోసం మైలురాయి లాంటి చట్టాలు తెచ్చిన ఘనత మన్మోహన్‌కే దక్కుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. భూ సేకరణ చట్టం, అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ, ఆహార భద్రత, సమాచార హక్కు, విద్యా హక్కు వంటి చట్టాలతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. మన్మోహన్ గొప్ప మానవతావాది, ఆర్థిక శిల్పి, దార్శనికుడని మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా దేశంలో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకొచ్చారన్నారు. మన్మోహన్ మేధస్సు, ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల గురించి ఈరోజు ప్రపంచం మొత్తం మాట్లాడుకుంటోందని, 15వ లోక్‌సభలో ఆయనతో కలిసి పని చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ మెట్రో, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలలో ఆయన కృషి మరువలేనిదన్నారు. యువతకు స్ఫూర్తిగా, నిజాయితీకి నిలువుటద్దంగా ఉన్న మన్మోహన్ సింగ్ విగ్రహాలను అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి కోరారు. ఢిల్లీలో చలి కాలంలో తాము పార్లమెంట్ ముందు ధర్నా చేస్తుంటే 90 ఏళ్ల వయసులో కూడా తమతోపాటు ఆయన కూర్చున్నారని. ఆనాటి ఫొటోను చూస్తే కన్నీళ్లు వచ్చాయని అన్నారు. ఐదు నెలల వయసులో తల్లిని కోల్పోయిన ఆయన అనేక కష్టాలు పడి ఉన్నత స్థానానికి చేరారని మంత్రి సీతక్క గుర్తు చేశారు. గొప్ప సంస్కరణల ద్వారా సంక్షేమానికి చట్టబద్ధత కల్పించారని, అందుకే ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ఆకలి మనిషికి అతి పెద్ద శత్రువు అని గుర్తించి దాన్ని రూపుమాపేందుకు ఆహార భద్రత చట్టం తెచ్చారని, విద్యా హక్కు చట్టం తీసుకొచ్చి 30 వేల కొత్త పాఠశాలలు నిర్మించారని గుర్తు చేశారు.



సంతాప తీర్మానానికి పూర్తిగా మద్దతు తెలుపుతూ.. మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలన్న తీర్మానానికి సంపూర్ణంగా మద్దతునిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. భారతరత్నకు మన్మోహన్ అర్హులని చెప్పారు. "ఆయన గొప్పతనం, సామర్థ్యం, తెలివితేటలను తొలుత గుర్తించింది తెలంగాణ బిడ్డ పీవీ నర్సింహారావు. ఆయనను ఆర్థిక మంత్రిగా నియమించారు. కేవలం 15 రోజులు మాత్రమే విదేశీ మారక నిల్వలు ఉన్న పరిస్థితి నుంచి ప్రపంచం మొత్తం ఆశ్చర్యపోయేలా దేశాన్ని పరిగెత్తించారు. అనవసరపు డాంబికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా.. 'సింపుల్ లివింగ్.. హై థింకింగ్'కు పర్యాయపదంగా జీవించారు. ఆయన ఆధునిక భారత నిశ్శబ్ద రూపశిల్పి అని కొనియాడారు. లాయల్టీ (విశ్వాసం) అనేది రాజకీయాల్లో అరుదైన పదం. కానీ, తనకు అండగా నిలబడ్డ కాంగ్రెస్ వెంట జీవితాంతం నిలబడ్డారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు కేసీఆర్ ఏడాదిన్నర పాటు మంత్రిగా పని చేశారు. అప్పట్లో కేసీఆర్‌కు ఇచ్చిన షిప్పింగ్ శాఖపై డీఎంకే అభ్యంతరం తెలిపింది. కేసీఆర్

ఆధునిక భారత్‌కు నిశ్శబ్ద రూపశిల్పి: కేటీఆర్

ఒక్క క్షణం కూడా సంకోచించకుండా.. తెలంగాణ కోసమే వచ్చానంటూ ఆ శాఖను వెనక్కి ఇచ్చారు. అప్పుడు 'ఏ లక్ష్యం కోసం మీరు వచ్చారో ఆ లక్ష్యం ఫలించాలని మనసారా కోరుకుంటున్నాను' అని మన్మోహన్ అన్నారు" అని వివరించారు. తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, బలం కారణంగా ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే రాష్ట్రం వచ్చిందన్నారు. ఎన్నో అడ్డంకులు, అభ్యంతరాలు ఉన్నా ప్రజాస్వామిక ఉద్యమాలకు ఆయన అండగా నిలబడ్డారని తెలిపారు. మన్మోహన్ గురించి మాట్లాడుకునేటప్పుడు పీవీని కూడా గుర్తు చేసుకోవాలని, గౌరవప్రదమైన వీడ్కోలు ఆయనకు దక్కలేదని, పీవీకి తప్ప ప్రధాన మంత్రులందరికీ ఢిల్లీలో స్మారకం ఉందని, పీవీకి కూడా స్మారకం ఏర్పాటు చేయాలంటూ తీర్మానం చేయాలని కోరారు. తాను కిరోసిన్ దీపాల కింద చదువుకుని దేశానికి వెలుగులు పంచిన గొప్ప నేత మన్మోహన్ సింగ్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కొనియాడారు. ఆయన పేరును స్కిల్ యూనివర్సిటీకి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. దేశానికి అప్పు పుట్టని పరిస్థితి నుంచి ఆర్థికంగా బలోపేతమయ్యేలా పలు సంస్కరణలు అమలు చేశారని, కరెన్సీ నోట్లపై ఆర్బీఐ గవర్నర్‌గా సంతకం చేసిన ఆయన.. ఆర్థిక మంత్రిగా దేశ ప్రగతికి చెరగని సంతకం చేశారని చెప్పారు. "పార్టీ ఓటమిపై ఆంటోనీ కమిటీ వేసిన కాంగ్రెస్ పెద్దలు.. అందుకు పీవీ, మన్మోహన్ ఆర్థిక విధానాలే కారణమని తేల్చితే సీడబ్ల్యూసీ సమావేశంలో మన్మోహన్ కన్నీరు పెట్టుకున్నారు. లాలు ప్రసాద్ యాదవ్‌ను కాపాడేందుకు మన్మోహన్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడంపై రాజకీయ దుమారం రేగితే అప్పట్లో రాహుల్ గాంధీ మీడియా సమక్షంలోనే ఆర్డినెన్స్ పత్రాలను చించి అవమానించారు. కేంద్ర మంత్రి మండలి నిర్ణయాలను తప్పుబట్టిన ఘనత కాంగ్రెస్ నాయకులది" అని ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో నిలిచిపోయే అతికొద్ది మంది నేతల్లో మన్మోహన్ ఒకరని, ఆయన విగ్రహాన్ని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నామని, అలాగే, ఢిల్లీలో పీవీ స్మారకం ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు.

సంతాప దినాల్లో రాహుల్ న్యూ ఇయర్ సెలబ్రేషన్: ఏలేటి



మన్మోహన్‌కు నివాళులర్పించే క్రమంలో బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో కలకలం రేపాయి. "మన్మోహన్ మరణ వార్త తెలియగానే ప్రధాని మోదీ అక్కడికి వెళ్లారు. ఢిల్లీలో స్మారక చిహ్నం ఏర్పాటుపై నిర్ణయం ప్రకటించారు. తెలుగు బిడ్డ పీవీని పదేళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ గుర్తించలేదు. కానీ, ఆ పార్టీ ఇవ్వనంత గౌరవాన్ని భారత రత్న ప్రకటించి మోదీ ఇచ్చారు. ఆ కార్యక్రమానికి కూడా హాజరు కాకుండా సోనియా గాంధీ కక్ష పెట్టుకున్నారు. మన్మోహన్ మరణంతో దేశవ్యాప్తంగా సంతాప దినాలు ప్రకటిస్తే.. న్యూ ఇయర్ సంబరాల కోసం రాహుల్ గాంధీ వియత్నాం వెళ్లారు" అని వ్యాఖ్యానించారు. దాంతో మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకొని, సంతాప తీర్మానంలో రాజకీయాలు వద్దని హితవు పలికారు. అయినా ఏలేటి అవే వ్యాఖ్యలు చేయడంతో మంత్రి పొన్నం జోక్యం చేసుకొని నిజమైన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కూడా ఈ విధంగా మాట్లాడరని, మధ్యలో పార్టీలోకి పోయిన వారు ప్రాధాన్యం కోసం ఈ విధంగా మాటాడుతున్నారని ఆక్షేపించారు. వివాదం మంచిది కాదని హితవు పలికారు. ఏలేటి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని అధికార పక్షం కోరగా.. తొలగిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. దేశానికి గతి, గమనాన్ని నేర్పిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని, ప్రపంచంలో భారత దేశం ఐదో ఆర్థిక వ్యవస్థగా మారడం వెనుక కీలక భూమిక పోషించారని సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు కొనియాడారు. సంతాప తీర్మానాల్లో ఇతర అంశాలను చేర్చడం సరికాదని, కేటీఆర్ హుందాతనంతో మాట్లాడారని ఏలేటికి పరోక్షంగా చురకలంటించారు. వివాదం చేయడానికి అనేక వేదికలున్నాయని హితవు పలికారు. కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ తదితరులు మాట్లాడారు. అనంతరం మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు.

త్రీడీ, కేడీ రేవంత్‌కు మోదీ మద్దతు

- రాష్ట్ర సర్కార్‌కు రక్షణ కవచంలా బీజేపీ
- కావాలనే అల్లు అర్జున్‌ను టార్గెట్ చేశారు
- సెటిల్మెంట్ తర్వాత ఏమీ మాట్లాడట్లేదు
- ఢిల్లీలో పీవీ స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలి: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : "ప్రభుత్వ వైఫల్యాలు బయటపడకుండా.. తెలంగాణ ప్రజలను ఎప్పటికప్పుడు మభ్యపెట్టేలా రేవంత్‌రెడ్డి సర్కార్ త్రీడీ వ్యూహంతో ముందుకెళ్తోంది. డిస్ట్రక్షన్ (విధ్వంసం), డైవర్షన్ (దారిమళ్లించడం), డిస్ట్రాక్షన్ (జనం దృష్టి మళ్లించడం)తప్ప.. పాలన చేతగాదు. ఇలాంటి కేడీ రేవంత్‌రెడ్డికి మోదీ మద్దతుగా నిలుస్తున్నారు. అమృత్ టెండర్ల గోల్‌మాల్, పౌరసరఫరాల శాఖలో కుంభకోణం, మూసీ సుందరీకరణ, హైడ్రా పేరిట అక్రమాలు వంటి అంశాలపై తాము ఫిర్యాదు చేసినా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం వెనుక ఉద్దేశం ఏంటి? తప్పులను ప్రశ్నించకపోగా... కేంద్ర మంత్రులు, ఇక్కడి బీజేపీ ఎంపీలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రక్షణ కవచంగా నిలుస్తున్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. రెండు జాతీయ పార్టీలు కుమ్మక్కై తనను కేసుల్లో ఇరికించాలని చూస్తున్నాయని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు తాను భయపడేది లేదన్నారు. ఫార్ములా-ఈ రేసింగ్‌కు హెచ్ఎండీఏ ద్వారా డబ్బులు చెల్లించామని, ఇందులో ఎక్కడా అవినీతి జరగలేదని స్పష్టం చేశారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగానే అత్యుత్సాహంతో ఈడీ నోటీసులు ఇచ్చిందని ధ్వజమెత్తారు. ఏదేమైనా ఈ అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామని వెల్లడించారు. హామీల అమలుపై ప్రజల దృష్టి మళ్లించేందుకే.. హీరో అల్లు అర్జున్‌ను ప్రభుత్వం టార్గెట్ చేసిందని ధ్వజమెత్తారు. సినిమా వాళ్లతో నిర్వహించిన సమావేశంలో సెటిల్మెంట్ చేసుకొని, ఆ అంశంపై ఏమీ మాట్లాడటం లేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అటకెక్కించడం ద్వారా ప్రజలను సర్కారు వంచించిందని ధ్వజమెత్తారు. ఇప్పుడు 2025 సంక్రాంతికి మరో సారి మోసగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై కోర్టులో కేసు వేయించడం ద్వారా.. పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించే కుట్ర జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై సీఎం, మంత్రులు ఎవరికి ఇష్టంవచ్చినట్లు వారు లెక్కలు చెబుతున్నారని, ఇప్పటికైనా అందరూ మాట్లాడుకొని ఒకే అబద్ధం చెప్పాలని వ్యాఖ్యానించారు.

సమయం వచ్చినప్పుడు కేసీఆర్ వస్తారు

ఎప్పుడు ఏం చేయాలో తమ పార్టీ అధినేత కేసీఆర్‌కు తెలుసని, సమయం వచ్చినపుడు ఆయన బయటకు వస్తారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ కోసం 24ఏళ్లు కష్టపడిన వ్యక్తి.. కొంతకాలం విశ్రాంతి తీసుకుంటే తప్పేముందని ప్రశ్నించారు. సభకు కేసీఆర్ రాకపోవడానికి గల కారణాలను హరీశ్‌రావు ఇప్పటికే వివరించారని గుర్తు చేశారు. కేసీఆర్ అమెరికాకు వెళ్లారన్న ప్రచారం శుద్ధ అబద్ధమని, సోషల్ మీడియా యాంటీ సోషల్‌గా మారిందని అన్నారు. కక్షపూరిత చర్యలతో కాంగ్రెస్ సర్కార్ ఇబ్బందులకు గురి చేస్తున్నా.. పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు కదులుతున్నారని కొనియాడారు. 2025లో పార్టీ తరఫున అనేక కార్యక్రమాలు చేపట్టబోతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం, పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియను కొత్త సంవత్సరంలో చేపడతామన్నారు. సభ్యత్వ నమోదు, పార్టీ సంస్థాగత నిర్మాణం చేపడతామని, రాష్ట్రం నుంచి గ్రామాల వరకు అన్ని స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా.. పార్టీని విజయతీరాల వైపు నడిపించేలా కేడర్‌ను సిద్ధం చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటనుందని, ఎన్నికల వ్యూహంపై పార్టీ కమిటీలతో సమావేశమై ముందుకు వెళ్తామని వెల్లడించారు. మాజీప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశం పెట్టడం బాగుందని, అయితే.. తెలంగాణకు చెందిన దివంగత పీవీ నరసింహారావును కూడా గౌరవించాలని సూచించారు. ఢిల్లీలో పీవీ స్మారకచిహ్నాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందన్నారు. పీవీకి న్యాయం జరిగే వరకు రాజ్యసభ వేదికగా తమ ఎంపీలు పోరాడతారని పేర్కొన్నారు.

గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు

(మొదటిపేజీ తరువాయి)



వ్యవహరించలేదన్నారు. రేవంత్ రెడ్డి గట్టి నాయకుడని, కిందిస్థాయి నుంచి ఎదిగారని ప్రశంసించారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. "అల్లు అర్జున్ థియేటర్‌కు వెళ్లే ముందు తగిన ఏర్పాట్లు చేసుకుని ఉండాల్సింది. హీరో అభివాదం చేయకపోతే పొగరని అనుకుంటారు. అభివాదం చేయడం ఎంజాయ్ చేయడం కాదు.. అభిమానులకు భరోసా కల్పించడం. తొక్కిసలాట ఘటన బాధాకరమైనది. అల్లు అర్జున్ థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు ఆయనకు సిబ్బంది చెప్పి ఉండాల్సింది. సంఘటన జరిగిన వెంటనే బాధితుల కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి వారిని ఓదార్చాల్సిన అవసరం ఉంది. హీరో తరఫున ఎవరో ఒకరు వెళ్లి ఉంటే సమస్య పెద్దది అయ్యేది కాదు. మా ప్రమేయం లేకుండా తప్పు జరిగిపోయిందని చెప్పి, క్షమాపణలు కోరాల్సింది. ఓదార్చే సమయంలో ఒక్కసారి మనం తిట్లు కూడా తినాల్సి వస్తుంది. సినిమా నిర్మాత, డైరెక్టర్ పరామర్శించ లేదు. అదే పెద్ద లోపంగా కనిపిస్తోంది. ఎక్కడో మానవతా దృక్పథం లోపించింది. సమస్య పరిష్కారంలో టీమ్ ఫెయిలైంది. కేవలం హీరోపై నిందలు వేయడం కూడా కరెక్టు కాదు. సినిమానే కాదు సమస్యనూ టీమ్‌గా తీసుకోవాలి. సమస్యను హీరోపై పెట్టి ఒంటరి వ్యక్తిని చేసేశారు. అది కరెక్టుగా అనిపించలేదు. ఆ తర్వాత అల్లు అర్జున్‌ను ఎవరూ సరిగా గైడ్ చేయలేదు" అని పవన్ అన్నారు.

రేవంత్ కక్షసాధింపులకు పోలేదు

'సినిమా చూడడానికి వచ్చి ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. పోలీసులను మనం ప్రశ్నించలేం. అల్లు అర్జున్ విషయంలో ముందు, వెనుక ఏం జరిగిందో నాకు తెలియదు. నేను థియేటర్‌కు వెళ్లను. నా మూడో సినిమా నుంచి థియేటర్‌కు వెళ్లడం మానేశాను. చిరంజీవి కూడా ముసుగు వేసుకుని సినిమా థియేటర్‌కు వెళ్లేవారు. అభిమానులు భారీ వస్తారు కాబట్టి, హీరో థియేటర్‌కు వెళ్లే సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పు చేస్తే ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందే. చట్టం అమలులో ఒక్కొక్కరికి ఒకలా ఉండకూడదు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటన తర్వాత సీఎం హోదాలో రేవంత్ రెడ్డి స్పందించారు. అక్కడ ఎవరున్నా రేవంత్‌రెడ్డి అలానే చేసేవారు. ఆయన పేరు చెప్పలేదని అంటున్నారు. అది చాలా చిన్న రీజన్. రేవంత్ రెడ్డి ఆ సినిమాకు అన్ని రకాలుగా సహకరించారు. బెనిఫిట్ షోకు అవకాశం కల్పించారు. టికెట్ల రేట్లు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చారు. జగన్‌లా నిలిపేసి, కక్షసాధింపు చేయలేదు. సంఘటన ఎవరి చేతుల్లో లేకుండా పోయింది. పోలీసుల నుంచి రేవంత్‌రెడ్డికి ప్రశ్నలు తలెత్తుతాయి. ఇప్పుడు ఉపేక్షిస్తే రేపు మాకు సమస్య వస్తుందని అంటారు. అల్లు అర్జున్ మామ కూడా కాంగ్రెస్ వ్యక్తి. అల్లు అర్జున్, రామ్‌చరణ్, రాణా.. వీరంతా రేవంత్‌రెడ్డి చుట్టుపక్కల తిరిగిన వారే. రేవంత్ రెడ్డి ఎప్పటి నుంచో మాకు తెలుసు. రేవంత్ వీరందరికి సూపర్ సీనియర్. ఇది అనుకోకుండా జరిగింది. తెలంగాణ ప్రభుత్వం కూడా సున్నితంగా వెళ్లి ఉండవచ్చునని కొందరు అనుకుంటారు' అని పవన్ అన్నారు.

క్రమశిక్షణ ఉండాలి

'సినిమా పరిశ్రమ పని విధానం మార్చుకోవాలి. క్రమశిక్షణ, స్థిరత్వం ఉండాలి. తెలుగు సినీ పరిశ్రమలో గుర్తింపు పొందిన కవుల గురించి ఎంతమందికి అవగాహన ఉంది? సినీ పరిశ్రమ వల్ల భారీ ఆదాయం వస్తుంది. ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంది. పర్యాటక శాఖకు పరిశ్రమ హోదా కల్పించాం. అలానే సినిమా పరిశ్రమకు హోదా రావాలంటే కొన్ని మార్పులు జరగాలి. దీనిపై అందరూ ఆలోచించాలి. మంచి సినిమాలు రావాలంటే మౌలిక సదుపాయాలు ఉండాలి. స్టోరీ, కల్చర్ గురించి చెప్పే సినీ పాఠశాలలు ఏపీలో ఏర్పాటు చేయాలి' అని పవన్ అన్నారు.

ముత్యాల ముగ్గు

15 చుక్కలు, 5 వరసలు
5 వచ్చేవరకు, సరిచుక్క





రాధిక
వర్ని, నిజామాబాద్

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి
కార్యాలయం, రోడ్ నెంబర్ 70,
హుడా హైట్స్, జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500033.
ఈ-మెయిల్:
features@andhrajyothy.com

శ్రీతేజకు మళ్లీ వెంటిలేటర్‌పై చికిత్స

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజకు మళ్లీ వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించాల్సిన అవసరం ఏర్పడిందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. శ్రీతేజకు మొదట్లో వెంటిలేటర్‌తో చికిత్స అందించగా కాస్త కోలుకోవడంతో దాన్ని తొలగించారు. మళ్లీ అతని ఆరోగ్యం పరిస్థితి కాస్త ఇబ్బందికరంగా మారడంతో రెండు రోజుల నుంచి వెంటిలేటర్ ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి వైద్యులు చేతన్ ఆర్.ముందాడ, విష్ణు తేజ్‌పుడి తెలిపారు. ఊపిరితిత్తుల్లో సమస్యను గుర్తించినట్లు పేర్కొన్నారు. శ్రీతేజకు జ్వరం లేదని, నాడీ సంబంధిత స్థితి యథాతథంగా ఉందని, ట్యూబ్ ద్వారా ద్రవ ఆహారం అందిస్తున్నట్లు వివరించారు

రాష్ట్రంలోని సెక్యూరిటీ ఏజెన్సీలకు అల్లు అర్జున్ బౌన్సర్లతో సంబంధం లేదు

- అనధికారిక ఏజెన్సీలపై చర్యలు తీసుకోండి
- ప్రభుత్వానికి సెక్యూరిటీ అసోసియేషన్ విజ్ఞప్తి

పంజాగుట్ట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనధికారిక, నిబంధనలు పాటించని ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని 'సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ' ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో సుమారు 840 సెక్యూరిటీ ఏజెన్సీలు ఉండగా తమ అసోసియేషన్ పరిధిలో 200 ఉన్నాయని తెలిపింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ డీ జాదవ్, ఛైర్మన్ డీఎస్ రెడ్డి మాట్లాడారు. ఇటీవల సంధ్య థియేటర్లో జరిగిన తొక్కిసలాట ఘటన సమయంలో నటుడు అల్లు అర్జున్ కోసం పనిచేసిన బౌన్సర్లకు, రాష్ట్రంలోని సెక్యూరిటీ ఏజెన్సీలకు సంబంధం లేదని వారు స్పష్టం చేశారు. సెక్యూరిటీ ఏజెన్సీలను ఇష్టానుసారంగా నిర్వహించడం వల్లనే ప్రమాదం చోటుచేసుకుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ వ్యవస్థను క్రమబద్ధీకరిస్తూ ఒకే యూనిఫామ్‌ను ఆమోదించాలని తాము కొంతకాలంగా కోరుతున్నామన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేవతి మృతికి అల్లు అర్జునే కారణం

- అతని బెయిల్ పిటిషన్‌పై పోలీసుల కౌంటర్
- ముగిసిన విచారణ... తీర్పు వచ్చే నెల 3న

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై నాంపల్లిలోని రెండో మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో విచారణ పూర్తయింది. ఈ బెయిల్ పిటిషన్‌పై చిక్కడపల్లి పోలీసులు సోమవారం కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ), అర్జున్ న్యాయవాది నిరంజన్ రెడ్డి మధ్య వాడివేడిగా వాదనలు జరిగాయి. జడ్జి ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును వచ్చే నెల 3వ తేదీకి వాయిదా వేశారు. ప్రస్తుతం హైకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌పై ఉన్న అల్లు అర్జున్ సాధారణ బెయిల్ కోసం ఈ నెల 27న నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై తొలుత సమయం కోరిన పోలీసులు, తాజాగా కౌంటర్ దాఖలు చేశారు. తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతికి అల్లు అర్జున్‌నే ప్రధాన కారణమని పీపీ గట్టిగా వాదించారు. ఆ సమయంలో అతను థియేటర్‌కు రావడం వల్లే తొక్కిసలాట జరిగిందని, అతనికి బెయిల్ ఇస్తే తన పలుకుబడితో సాక్షులను ప్రభావితం చేస్తాడన్నారు. అంతేకాక విచారణకు కూడా సహకరించడని, కాబట్టి అతని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. తొలుత నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ సంధ్య థియేటర్ ఘటనతో అల్లు అర్జున్‌కు ఎలాంటి సంబంధం లేదని, అందుచేత తొక్కిసలాటలో రేవతి మరణానికి కారణమంటూ అతనిపై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు వర్తించవని వాదించారు. అతనికి వ్యతిరేకంగా పోలీసులు సరైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదు కాబట్టే హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిందని పేర్కొన్నారు.

గడియారంలో సెకన్ల ముల్లులా కాలం వేగంగా కరిగిపోయింది. నూతన సంవత్సర వేడుకల జ్ఞాపకాలు ఇంకా మదిలో మెదులుతుండగానే.. ఏడాది గడిచిపోయింది! 2024 కాలగర్భంలో కలిసిపోయి 2025 మన ముంగిటికి వచ్చేసింది. ఉగాది పచ్చడిలో రకరకాల రుచుల్లా.. గడిచిన ఏడాది కాలంలో కొన్ని తీపిజ్ఞాపకాలు.. కొన్ని చేదు అనుభవాలు.. కొన్ని అనూహ్య ఘటనలు.. కొన్ని సంచలనాలు! ఏదేమైనా అవన్నీ గతం. ఆ గతానికి చుక్క పెట్టి.. కొత్త ఏడాదికి స్వాగతం చెప్పే సమయం ఆసన్నమైంది. రాబోయే సంవత్సరంలో వివిధ రంగాల భవిష్యత్తు ఎలా ఉండబోతోందనే అంశంపై సంబంధిత రంగాల నిపుణులకు ఆశాజనకమైన ఆలోచనలు, అంచనాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం..



విద్యుత్తు వాహనాల జోరు



ఇప్పటికే మనదేశంలో విద్యుత్తు వాహనాలకు (ఈవీ) డిమాండు బాగా పెరిగింది. కొత్త సంవత్సరంలో ఈవీల సంఖ్య ఇంకా పెరుగుతుందని వాహనరంగ నిపుణులు చెబుతున్నారు. మారుతీ నుంచి మెర్సిడెస్ దాకా.. అన్ని శ్రేణుల్లోని కార్ల కంపెనీలూ విద్యుత్తు వాహనాలకు పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా కొత్త మోడళ్లను మార్కెట్లోకి దించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఒక్క 2025లోనే అన్ని కంపెనీలవీ కలిపి కొత్తగా 19 ఈవీలు రోడ్లపైకి రాబోతున్నాయి.

ప్రయాణించిన దూరానికే టోల్ రుసుము



దేశంలో టోల్‌గేట్ల వద్ద రద్దీని ఫాస్టాగ్‌తో తగ్గించిన కేంద్ర ప్రభుత్వం.. శాటిలైట్ టోల్‌గేట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే! పైలట్ ప్రాజెక్టు కింద.. ఇప్పటికే ఎన్‌హెచ్-275 కర్ణాటకలో బెంగళూరు-మైసూరు నడుమ, హరియాణాలో ఎన్‌హెచ్-709పై పానిపట్-హిసార్ నడుమ ఈ టోల్‌గేట్ వ్యవస్థను పరీక్షించి చూశారు. ఈ పద్ధతిలో.. హైవేపై ఎంత దూరం ప్రయాణించారో అంతదూరానికి మాత్రమే టోల్ వసూలు చేస్తారు. ఎంపిక చేసిన జాతీయ రహదారులపై.. జీపీఎస్ వ్యవస్థ ఉన్న వాహనాలు రోజూ 20 కిలోమీటర్ల మేర ఉచితంగా ప్రయాణించే వీలు కల్పిస్తారు. ఈ విధానం 2025లో దేశవ్యాప్తంగా అమలు చేస్తారని అంచనా.

2025 కొత్త సంవత్సరం గొప్ప శుభ సూచకం

స్పేస్ టూరిజానికి రెక్కలు.. మరిన్ని అద్భుతాలు సృష్టించనున్న ఏఐ

శాటిలైట్ టోల్‌గేట్ వ్యవస్థ అమల్లోకి?.. కాస్తంత తగ్గనున్న భూతాపం!

కృత్రిమ మేధ విశ్వరూపం

రెండేళ్ల క్రితం ప్రపంచానికి పరిచయమై 'ఇంతింతై వటుడింతై..' అన్నట్టుగా ఎదిగి దాల్చి 2024లో సామాన్య జనాల ఫోన్లలోకీ అందుబాటులోకి వచ్చేసిన జనరేటివ్ ఏఐ కొత్త సంవత్సరంలో మరిన్ని కొత్త రంగాలకు విస్తరించి.. విశ్వరూపం దాలుస్తుందని టెక్ నిపుణులు చెబుతున్నారు. మన ఎదుర్కొనే రోజువారీ సమస్యలు చాలావాటిని కృత్రిమ మేధ పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. 2025 ఫిబ్రవరి 10-11 తేదీల్లో ఫ్రాన్స్‌లో జరిగే 'ఏఐ యాక్షన్ సమ్మిట్'లో.. కృత్రిమ మేధను ప్రజా శ్రేయస్సు కోసం వినియోగించే విధానాలపై చర్చించనున్నారు. మరోవైపు.. ఇన్నాళ్లుగా కృత్రిమ మేధ పరిశోధనల కోసం వేలాది కోట్ల రూపాయలు ధారపోసిన సంస్థల్లో ఒక దిగ్గజ సంస్థ కొత్త ఏడాదిలో తన పరిశోధనలకు ముగింపు పలుకుతుందని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

- సెంట్రల్ డెస్క్



భూతాపం రివర్స్?



ఇప్పటిదాకా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరాలుగా 2023, 2024 నమోదైన సంగతి తెలిసిందే! కానీ.. 2025 ఇందుకు భిన్నంగా ఉండబోతోందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. లానినా (పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర జలాల ఉష్ణోగ్రతలు తగ్గడం) కారణంగా భూ ఉపరితల సగటు ఉష్ణోగ్రత కొంత తగ్గుతుందని వారు అంచనా వేస్తున్నారు. పారిశ్రామిక యుగానికి ముందు భూ ఉపరితల సగటు ఉష్ణోగ్రత 15 డిగ్రీలు. మానవుల జీవనశైలి, పారిశ్రామికీకరణ వల్ల పెరిగిపోయిన కర్బన ఉద్గారాల విడుదల కారణంగా భూతాపం పెరిగి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రపంచ దేశాలన్నీ కలిసి 2015లో పారిస్‌లో సమావేశమై.. భూతాపం పారిశ్రామిక యుగానికి ముందుతో పోలిస్తే 1.5 డిగ్రీలు మించకుండా ఒప్పందం చేసుకున్నారు. కానీ, భూతాపం 2023లోనే ఆ 1.5 డిగ్రీల పరిమితిని దాటేసిందని శాస్త్రజ్ఞులు ఇటీవల ప్రకటించారు. కానీ, 2025లో లానినా వల్ల మళ్లీ భూతాపం ఆ 1.5 డిగ్రీల పరిధిలోపునకు వస్తుందని అభిప్రాయపడుతున్నారు. అంతమాత్రాన ఎండాకాలంలో ఎండలు తగ్గుతాయని చెప్పలేమని.. కొత్త ఏడాదిలోనూ వేసవి ఉష్ణోగ్రతలు భయపెడతాయని హెచ్చరిస్తున్నారు.

మూడో ప్రపంచ యుద్ధ ముప్పు?

కొత్త ఏడాదిలో చాలావరకూ శుభసూచకాలే కనిపిస్తున్నా.. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రాంతీయ యుద్ధాలు, వాటి వెనుక పలు దేశాల ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం మాత్రం భయపెడుతున్నాయి. 2022 ఫిబ్రవరిలో మొదలైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది! రష్యాను ప్రతిఘటించడంలో ఉక్రెయిన్‌కు అమెరికా, యూరప్ దేశాలు ఇప్పటికీ సహకరిస్తూనే ఉన్నాయి. అలా సహకారం అందిస్తున్న నాటో దేశాలపైనా దాడికి వెనకాడబోమని రష్యా ఇప్పటికే హెచ్చరించడం గమనార్హం. మరోవైపు.. 2023 అక్టోబరులో హమాస్ తమ దేశంపై చేసిన దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధ జ్వాలలు సుదూరాలకు విస్తరిస్తున్నాయి. హమాస్‌తోపాటు.. పాలస్తీనాకు అండగా రంగంలోకి దిగిన హౌతీలు (యెమెన్), హిజ్బుల్లా అగ్రనేతలు పలువురిని ఇజ్రాయెల్ చంపేసింది. దీంతో వారందరికీ అండగా ఉన్న ఇరాన్.. ఇజ్రాయెల్‌పై 180కి పైగా క్షిపణులతో దాడి చేయడం, దానికి ప్రతిగా ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడి సైనిక స్థావరాలను నాశనం చేయడం.. మరోవైపు సిరియాలో రాజధాని డమాస్కస్‌కు కేవలం 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న అత్యంత కీలకమైన మౌంట్ హెర్మన్‌పై పట్టు సాధించడం తదితర పరిణామాలతో ఆ ప్రాంతమంతా రగులుతోంది. ఈ యుద్ధాలు ఆయా ప్రాంతాలకు/దేశాలకే పరిమితం కాక.. ఘర్షణ వాతావరణం మరింత పెరిగి మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందన్న ఆందోళన చాలా మందిలో వ్యక్తమవుతోంది.



జన్యు సవరణ పంటలు!



బయోటెక్నాలజీ రంగంలో పురోగతి వ్యవసాయానికి చేస్తున్న మేలు అంతా ఇంతా కాదు! ఇప్పటికే దాని ఫలాలను మనం అనుభవిస్తున్నాం. అయితే.. 2025లో ఈ రంగంలో మరింత విప్లవాత్మక మార్పులు సంభవించే అవకాశం ఉందని, క్రిస్పర్ జన్యు సవరణ ప్రక్రియ ద్వారా.. కరువుకాటకాలను తట్టుకునే పంటలను సృష్టించవచ్చని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.



అంతరిక్ష పర్యాటకానికి రెక్కలు!

ఇన్నాళ్లుగా శిక్షణ పొందిన వ్యోమగాములకు మాత్రమే సాధ్యమైన రోదసి యానం.. ఆ కోరిక ఉన్న సంపన్నులకు 2025లో అందుబాటులోకి రానుంది. స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజిన్, వర్జిన్ గెలాక్టిక్, ఓరియన్ స్పాన్ తదితర కంపెనీలు.. భూమికి 80 నుంచి 100 కిలోమీటర్ల ఎత్తున ఉండే కర్మన్ లైన్ దాకా తీసుకెళ్లే ప్యాకేజీలను రూపొందిస్తున్నాయి. ఆ ప్యాకేజీల ద్వారా ఎంచక్కా రోదసిలోకి వెళ్లిరావొచ్చు.

చిత్రజ్యోతి

SINCE 1965

కన్నప్ప కోసం నెమలి



మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో హీరోయిన్ ఎవరనేది సోమవారం ప్రకటించారు. ఇందులో చెంచు రాణి నెమలిగా నటిస్తున్న ప్రీతి ముకుందన్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. 'అందంలో సహజం. తెగింపులో సాహసం, ప్రేమలో అసాధారణం.. భక్తిలో పారవశ్యం.. కన్నప్పకు సర్వస్వం' అంటూ నెమలి పాత్రను పరిచయం చేశారు. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన ప్రీతి భరతనాట్యంలో ప్రసిద్ధురాలు. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 25న విడుదలవుతుంది.



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను నిర్మాత దిల్ రాజు సోమవారం మంగళగిరిలో కలిశారు. విజయవాడలో నిర్వహించే 'గేమ్‌ఛేంజర్' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు రావాలని పవన్‌ను ఆహ్వానించగా, ఆయన అంగీకారం తెలిపారు. జనవరి 4 లేదా 5 తేదీల్లో ఈ ఫంక్షన్ జరుగుతుంది.

గాయకుడిగా మరోసారి



హీరో సిద్ధార్థ్‌కు అప్పుడప్పుడు పాటలు పాడడం ఓ సరదా. తాను నటించే సినిమాల్లోనే కాకుండా ఇతర హీరోల చిత్రాలకు కూడా వీలు చూసుకుని పాటలు పాడుతుంటారు. ఆడియన్స్ కూడా ఆ పాటల్ని బాగా ఎంజాయ్ చేశారు. ఇంతవరకూ తొమ్మిది పాటలు పాడిన సిద్ధార్థ్ ఇప్పుడు పదో సారి 'ఇట్స్ ఓకే గురూ' చిత్రం కోసం 'నా శ్వాస నువ్వై పోయావే' అంటూ ఓ పాట పాడారు. మోహిత్ రెహ్మానియక్ స్వరాలు అందించారు. చరణ్ సాయి, ఉషశ్రీ జంటగా నటించిన 'ఇట్స్ ఓకే గురూ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. మణికంఠ దర్శకత్వం వహించిన ఈ సినిమాను త్వరలో విడుదల చేస్తామని నిర్మాతలు సురేశ్ అనపురపు, బస్వ గోవర్ధన గౌడ్ చెప్పారు.



48 గంటల్లోనే ఓకే చేశారు!

మెగాస్టార్ చిరంజీవి ఇటీవలే 'దసరా' ఫేమ్, దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఓ సినిమాను అంగీకరించిన సంగతి తెలిసిందే. పీరియాడిక్ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ గురించి శ్రీకాంత్ ఓదెల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. "చిరంజీవి చిత్రాలు చూస్తూ పెరిగాను. ఆయన వల్లే సినిమాలపై మక్కువ ఏర్పడింది. ఆయనతో సినిమా చేయడాన్ని నమ్మలేకపోతున్నాను. ఈ సినిమా కచ్చితంగా వైవిధ్యంగా ఉంటుంది. వింటేజ్ చిరును చూస్తారని చెప్పను గానీ.. ఆయన పాత్ర మాత్రం సరికొత్తగా ఉంటుంది. ఆయన బాడీ లాంగ్వేజ్‌కు తగిన చిత్రమిది. చిరంజీవి కారవాన్‌లో ఉన్నంతవరకే ఆయన అభిమానిని. చిరంజీవి సెట్స్‌లో అడుగు పెట్టాక ఆయనని నా సినిమాలో పాత్రలాగే చూస్తా. ఈ సినిమా స్క్రిప్టును 48 గంటల్లోనే ఫైనల్ చేసేశాం. సినిమాల పట్ల ఆయన చూపించే ఉత్సుకత ఎంతో స్ఫూర్తినిస్తుంది. ఈ ప్రాసెస్ అంతా నాకు పట్టలేనంత ఆనందాన్నిచ్చింది" అని పేర్కొన్నారు. ఈ సినిమాకు నాని సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో "హింసలోనే ఆయన తన శాంతిని వెతుక్కుంటాడు" అని పేర్కొన్నారు. సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నానితో 'ప్యారడైజ్' సినిమాను చేస్తున్నారు శ్రీకాంత్. ఈ సినిమా పూర్తయ్యాక చిరుతో చేసే సినిమా పట్టాలెక్కనుంది.



అది మా అదృష్టం

చిత్ర పరిశ్రమకు అక్కినేని నాగేశ్వరరావు చేసిన కృషిని ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించడంపై నాగచైతన్య దంపతులు స్పందించారు. ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. 'అక్కినేని నాగేశ్వరరావు కళా నైపుణ్యాన్ని, తెలుగు సినిమా పరిశ్రమకు ఆయన చేసిన కృషిని మీరు అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. మీ నుంచి ప్రశంసలు పొందడం మా అదృష్టం. మీకు హృదయపూర్వక ధన్యవాదాలు' అంటూ నాగచైతన్య, శోభిత పోస్టులు పెట్టారు.

సల్మాన్‌తో పెళ్లి.. పెదవి విప్పిన సంగీత!



సల్మాన్ ఖాన్‌తో ప్రేమ, పెళ్లి విషయంపై గతంలో ఎంతో ప్రచారం జరిగినా, ఎందరు అడిగినా స్పందించని బాలీవుడ్ మాజీ నటి సంగీత బిజ్లాని ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు పెదవి విప్పారు. 'నిజమే.. సల్మాన్ ఖాన్‌తో నా పెళ్లి జరగాల్సింది.. కానీ అనివార్య పరిస్థితుల కారణంగా అది ఆగిపోయింది' అని వెల్లడించారు. మ్యూజిక్ రియాల్టీ షో ఇండియన్ ఐడల్‌కు హాజరైన సంగీత తన వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. సల్మాన్‌తో పెళ్లి ఆగిపోయిన విషయాన్ని మాత్రమే వెల్లడించిన ఆమె దాని గురించి ఇంకేమీ చెప్పాలనుకోవడం లేదని తెలిపారు. 'ఓ నటితో నా పెళ్లి జరగాల్సింది. శుభలేఖలు కూడా ప్రింట్ చేశాం. కానీ ఆ పెళ్లి ఆగిపోయింది' అని సల్మాన్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని ఇప్పుడు అందరూ గుర్తు చేసుకుంటున్నారు. ఆ నటి ఎవరో అప్పుడు సల్మాన్ చెప్పలేదు. ఓహో సంగీత గురించే సల్మాన్ అలా చెప్పాడన్న మాట అని అందరూ అంటున్నారు.

లైలా కోసం కలం పట్టిన విశ్వక్



విశ్వక్ సేన్ రెండు విభిన్న పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'లైలా'. ఇందులో ఆయన లేడీ గెటప్‌లో నటిస్తుండడం ఓ విశేషమైతే.. ఇప్పుడు ఈ సినిమా కోసం కలం పట్టి పాట రాయడం మరో విశేషం. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. 'మోడల్ మోడల్ సోనూ మోడల్' అంటూ సాగే ఈ పాటలో విశ్వక్ అమ్మాయిల మనసులను ఎలా గెలిచాడో ఆసక్తికరంగా చూపించారు. విశ్వక్ సేన్ రాసిన ఈ పాటను నారాయణ్ రవిశంకర్, రేష్మ శ్యామ్ ఆలపించారు. లియోన్ జేమ్స్ సంగీతం అందించారు.

ఇన్ ప్రోగ్రెస్

ఓ రైతు భావోద్వేగ ప్రయాణం



బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో దయా దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'బాపు'. రాజు, సీహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మాతలు. ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఎగుర్ల, అవసరాల శ్రీనివాస్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రానా దగ్గుబాటి లాంచ్ చేశారు. హాయిగా డైనింగ్ ఛైర్‌లో కూర్చున్న ఓ తండ్రి చుట్టూ ఒక కుటుంబం గుమిగూడి, అతనికి ఇష్టమైన వంటకాలను వడ్డించడం పోస్టర్‌లో కనిపిస్తోంది. నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతోన్న ఓ రైతు భావోద్వేగ ప్రయాణం ఈ చిత్ర కథ అని మేకర్స్ తెలిపారు.

తండ్రీ కొడుకుల సెంటిమెంట్



తమిళంలో కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రధారులుగా, గణేశ్ కె.బాబు దర్శకత్వంలో తెరకెక్కి సూపర్ హిట్ అయిన చిత్రం 'డా..డా'. తెలుగులో 'పా..పా' టైటిల్‌తో జేకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై నీరజ కోట జనవరి 3న విడుదల చేస్తున్నారు. 'తండ్రీ కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి తమిళంలో ఘన విజయం సాధించింది. 'పా..పా' పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎంజీఎం సంస్థ నుంచి అచ్చిబాబు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు' అని నిర్మాత అన్నారు.



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న ఎస్ఐ మహేందర్ మొదటి భార్య జ్యోతి

నా భర్త పట్టించుకోవడం లేదు.. మమ్మల్ని చావనివ్వండి

- పిల్లలతో కలిసి టాస్క్‌ఫోర్స్ ఎస్సై భార్య నిరసన
- నన్ను 2014లో పెళ్లి చేసుకున్నాడు : రెండోభార్య



రెండో భార్య వసంత

నల్లగొండ క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆమె ఓ ఎస్సై భార్య. తన భర్తకు ఓ మహిళా కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం ఉందని, దీనిపై ప్రశ్నిస్తే చంపేస్తానని బెదిరిస్తున్నాడని, ఇద్దరు పిల్లలతో కారుణ్య మరణానానికి అనుమతించాలంటూ రోడ్డు మీద ఫ్లెక్సీ పట్టుకొని పిల్లలతో కలిసి నిరసన వ్యక్తం చేసింది. ఆ ఎస్సై నల్లగొండ జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న జాల మహేందర్. ఆయన భార్య పేరు జ్యోతి. ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళా కానిస్టేబుల్ పేరు సరిత. తన భర్తకు సరితతో వివాహేతర సంబంధం ఉందని, తమను పట్టించుకోవడం లేదని, తమను చనిపోయేందుకు అనుమతించాలని కోరుతూ సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ వద్ద ఫ్లెక్సీతో జ్యోతి నిరసన వ్యక్తం చేసింది. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌లను కలిసి తన భర్త వివాహేతర సంబంధంపై ఫిర్యాదు చేసింది. తన స్వస్థలం నార్కట్‌పల్లి అని, తనకు, మహేందర్‌కు 2010లో పెళ్లయిందని.. తమకు కవలలు బాబు, పాప ఉన్నారని చెప్పింది. నాలుగేళ్ల క్రితం నుంచి భర్త తమను పట్టించుకోవడం లేదని, ఇంటికి కూడా రావడం లేదని వెల్లడించింది. తన ఆస్తులను ఆయన, సరిత పేరిట రాసిచ్చాడని ఇద్దరూ కలిసి తనను, తన పిల్లలను చంపుతామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, న్యాయం చేస్తారనే ఆశతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని జ్యోతి పేర్కొంది. కాగా, సరిత.. సోమవారం ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి నల్లగొండలో విలేకరులతో మాట్లాడింది. భర్తతో విడాకులు తీసుకొని ఎస్సై మహేందర్‌ను 2014 ఏప్రిల్ 12న పెళ్లి చేసుకున్నానని చెప్పింది. జ్యోతి, ఆమె సోదరి రేవతి, కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషించారని.. పలుమార్లు రౌడీలతో బెదిరింపులకు కూడా పాల్పడ్డారని ఆరోపించింది.

అసంక్రమిత వ్యాధులపై హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సమావేశం!


ఎన్‌సీడీపై తొలిసారి నగరంలో 8, 9 తేదీల్లో నిర్వహించనున్న కేంద్రం

- పదేళ్లుగా ఢిల్లీకే పరిమితం
- తొలిసారి హైదరాబాద్‌లో నిర్వహణ

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ)పై నిర్వహించనున్న జాతీయ స్థాయి సమావేశానికి తెలంగాణ వేదిక కాబోతోంది. 2025 జనవరి 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా రెండేళ్లకోసారి ఢిల్లీలో ఎన్‌సీడీపై సమావేశం జరుగుతుంది. ఈ జాతీయ సమావేశానికి అన్ని రాష్ట్రాలకు చెందిన ఎన్‌హెచ్‌ఎం ఎండీలు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారు (పీవో)లు హాజరవుతుంటారు. కేంద్ర ఆరోగ్య శాఖ ఇలాంటి జాతీయ స్థాయి సమావేశాన్ని ఇప్పటివరకు ఢిల్లీలో తప్ప ఇతర రాష్ట్రాల్లో నిర్వహించలేదు. పదేళ్లుగా ఈ సమావేశాలన్నీ ఢిల్లీకే పరిమితం అయ్యాయి. ఒక రాష్ట్రంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి అని వైద్య వర్గాలు తెలిపాయి.

మన దగ్గరే ఎందుకంటే..

దేశంలో ఇతర రాష్ట్రాలకంటే ఎన్‌సీడీ పరీక్షలు మన దగ్గర బాగా చేస్తున్నారు. అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, కేన్సర్ వంటి రోగనిర్ధారణ పరీక్షలను 30 ఏళ్లు పైబడిన వారికి చేస్తున్నారు. అన్ని జిల్లాల్లో ఏఎన్ఎం, ఆశాల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ఎన్‌సీడీ స్ర్కీనింగ్ చేస్తున్నారు. ఇప్పటికే రెండు దఫాలు మన దగ్గర ఎన్‌సీడీ పరీక్షలు పూర్తి చేశారు. 2017లో తొలిసారి ఎన్‌సీడీ పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో చేశారు. అనంతరం 2018 ఏప్రిల్‌లో ప్రారంభించి 2020 మార్చి వరకు మొదటి విడత 1.08 కోట్ల మందికి ఎన్‌సీడీ పరీక్షలు చేశారు. అందులో 9.8 లక్షల మంది రక్తపోటుతో, 5.2 లక్షల మంది మధుమేహంతోనూ బాధపడుతున్నట్లు తేలింది. ఆ తర్వాత 2021 ఏప్రిల్ నుంచి రెండో విడత పరీక్షలు ప్రారంభించి 2023 మార్చి వరకు పూర్తి చేశారు. ఇందులో భాగంగా 1.45 కోట్ల మందికి పరీక్షలు చేశారు. ఆ పరీక్షల్లో 20.6 లక్షల మందికి బీపీ, మరో 9.80 లక్షల మందికి షుగర్ నిర్ధారణ అయింది. ఈ ఏడాది అంటే 2024 మే నుంచి మూడో విడత ఎన్‌సీడీ స్ర్కీనింగ్‌ను ప్రారంభించి ఇంకా కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు కోటిమందికిపైగా పరీక్షలు చేశారు. మూడో విడత స్ర్కీనింగ్‌ను 2025 మార్చి నెలాఖరుల్లా పూర్తి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యం గా పెట్టుకుంది. ఎన్‌సీడీ స్ర్కీనింగ్ విషయంలో ఇతర రాష్ట్రాలు ఒకటి, రెండు విడతలకే పరిమితం కాగా, మనదగ్గర మూడో విడత పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కిందటే ప్రారంభించింది. అంతేకాకుండా బీపీ, షుగర్ బాధితులకు నెలరోజులకు సరిపడా మందులిచ్చే కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీడీ కిట్లను కూడా ఉచితంగా పంపిణీ చేసింది. ఎన్‌హెచ్‌ఎంలో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమా న్ని ఇతర రాష్ట్రాల కంటే వేగంగా, మెరుగ్గా మనదగ్గర నిర్వహిస్తుండడంతో కేంద్రం దృష్టి తెలంగాణపై పడిం ది. దాంతో ఇక్కడ ఎన్‌సీడీ స్ర్కీనింగ్ ఎలా నిర్వహిస్తున్నారు? ఉచిత ఔషధ పంపిణీ ఎలా ఉంది? క్షేత్రస్థాయిలో పరీక్షల్లో పాల్గొనే వైద్య సిబ్బంది దగ్గర ఎలాంటి టెస్టింగ్ మిషన్లు ఉన్నాయి? రోజుకు ఎంతమందిని పరీక్షిస్తున్నారు? అనే అంశాలపై ఇతర రాష్ట్రాల వారికి కూడా అవగాహన కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. అందులో భాగంగానే ఎన్‌సీడీపై జాతీయ స్థాయి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తోంది.



ఏర్పాట్లు చేయండి

జనవరిలో రెండు రోజుల పాటు ఈ జాతీయ సమావేశాన్ని నిర్వహిస్తామని, సంబంధిత ఏర్పాట్లు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం ఎండీ ఆర్వీ కర్ణన్‌ను కోరింది. సోమవారం ఇదే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించింది. శామీర్‌పేటలోని ఓ రిసార్ట్‌లో ఈ జాతీయ స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ సమావేశానికి కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి సౌరబ్ జైన్, ఎన్‌హెచ్‌ఎం ఎండీ ఆరాధన పట్నాయక్ హాజరుకానున్నారు. అలాగే అన్ని రాష్ట్రాల ఎన్‌హెచ్‌ఎం ఎండీలు, ఎన్‌సీడీ పీవోలు హాజరవుతారు. అలాగే కేన్సర్‌కు సంబంధించిన అంశాలపై ముంబై టాటా మెమోరియల్ కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ సుదీప్‌గుప్తా, చండీగఢ్ బాబా కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఆశిష్ గులియా, ఐసీఎంఆర్ డైరెక్టర్ (ఎన్‌సీడీఐఆర్) ప్రశాంత్ మాథుర్‌ల కీలక ప్రసంగాలుంటాయి. బీపీ, షుగర్‌తో వచ్చే గుండె పోట్లు, వాటి నివారణ తదితర అంశాలపై ఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన ప్రముఖ వైద్యులు కూడా ప్రసంగించనున్నారు. రెండో రోజు నాలుగైదు జిల్లాల్లో కేంద్ర బృందంతో పాటు రాష్ట్రాల ఎన్‌హెచ్‌ఎం ప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నారు. మేడ్చల్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ పరీక్షలను స్వయంగా పరిశీలించనున్నారు.

అమిత్‌షాను కేంద్ర క్యాబినెట్ నుంచి తొలగించాలి

- సీపీఐ రాష్ట్ర బహిరంగ సభలో డి.రాజా



ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ సాయంతో వీల్‌చైర్‌లో సభకు హాజరైన సురవరం సుధాకర్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి ప్రధాని నరేంద్రమోదీ తొలగించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయన వెంటనే జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన సీపీఐ శతవార్షికోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి బహిరంగ సభ జరిగింది. ఈ సభకు హాజరయిన డి.రాజా మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేడ్కర్, అందరికీ సమాన హక్కులను కల్పించారని అన్నారు. రాజ్యాంగ మూలాలను మార్చేందుకు నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయని, వారి ప్రయత్నాలను అడ్డుకునేందుకు దేశంలోని వామపక్షాలు, లౌకిక ప్రజా శక్తులు ఐక్యంగా పోరాటానికి కలిసి రావాలని రాజా పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఫాసిజం ప్రబలి ఉందని.. ఈ సమయంలో కమ్యూనిస్టులు పోరాటం చేయాల్సిన అవసరముందని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ అధికారం కోసం పాకులాడే పార్టీ కాదని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ పనైపోయిందని అంటున్నారని, ప్రశ్న ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని కూనంనేని స్పష్టం చేశారు. సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, మాజీ ఎమ్మెల్యేలు చాడ వెంకటరెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, పశ్య పద్మ, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌తో సభకు సురవరం

సీపీఐ మాజీ జాతీయ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోగ్యం సహకరించకున్నా పట్టుదలగా సభకు వచ్చారు. ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ సహాయంతో ముక్కుకు ఆక్సిజన్ పైపు తగిలించుకొని, వీల్‌చైర్‌లో సహాయకుల సహకారంతో సభకు హాజరయ్యారు. తాను మూడు రోజుల క్రితమే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యానని, నల్లగొండలో సభ అనేసరికి తాను హాజరవ్వాల్సిందేనని నిర్ణయించుకున్నానని సురవరం చెప్పారు. తనను రెండుసార్లు పార్లమెంటుకు ఎన్నుకున్న ఇక్కడి ప్రజలకు లాల్ సలాం చెప్పాలనే తాను ఈ సభకు హాజరయ్యానని సురవరం పేర్కొనడంతో సభ చప్పట్లతో మార్మోగింది.

కమీషన్లు ఇస్తేనే బిల్లుల మంజూరు

- రాష్ట్రంలో మంత్రుల మధ్య అంతర్యుద్ధం
- సీఎం రేవంత్‌కు, అల్లు అర్జున్‌కు ఎక్కడో చెడింది
- రేవంత్‌లో గొప్ప నాయకుడు ఎలా కనిపించారో.. పవన్ కల్యాణ్‌కే తెలియాలి: కేంద్ర మంత్రి సంజయ్



కరీంనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వంలో కమీషన్లు ఇస్తేనే బిల్లులు మంజూరవుతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పించాలని కోరుతూ తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం నాయకులు కరీంనగర్‌లో సోమవారం బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ బిల్లు మంజూరు చేయాలన్నా 8 నుంచి 14 శాతం కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో కొందరు నిజాయితీపరులైన మంత్రులు ఉన్నారని, కమీషన్ల విషయం వారికి ఏమాత్రం నచ్చడం లేదన్నారు. బిల్లులు, కమీషన్ల విషయంలో మంత్రుల మధ్య అంతర్యుద్ధం జరుగుతోందని దుయ్యబట్టారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టడంపై ఉన్న శ్రద్ధ.. సమస్యల పరిష్కారంపై లేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వేలమంది మాజీ సర్పంచ్‌లకు రూ.1300కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. వీరి పక్షాన బీజేపీ ఉద్యమిస్తుందని, కాంగ్రెస్ మెడలు వంచి బిల్లులు మంజూరయ్యేలా చూస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు తీరు వల్లే నేరాలు పెరిగాయని సంజయ్ విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు 28 శాతం పెరిగాయని, రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడలేని చేతగాని సర్కార్ ఉందని దుయ్యబట్టారు. "రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు.. క్రైం రేటు పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్‌రెడ్డిలో గొప్ప నాయకుడు ఎలా కన్పించారో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కే తెలియాలి. అల్లు అర్జున్‌కు రేవంత్‌కు ఎక్కడో చెడింది. అది గంటల తరబడి చర్చించాల్సిన అంశమే కాదు. సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ అరెస్టై జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. ఆ అంశంపై అసెంబ్లీలో చర్చ జరపాల్సిన అవసరం ఏముంది? అల్లు అర్జున్‌పై కేసును విరమించుకున్నట్లు మృతురాలి భర్త ప్రకటించారు. ఇంకా దీనిపై రాద్ధాంతం ఎందుకు?" అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా దారి మళ్లించేందుకు కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించింది కాంగ్రెస్సేనని, భారతరత్న ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావును ఎందుకు అవమానించారని నిలదీశారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు సోనియా గాంధీ సూపర్ పవర్‌గా వ్యవహరించడం, పీఎంను రబ్బను స్టాంప్‌గా తయారుచేయడం నిజం కాదా? అని ప్రశ్నించారు.

మంత్రిగా కొనసాగే నైతిక హక్కు షాకు లేదు

- హైదరాబాద్ నారాయణగూడలో వామపక్ష నేతల నిరసన

బర్కత్‌పుర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాకు కేంద్ర మంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదని వామపక్ష నేతలు పేర్కొన్నారు. అమిత్‌షాను కేంద్రమంత్రి వర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని, ఆయన దేశ ప్రజలకు బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని నారాయణగూడలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఐ రాష్ట్ర సభ్యులు వలిఉల్లాఖాద్రీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు జె.వి.చలపతిరావు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుడు ప్రవీణ్, ఎంసీపీఐ (యు) కార్యదర్శి జి.రవి, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యదర్శి రమేశ్ రాజా, ఎస్‌యూసీఐ (సీ) నాయకుడు తేజా మాట్లాడారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తెచ్చేందుకు మనువాదులు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసి హిందూ రాజ్యం స్థాపించాలని బీజేపీ నేతలు భావిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా పక్కదారి పట్టించడంలో భాగంగానే అమిత్‌షా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని వామపక్ష నేతలు విమర్శించారు.

రాష్ట్రంలో మళ్లీ పెరుగుతున్న చలి

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరుగుతోంది. రాబోయే ఐదు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గడిచిన వారం పది రోజులుగా తుపాన్ ప్రభావంతో రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14-22 డిగ్రీల మధ్య నమోదు అయ్యాయి. చలి తీవ్రత పెద్దగా కనిపించలేదు. ఆదివారం రాత్రి నుంచి మళ్లీ పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 11 డిగ్రీలకు పడిపోయాయి. 14 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 11-15 డిగ్రీల మధ్య నమోదు అయ్యాయి. ఆదివారం రంగారెడ్డి జిల్లా చందనవల్లిలో 11.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

కాంగ్రెస్‌లో మన్మోహన్‌కు ఎన్నో అవమానాలు

అగ్రనేతల నుంచి అడుగడుగునా పరాభవాలు.. ప్రధానిగా పదేళ్లు వాటిని భరిస్తూనే దేశానికి సేవలు

- యూపీఏలో షాడో పీఎంలుగా సోనియా, రాహుల్
- ఆర్డినెన్స్‌ను చించేసిన రాహుల్.. పీవీ భౌతికకాయాన్ని పార్టీ ఆఫీసులోకి తీసుకెళ్లకుండా బెదిరించిన సోనియా
- ఇప్పుడు మన్మోహన్ మరణంపై కాంగ్రెస్ రాజకీయాలు
- కేంద్రం సంతాప దినాలు ప్రకటిస్తే.. నూతన సంవత్సర వేడుకల కోసం రాహుల్ వియత్నాం వెళ్లడం ఏంటి?
- విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా మన్మోహన్ సింగ్ పదేళ్ల పాటు సోనియా గాంధీ కుటుంబం నుంచి అనేక అవమానాలు ఎదుర్కొని దేశానికి సేవలందించారని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి అన్నారు. మన్మోహన్ మరణంపై సోనియా కుటుంబం, కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని, ఇది వారి సంస్కారరాహిత్యానికి అద్దంపడుతుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఏడు రోజులు సంతాప దినాలు ప్రకటిస్తే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాత్రం నూతన సంవత్సర వేడుకల కోసం వియత్నాం వెళ్లారని, ఇదేనా కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. మన్మోహన్ మరణ వార్త తెలియగానే ప్రధాని మోదీ వెంటనే నిర్ణయం తీసుకుని మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఎలా అంత్యక్రియలు జరిగాయో అదే రీతిలో నిర్వహించాలని కేంద్ర హోం మంత్రిని ఆదేశించారని పేర్కొన్నారు. మన్మోహన్ స్మారక కేంద్రం నిర్మించాలని కూడా నిర్ణయించారని, దీని కోసం ట్రస్టు ఏర్పాటుకు మన్మోహన్ సతీమణితో మోదీ మాట్లాడారని తెలిపారు. బీజేపీని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు.

ప్రతి విషయాన్నీ రాజకీయం చేస్తున్నారు

మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడు సోనియా కుటుంబం ఆయనను ఎలా అవహేళన చేసి అవమానించిందో దేశ ప్రజలకు తెలుసని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోనియా, రాహుల్ షాడో ప్రధాలుగా వ్యవహరించారని విమర్శించారు. నాడు మన్మోహన్ అధ్యక్షతన క్యాబినెట్ ఆమోదించిన ఆర్డినెన్స్‌ను మీడియా సమక్షంలో రాహుల్ చించివేశారన్నారు. 2007లో మన్మోహన్ ప్రధాని హోదాలో 2జీ స్పెక్ట్రం వేలం వేయాలని టెలికాం మంత్రి ఏ రాజాకు లేఖ రాస్తే, దానికి విరుద్ధంగా సోనియా ఆదేశాలతో కుంభకోణానికి తెరలేపారని, ఈ కేసులో రాజా జైలుకు వెళ్లారన్నారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌కు ప్రపంచ దేశాల అధినేతలను ఆహ్వానిస్తే, భారత్ నుంచి ప్రధానికి కాకుండా సోనియా, రాహుల్‌కు ఆహ్వానాలు ఎలా అందాయని, వారు ప్రభుత్వ ప్రతినిధులుగా ఎలా హాజరయ్యారని ప్రశ్నించారు. ప్రధానిగా మన్మోహన్ పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన విందుకు రాహుల్ ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో ప్రతి విషయాన్నీ రాజకీయం చేయడం, చివరికి బోర్లా పడటం రాహుల్ గాంధీకి అలవాటైందన్నారు.

గొప్ప నేతలను అవమానించిన కాంగ్రెస్

నెహ్రూయేతర కుటుంబాలకు చెందినవారు ప్రధాని, రాష్ట్రపతిగా ఉంటే వారి పట్ల అవమానకరంగా వ్యవహరించడం మొదటి నుంచీ నెహ్రూ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి అలవాటు అని ఆరోపించారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీలనూ ఇలాగే అవమానించారని పేర్కొన్నారు. పీవీ మరణిస్తే ఆయన పార్థివదేహాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి తీసుకువెళ్లనివ్వకుండా సోనియా బెదిరించారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో సాధారణ నాయకులకు దక్కిన గౌరవం కూడా పీవీకి దక్కకుండా చేశారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్‌తో పాటు అనేక మంది గొప్ప నేతలను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు. మన్మోహన్ సింగ్ విషయంలో కూడా కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తూ మొసలికన్నీరు కారుస్తోందని మండిపడ్డారు.

మహిళల భద్రతను గాలికి వదిలేసిన రేవంత్

- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు
- తెలంగాణ పాలిట శనిలా కాంగ్రెస్
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం



సుభాష్‌నగర్ (నిజామాబాద్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పాలిట కాంగ్రెస్ పార్టీ శనిలా దాపురించిందని, కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. సోమవారం నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయకుండా రేవంత్ రెడ్డి రైతులను మోసగించారని, ప్రస్తుతం రైతుభరోసాకు అనేక షరతులు విధించే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ రేవంత్‌రెడ్డి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ నాయకులను గ్రామ గ్రామాన నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదన్న విషయం డీజీపీ వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళ భద్రతపై ప్రత్యేకంగా సమీక్షించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం విడుదల చేసిందన్నారు. పనులు సాగించని కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు చెల్లించారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను నరకయాతన పెట్టడానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలో రీసర్వే చేసే ముందు భూముల వివరాలు తెలియజేస్తూ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆశాలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

- మంత్రి దామోదరకు ఆశా వర్కర్స్ యూనియన్ వినతి

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆశాలకు ప్రతి నెలా రూ.18 వేల స్థిర వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు నివ్వాలని ప్రభుత్వానికి ఆశా వర్కర్స్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం అసెంబ్లీలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలోని ఆశా వర్కర్ల యూనియన్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి వినతి పత్రం అందజేశారు. పదవీ విరమణ ప్రయోజనాలు అందించాలని, అర్హులైన ఆశాలను ఎఎన్ఎమ్‌లుగా గుర్తించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఆశాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఆశా వర్కర్స్ యూనియన్ యం.డి.షైముద, ఉపాధ్యక్షులు శ్రీదేవి తదితరులున్నారు.



ఇథియోపియాలో ఘోర ప్రమాదం

» ట్రక్కు అదుపుతప్పి నదిలో పడటంతో 71 మంది మృతి

అడిస్ అబాబా, డిసెంబరు 30: ఇథియోపియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సామర్థ్యం కంటే ఎక్కువ మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ట్రక్కు అదుపు తప్పి నదిలోకి దూసుకెళ్లడంతో కనీసం 71 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బోనా జిల్లాలో జరిగింది. ఆదివారం సాయంత్రం సిదామా ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న ట్రక్కు అదుపు తప్పి రోడ్డు మీద నుంచి నదిలో పడింది. సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు చెప్పారు. మృతుల్లో 68 మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు తెలిపారు. మరణించిన వారిలో కొందరు ఓ పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం.

అనుమతి లేకుండా నా ఆడియో ఎలా రికార్డు చేస్తారు

» ఇంత దిగజారుతారనుకోలేదు: ఖుష్బూ



చెన్నై, డిసెంబరు 30: తన అనుమతి తీసుకోకుండా తాను మాట్లాడిన విషయాన్ని ఏవిధంగా రికార్డు చేస్తారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఫోన్‌లో చెప్పిన మాటలు వాస్తవమేనని, అయినప్పటికీ ఫోన్ సంభాషణను రికార్డు చేయడం సరికాదన్నారు. తమిళనాడులో జరుగుతున్న పరిణామాలపై స్పందించమని కోరుతూ ఇటీవల ఓ స్థానిక మీడియా సంస్థ ఫోన్ కాల్‌లో ఆమెను సంప్రదించింది. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాలకు దూరంగా ఉండటంపై విలేకరి ఆమెను ప్రశ్నించాడు. దీనిపై ఆమె స్పందిస్తూ... తమిళనాడు బీజేపీ తనను పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనికి సంబంధించిన ఆడియో రికార్డును సదరు మీడియా సంస్థ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. ఆమె అనుమతితోనే దీనిని విడుదల చేస్తున్నామని పేర్కొంది. దీనిపై తాజాగా ఖుష్బూ స్పందించారు. "నా అనుమతి తీసుకోకుండా ఈవిధంగా నా వాయిస్ ఎలా రికార్డు చేస్తారు? మరి ఇంత దిగజారుతారని అనుకోలేదు. కానీ, నేను నిజమే చెప్పా. బీజేపీ కార్యక్రమాల్లో మీరెందుకు కనిపించడం లేదని నన్ను ప్రశ్నించే వారందరికీ ఒక్కటే సమాధానం. ఆయా కార్యక్రమాలకు నాకు ఎలాంటి సమాచారం ఇవ్వరు. వాటికి నన్ను ఆహ్వానించరు. కానీ, నేనేమీ పార్టీ మారడం లేదు. ప్రధాని మోదీ విజన్ కోసం నిరంతరం కృషి చేస్తా" అని ఖుష్బూ పేర్కొన్నారు.

సిరియాతో ఉక్రెయిన్ వ్యూహాత్మక స్నేహం

డమాస్కస్, డిసెంబరు 30: సిరియా అధ్యక్ష పదవి నుంచి బషర్ అసద్‌ను తొలగించిన తరువాత మధ్యప్రాచ్యంలో రాజకీయ ముఖచిత్రం మారుతోంది. దేశం నుంచి పారిపోయిన అసద్‌కు రష్యా రాజకీయ ఆశ్రయం ఇవ్వడాన్ని ప్రత్యర్థి అయిన ఉక్రెయిన్ అవకాశంగా తీసుకొంది. సిరియాలో ఏర్పాటయిన కొత్త ప్రభుత్వంతో వ్యూహాత్మక స్నేహం పెంపొందింపచేసుకోవాలని నిర్ణయించింది. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహా సోమవారం సిరియా వచ్చి ప్రభుత్వ అధినేత అహ్మద్ అల్ షారా, నూతన విదేశాంగ శాఖ మంత్రి అసద్ హసన్ అల్ షిబానీలతో చర్చలు జరిపారు. మానవతా సాయం కింద ఉక్రెయిన్ సోమవారం 500 టన్నుల గోధుమ పిండిని నౌకల ద్వారా సిరియాకు పంపించింది. ఆ లోడు మంగళవారం చేరుకోనుంది. మున్ముందు ఐక్యరాజ్య సమితి ద్వారా మరింత సాయం అందించాలని నిర్ణయించింది.

ఇళ్లకు కిటికీలు వద్దు.. తాలిబన్ల ఫత్వా

కాబూల్, డిసెంబరు 30: అఫ్గానిస్థాన్‌లో మహిళలపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ తాలిబన్లు ఫత్వా జారీ చేశారు. ఇంట్లోని మహిళలను బయటవారెవరూ చూడకుండా కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. అందుకోసం ఇళ్లకు అసలు కిటికీలు పెట్టకూడదని హుకుం జారీ చేశారు. మహిళలు ఎక్కువ సేపు కాలం గడిపే వంటగదులు, బావుల వద్ద కిటికీలు ఉండకూడదని తెలిపారు. ఇప్పటికే కిటికీలు ఉంటే వాటిని మూసివేయాలని ఆదేశించారు. ఇస్లామిక్ చట్టం ప్రకారం ఇప్పటికే మహిళలపై తాలిబన్ ప్రభుత్వం పలు ఆంక్షలు పెట్టింది. ఆడపిల్లలు ప్రాథమిక విద్యను మించి చదవకూడదు. మహిళలు ఉద్యోగాలు చేయకూడదు. పార్కులకు కూడా వెళ్లకూడదు.

బంగ్లాదేశ్‌లో రాజ్యాంగం నేడు రద్దు

» విద్యార్థి ఉద్యమ నేతల ప్రకటన.. తీవ్ర వ్యతిరేకత

ఢాకా, డిసెంబరు 30: రాజకీయ అనిశ్చితితో అస్తవ్యస్తంగా మారిన బంగ్లాదేశ్‌ను మరిన్ని కష్టాలు చుట్టుముడుతున్నాయి. ప్రస్తుత రాజ్యాంగాన్ని రద్దు చేస్తూ మంగళవారం అక్కడి విద్యార్థి ఉద్యమ నాయకులు ఒక ప్రకటన చేయనున్నారు. కొత్త మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని.. ముజిబుర్ తీర్మానంగా (బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజిబుర్ రహ్మాన్) విద్యార్థి నాయకులు అభివర్ణిస్తున్నారు. బంగ్లాదేశ్‌పై భారత్ ఆధిక్యతకు అదే కారణమంటూ ద్వేషం చిమ్ముతున్నారు. విద్యార్థులు లేవనెత్తిన కొత్త డిమాండ్ బంగ్లాదేశ్‌ను కుదిపివేస్తోంది. తాత్కాలిక ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం సైతం ఈ డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్నాయి. ఒకవేళ రాజ్యాంగం రద్దయితే తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ తన అధికారం కోల్పోవాల్సిందే. అయినా.. మంగళవారం సెంట్రల్ షహీద్ మినార్ వద్ద రాజ్యాంగ రద్దు ప్రకటన చేసి తీరుతామని వివక్ష వ్యతిరేక విద్యార్థి ఉద్యమం నాయకుడు హసనత్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

పేపర్ లీకేజీపై జనవరి 2 నుంచి ఆమరణ దీక్ష

» బిహార్‌లో ఉద్యోగాలను అమ్ముకున్నారు: ప్రశాంత్ కిశోర్

పట్నా, డిసెంబరు 30: బిహార్‌లో ఉద్యోగార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ తీవ్రంగా ఖండించారు. ఉద్యోగార్థుల డిమాండ్లను రెండు రోజుల్లోగా పరిష్కరించాలని, లేకపోతే జనవరి 2నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(బీపీఎస్సీ) జారీ చేసిన నోటిఫికేషన్‌లోని ఉద్యోగాలను ఇప్పటికే అమ్ముకున్నారని ఆయన ఈ సందర్భంగా ఆరోపించారు. వేల కోట్ల రూపాయలు చేతులు మారినట్లు తన దగ్గర సమాచారం ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి బీపీఎస్సీ ఇటీవల ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించింది. అయితే, ఈ ప్రశ్నపత్రం లీక్ అయిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో, ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ ప్రిలిమ్స్ నిర్వహించాలని ఉద్యోగార్థులు రెండువారాలుగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

పంజాబ్‌లో కొనసాగుతోన్న రైతుల బంద్

చండీఘడ్, డిసెంబరు 30: పంజాబ్‌లో రైతులు చేపట్టిన బంద్ సోమవారం కొనసాగింది. చాలా ప్రాంతాల్లో రహదారులను మూసివేసి రైతులు పెద్దఎత్తున ధర్నాలకు దిగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు పోలీసులు నిరసనకారులను అడ్డుకున్నారు. పాటియాలా- చండీఘడ్ జాతీయ రహదారిపై టోల్ ప్లాజాల వద్ద రైతులు ధర్నాలకు దిగడంతో ఆ మార్గంలో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అమృత్‌సర్ గోల్డెన్ గేట్ వద్ద రైతులు పెద్ద సంఖ్యలో నిరసనలు చేపట్టారు. బంద్ ప్రభావం రైళ్ల సర్వీసులపైనా పడింది. పంజాబ్- ఢిల్లీ మధ్య 163 రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో పంజాబ్‌లోని రైల్వేస్టేషన్లలో సరైన సమాచారం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు 70 ఏళ్ల రైతు నాయకుడు దలేవాల్ చేపట్టిన నిరసన దీక్ష సోమవారం నాటికి 35వ రోజుకు చేరుకుంది.

కక్ష్యలో కలుద్దాం!

స్పేస్ డాకింగ్ మిషన్‌లో తొలి ఘట్టం విజయవంతం



స్పేడెక్స్ జంట ఉపగ్రహాలను నింగిలోకి మోసుకువెళ్తున్న పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్

» రోదసిలోకి స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు

సూళ్లూరుపేట/తిరుమల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు ఎంతో కీలకమైన 'స్పేస్ డాకింగ్' ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది. స్పేస్ డాకింగ్ కోసం భారత అంతరిక్ష పరిశోధనల కేంద్రం ఇస్రో చేపట్టిన జంట ఉపగ్రహాల ప్రయోగం (స్పేడెక్స్)లో తొలి అడుగు ఘనంగా పడింది. ఈ మిషన్‌లో భాగంగా చేజర్, టార్గెట్ అనే జంట ఉపగ్రహాలను మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్.. వాటిని జాగ్రత్తగా నిర్దేశిత కక్ష్యలోకి చేర్చింది. వాస్తవానికి ఈ ప్రయోగాన్ని సోమవారం రాత్రి 9.58 గంటలకు నిర్వహించాల్సి ఉంది. కానీ.. అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్ కారణంగా రెండు నిమిషాలు ఆలస్యంగా నిర్వహించారు. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి సోమవారం రాత్రి 10:15 గంటలకు నింగిలోకి ఎగిరిన రాకెట్.. నిర్ణీత షెడ్యూలు ప్రకారం తొలి ఉపగ్రహాన్ని 15.10 నిమిషాలకు, రెండో ఉపగ్రహాన్ని 15.13 నిమిషాలకు భూమికి 476 కిలోమీటర్ల ఎత్తున, వృత్తాకార కక్ష్యలో విజయవంతంగా విడిచిపెట్టింది. దీంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్ స్పేడెక్స్ మిషన్ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. ఇక ఈ ప్రయోగంలో అసలు సిసలైన ఘట్టం.. డాకింగ్ (రెండు ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ) మిగిలి ఉంది. చందమామపైకి మన వ్యోమగాములను పంపి, అక్కడి మట్టి ఇక్కడికి తీసుకురావాలన్నా, సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించుకోవాలన్నా.. ఇలా భవిష్యత్తులో చేపట్టబోయే పలు కీలక ప్రయోగాలకు అత్యంత కీలకమైనది డాకింగ్ పరిజ్ఞానం. ప్రస్తుతానికి అమెరికా, రష్యా చైనా అంతరిక్ష పరిశోధనల సంస్థల వద్ద మాత్రమే ఈ పరిజ్ఞానం ఉంది.

అనేక ప్రయోగాలకు నాంది..


పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ మోసుకెళ్లిన రెండు ఉపగ్రహాల్లో ఒకటి.. ఎస్‌డీఎక్స్01 (చేజర్) కాగా, మరొకటి ఎస్‌డీఎక్స్02 (టార్గెట్). ఒక్కో దాని బరువు సుమారు 220 కేజీలు. ఈ ఉపగ్రహాలతోపాటు.. పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్) ద్వారా మరో 24 పేలోడ్లను కూడా ఇస్రో రోదసిలోకి పంపింది. ఆ పేలోడ్ల ద్వారా అనేక ప్రయోగాలు చేపట్టేందుకు ఇస్రో ప్రణాళికలు రచించింది.

జనవరిలో మరిన్ని ప్రయోగాలు..

వచ్చే ఏడాది జనవరిలో షార్ నుంచి మరిన్ని ప్రయోగాలు చేపడతామని ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ వెల్లడించారు. పీఎస్ఎల్వీ రాకెట్ నావిగేషన్ రెండో సిరీస్‌లో ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని పంపనున్నామని వెల్లడించారు. జనవరి మూడో వారంలో జీఎస్ఎల్వీ-ఎఫ్15 ప్రయోగం ఉంటుందన్నారు. ఇది కాకుండా.. గగన్‌యాన్-జీ1 ద్వారా మానవరహిత ప్రయోగం ఉంటుందని చెప్పారు. 2025లో షార్ నుంచి మరిన్ని ప్రయోగాలు చేపడతామని తెలిపారు. పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోమవారం తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆయన దర్శించుకొన్నారు. పూజలు చేశారు. అంతకుముందు సోమవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో ఇస్రో అధికారులు పీఎస్ఎల్వీ-సీ60 నమూనాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారత్‌కు ప్రయోజనం ఏమిటి..?

అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపే లక్ష్యంతో భారత్ గగన్‌యాన్ ప్రాజెక్టు చేపట్టనుంది. చంద్రుడి ఉపరితలం నుంచి నమూనాలను సేకరించి వాటిని భూమి మీదకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అలాగే 2035 నాటికి సొంతంగా అతరిక్ష కేంద్రాన్ని నిర్మించే దిశగా ముందుకు సాగుతోంది. అయితే అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి అవసరమైన వాటిని ఒకేసారి రాకెట్‌లో తరలించడం కుదరదు. కాబట్టి వాటిని విడతలవారీగా కక్ష్యలోకి చేర్చి వాటిని డాకింగ్ ద్వారా అనుసంధానం చేయాల్సి ఉంటుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని (ఐఎస్ఎస్) ఇలాగే ఏర్పాటు చేశారు. స్పేస్ స్టేషన్లకు వ్యోమగాములను, వస్తువులను తీసుకెళ్లే వ్యోమనౌకలను సైతం డాకింగ్ ద్వారానే అనుసంధానం చేస్తారు. అలాగే కక్ష్యలోని ఉపగ్రహాలకు మరమ్మతులు చేపట్టాలన్నా, ఇంధనం నింపాలన్నా, వాటిని ఆధునీకరించాలన్నా.. డాకింగ్ వ్యవస్థ ఉపయోగపడుతుంది. కాబట్టి.. ఇస్రో చేపట్టబోయే గగన్‌యాన్, మూన్ మిషన్లతోపాటు స్పేస్ స్టేషన్ నిర్మాణం, నిర్వహణలో ఈ డాకింగ్ ప్రక్రియ ఎంతో కీలకం కానుంది.



ఏమిటీ స్పేస్ డాకింగ్?

ఇల్లు కట్టాలంటే ఇటుకా ఇటుకా పేర్చాల్సిందే! అదే అంతరిక్షంలో అలా ఒక నిర్మాణాన్ని చేపట్టాలంటే? వ్యోమనౌకలను ఒకదానికొకటి అనుసంధానం చేయడం ద్వారా అంతరిక్ష కేంద్రం వంటి నిర్మాణాలను రూపొందించవచ్చు. దీన్నే స్పేస్ డాకింగ్ అంటారు. గంటకు వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వ్యోమనౌకలు.. వాటి వేగాన్ని నియంత్రించుకుంటూ, సమాచారాన్ని పంచుకుంటూ, దగ్గరైన తర్వాత సున్నితంగా అనుసంధానం కావాల్సి ఉంటుంది. కాబట్టి ఇది సాంకేతికంగా సంక్లిష్టమైన ప్రక్రియ. పైగా ఉపగ్రహాల పరిమాణం చిన్నగా ఉండడం సవాలుగా మారనుంది. ఏ మాత్రం తేడా వచ్చినా ఉపగ్రహాలు పరస్పరం ఢీకొట్టుకొని విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉంది.

లక్ష్యం పూర్తికాగానే అన్‌డాకింగ్..

డాకింగ్‌కు సంబంధించిన ప్రయోగాలు పూర్తికాగానే ఈ రెండు ఉపగ్రహాలు విడిపోతాయి. దీన్నే అన్‌డాకింగ్ అంటారు. విడిపోయిన తర్వాత అవి సాధారణ ఉపగ్రహాల మాదిరిగానే పరిశోధనలు సాగిస్తాయి. ఎస్‌డీఎక్స్01లోని హై రిజల్యూషన్ కెమెరా భూ పరిశీలనలకు ఉపయోగపడుతుంది. ఎస్‌డీఎక్స్02లోని మినయేచర్ మల్టీ స్పెక్ట్రల్ పరికరం సహజ వనరుల పర్యవేక్షణ, పచ్చదనంపై అధ్యయనం చేస్తుంది. రేడియేషన్ మానిటర్ పేలోడ్ అంతరిక్షంలో ఎదురయ్యే రేడియో ధార్మికతను కొలుస్తుంది. కాగా, ఈ ఉపగ్రహాల జీవితకాలం రెండేళ్లు. కాబట్టి.. భవిష్యత్తులో ఈ రెండు ఉపగ్రహాలను మరోసారి అనుసంధానించడానికి ఇస్రో ప్రయత్నించే అవకాశం కూడా ఉంది.

మస్క్ ఉపగ్రహాల వల్ల ఆలస్యం

ఇస్రో ఈ ప్రయోగాన్ని సోమవారం రాత్రి 9:58 గంటలకు చేపట్టాలని నిర్ణయించింది. కానీ.. స్పేస్ ఎక్స్ చీఫ్ ఈలన్ మస్క్‌కు చెందిన 'స్టార్ లింక్' ఉపగ్రహాలు కొన్ని అదే సమయానికి ఆ దారిలో వస్తాయని గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని 2.15 నిమిషాలపాటు వాయిదా వేశారు. "అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాకెట్ వెళ్లాల్సిన కక్ష్యలో ఆ సమయానికి ఇతర ఉపగ్రహాల గమనం కారణంగా ప్రయోగాన్ని వాయిదా వేశాం. ప్రయోగాన్ని రాత్రి 9.58 గంటలకు బదులుగా 10 గంటలా 15 సెకన్లకు రీ షెడ్యూల్ చేశాం' అని ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. ఆలస్యమైనా ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టగలిగారు. కాగా.. అంతరిక్షంలో ట్రాఫిక్ కారణంగా రాకెట్ ప్రయోగాన్ని వాయిదా వేయడం ఇదే తొలి సారి కాదు. 2023లో చంద్రయాన్-3 ప్రయోగాన్ని కూడా ఇలాగే కొన్ని నిమిషాలు వాయిదా వేశారు.

లోకం తీరు



హెజ్‌బొల్లాను ముంచిన కమాండర్ పెళ్లిళ్ల లొల్లి!

బీరుట్, డిసెంబరు 30: హెజ్‌బొల్లా సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఫాద్ షుక్ర్.. పెళ్లిళ్ల గోల చివరకు ఆ సంస్థ పతనానికే దారి తీసింది. ఏళ్లుగా అండర్‌గ్రౌండ్‌లోనే తలదాచుకున్న అతడు.. చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా నలుగురు మహిళలను పెళ్లి చేసుకోవాలని తలంచి ఆ ప్రయత్నంలోనే ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ చేతిలో హతమయ్యాడు. ఇది జరిగిన కొద్ది వారాల వ్యవధిలోనే హెజ్‌బొల్లా కీలక నేతలను ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. 1983లో లెబనాన్‌లోని బీరుట్‌లో అమెరికన్ మెరైన్ బ్యారక్‌లపై దాడులు చేసి 238 అమెరికన్ సైనికులను చంపిన ఘటన వెనకాల వ్యూహకర్తల్లో షుక్ర్ ఒకడు.. 1985లో టీడబ్ల్యూఏ ఫ్లైట్ హైజాక్‌లోనూ అతడిది కీలక పాత్ర.. ఆ తర్వాత రెండు దశాబ్దాల పాటు ఎవరికీ కనిపించకుండా అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలోనే నలుగురు మహిళలతో ఏకకాలంలో వివాహేతర సంబంధాలు పెట్టుకున్నాడు. 2024 వరకు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే తాను చేసింది తప్పన్న భావన అతడిని వెంటాడింది. దీంతో హెజ్‌బొల్లాలో అత్యున్నత మత గురువైన హాషీమ్ సఫీద్దీన్ సంప్రదించి జరిగిందంతా చెప్పుకొన్నాడు. ఆ నలుగురిని పెళ్లి చేసుకుంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చని.. ఈ తతాంగమంతా ఫోన్‌లోనే జరిగిపోవాలని సఫీద్దీన్ సలహా ఇచ్చాడు. ఆ నలుగురు మహిళలు ఎక్కడెక్కడో ఉన్నా గానీ ఫోన్ కాల్స్‌లోనే పెళ్లిళ్లు జరిపించాడు. మరోవైపు.. 2006 నుంచే షుక్ర్ కోసం వెతుకుతున్న మొస్సాద్‌కు ఈ విషయం తెలిసింది. ఈ క్రమంలోనే బీరుట్‌లోని ఓ పాత భవనంలో అతడు ఉన్నట్లు గుర్తించింది. జూలై 30వ తేదీన పక్కా ప్లాన్‌తో ఓ వ్యక్తి నుంచి అతడికి ఫోన్ చేయించి భవనం పై అంతస్తుకు రప్పించి.. క్షిపణితో దాడి చేసింది. ఈ దాడిలో షుక్ర్‌తో పాటు అతడి భార్య, ఇద్దరు చిన్నారులు మరణించారు. ఇది జరిగిన కొన్ని గంటల్లోనే హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా బాంబు దాడిలో చనిపోయాడు.

హైకోర్టు జడ్జీలుగా కుటుంబ సభ్యులు వద్దు

» సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 30: హైకోర్టు న్యాయమూర్తుల నియామకం విషయమై సుప్రీంకోర్టు కొలీజియం కీలక నిర్ణయాలు తీసుకొంది. ప్రస్తుత/పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు/హైకోర్టు న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లను సిఫార్సు చేయకుండా నిలుపుదల చేయాలని నిర్ణయించింది. కేవలం హైకోర్టు కొలీజియంలు చేసిన సిఫార్సులపైనే ఆధారపడకుండా అభ్యర్థులకు సంబంధించి సొంతంగా వివరాలు సేకరించనుంది. హైకోర్టు న్యాయమూర్తులుగా జడ్జీల బంధువులనే నియమిస్తున్నారంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో కొలీజియం ఈ నిర్ణయం తీసుకొంది. హైకోర్టు న్యాయమూర్తుల్లో 50% మంది ప్రస్తుత/మాజీ జడ్జీలకు బంధువులేనన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బంధువుల పేర్లను సిఫార్సు చేయకుండా విరామం ఇవ్వాలని కొలీజియం ప్రతిపాదించింది. న్యాయవాదవృత్తిలో చేరిన తొలితరం లాయర్లకు ప్రాతినిధ్యం ఇవ్వాలని నిర్ణయించింది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ద్వంద్వ ప్రయోజనాలు పొందలేరు

» ప్రమోషన్ల విధానంపై సుప్రీం స్పష్టత

న్యూఢిల్లీ, డిసెంబరు 30: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల విషయమై సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ప్రమోషన్లు, అధిక జీత భత్యాల కోసం అమలయిన రెండు పథకాల కింద ఉద్యోగులు ప్రయోజనం పొందలేరని తేల్చి చెప్పింది. ఒక వేళ అలా లబ్ధి పొందిన ఉద్యోగులు ఉంటే వారి నుంచి అదనంగా పొందిన సొమ్మును తిరిగి వసూలు చేయాలని ఆదేశించింది. పదోన్నతులు కల్పించేందుకు 1999 ఆగస్టు 9 నుంచి 2008 ఆగస్టు 8 వరకు అస్యూర్డ్ కెరీర్ ప్రోగ్రెసెన్ స్కీం (ఏసీపీఎస్) అమలయింది. 2008లో మోడిఫైడ్ అస్యూర్డ్ కెరీర్ ప్రోగ్రెసెన్ స్కీం (ఎంఏసీపీఎస్) అమల్లోకి తెచ్చారు. ఎంఏసీపీఎస్ పాతతేదీ(2006) నుంచి వర్తింపజేయడంతో కొందరు రెండు విధానాల కింద లబ్ధి పొందారు.

ఢిల్లీలో ఆప్‌కు అస్తిత్వ పరీక్ష!

కాంగ్రెస్ ఎంట్రీతో కేజ్రీవాల్‌కు పెరిగిన కష్టాలు.. ఆప్ ఓట్లను భారీగా చీల్చనున్న హస్తం పార్టీ!

న్యూఢిల్లీ, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ, ఒడిషాలో బీజేడీ తర్వాత ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అస్తిత్వ పరీక్ష ఎదుర్కొంటున్నట్లు స్పష్టంగా కనపడుతోంది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి, బీజేపీకి మధ్య ప్రధాన పోటీ జరుగుతుందన్న ప్రచారానికి భిన్నంగా ఈ సారి ముక్కోణపు పోటీ ఏర్పడే అవకాశాలుండడంతో మరో ప్రాంతీయ పార్టీ అధికారంతో పాటు మనుగడను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఎన్నికను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఒంటరిగా రంగంలోకి దిగడంతో అధికార ఆప్‌కు నష్టం జరుగుతుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

మద్యం కుంభకోణంతో దెబ్బతిన్న ప్రతిష్ఠ

గత ఎన్నికల వరకూ కేజ్రీవాల్‌కు సామాన్యులు, పేదలతో పాటు మహిళలు, మధ్యతరగతి వర్గాలు బలంగా మద్దతునీయడంతో ఆమ్ ఆద్మీ పార్టీకి తిరుగు లేకుండా పోయింది. కాని గత కొద్ది సంవత్సరాలుగా మధ్యతరగతి వర్గాలు, మహిళలు భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా మారుతున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి ఢిల్లీలో అత్యంత సానుకూల స్పందన కనిపించింది. అదే సమయంలో కేజ్రీవాల్, ఆయన మంత్రులపై వచ్చిన అవినీతి ఆరోపణలు, ముఖ్యంగా ఢిల్లీ మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్‌తో సహా ఆయన మంత్రులు జైలు పాలు కావడం ఆప్ ప్రతిష్ఠను దెబ్బతీసింది. కేజ్రీవాల్ వంద కోట్లతో కట్టుకున్న ఇల్లుపై కూడా బీజేపీ ప్రచారం చేసిన తీరు నష్టం చేకూర్చింది.

దిద్దుబాటు దిశగా..

ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్వేతపత్రం విడుదల చేసి తానే ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయమంటూ ఉధృతంగా ప్రచారం ప్రారంభించడం మారిన ఆపార్టీ వ్యూహరచనకు సంకేతమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో ఆప్‌తో పొత్తులు పెట్టుకోవడం వల్ల కేజ్రీవాల్ బలోపేతమయ్యేందుకు తామే వీలు కల్పించామని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. మళ్లీ కాంగ్రెస్‌కు పూర్వవైభవం దక్కాలంటే బలమైన నేతలతో పోరాడాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఒప్పించడంలో ఆ పార్టీ నేత అజయ్ మాకెన్ విజయవంతం అయ్యారు. మొత్తం 70 స్థానాలకు పోటీ చేయాలని నిర్ణయించిన కాంగ్రెస్ 47 మందితో జాబితాను ప్రకటించింది.

ముస్లిం ఓట్లు దూరమయ్యే అవకాశం

కాంగ్రెస్ మూలంగా దళిత, ముస్లిం ఓట్లు దూరమవుతాయని ఆప్ వర్గాలు భావిస్తున్నాయి. ఢిల్లీలో 17% ఎస్‌సి ఓట్లు ఉండగా, 12% ముస్లిం ఓట్లు ఉన్నాయి. ముస్లింల ప్రాబల్యం ఉన్న స్థానాల్లోనే కాక 12 ఎస్‌సి రిజర్వుడు స్థానాల్లో ఆప్‌ను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. ఢిల్లీలో 2020లో జరిగిన అల్లర్ల తర్వాత ఆప్ మైనారిటీల విశ్వాసాన్ని కోల్పోయిందని అంచనా.

అర్చకులకు 18వేల గౌరవ వేతనం

తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఆలయాలు, గురుద్వారాల్లో పనిచేసే పూజారులు, గ్రంథీలకు నెలకు 18 వేల గౌరవవేతనం ఇస్తామని ఆప్ అధినేత కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఇందుకు 'పూజారీ గ్రంథీ సమ్మాన్ యోజన' అనే పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు సోమవారం ప్రకటించారు.

విరాళాలు కోరుతూ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిసోడియా



ఎన్నికల్లో పోటీకి ఆర్థిక సాయం చేయరూ...

» ప్రజలకు సిసోడియా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 30: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆప్ సీనియర్ నేత సిసోడియా ప్రజలకు వినూత్న విజ్ఞప్తి చేశారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు ఆర్థిక సహాయం చేయాలని ఆయన కోరారు. ఆర్థిక సహాయం అందించేందుకుగాను ఒక ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం పట్పర్‌గంజ్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సిసోడియా.. ఈసారి జంగ్‌పుర నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎన్నికల కోసం ప్రజల నుంచి ఆర్థిక సహాయం కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది. మీడియా సమావేశంలో సిసోడియా మాట్లాడుతూ.. "మీరు విరాళంగా ఇచ్చే ప్రతి రూపాయి ఢిల్లీలో విద్య తదితరాల పురోగతికి దోహదపడుతుంది" అని పేర్కొన్నారు. కాగా, సిసోడియాకు విరాళాలు కోరుతూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు.

అమెరికా మాజీ అధ్యక్షుడు కార్టర్ మృతి

100 ఏళ్ల వయస్సులో తుది శ్వాస



వాషింగ్టన్, న్యూఢిల్లీ, డిసెంబరు 30: అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్(100) అమెరికాలో జార్జియా రాష్ట్రంలోని ఆయన స్వస్థలం ప్లెయిన్స్ పట్టణంలో ఆదివారం తుది శ్వాస విడిచారు. అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన వారిలో నిండు నూరేళ్లు పూర్తి చేసుకొన్నది ఆయనే. 1977-81 మధ్య అమెరికా అధ్యక్షుడిగా పనిచేసిన కార్టర్ ఆ సమయంలో భారత పర్యటనకు వచ్చారు. అప్పుడు హరియాణా రాష్ట్రంలో ఆయన సందర్శించిన గ్రామానికి ఆయన పేరు(కార్టర్ పురి) పెట్టడం విశేషం. ఆయన మృతితో ప్రపంచం, అమెరికా ఒక అసాధారణ నాయకుడిని, రాజనీతిజ్ఞుడిని కోల్పోయాయని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. ప్రధాని మోదీ కార్టర్ మృతికి సంతాపం తెలియజేస్తూ.. ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడని, ప్రపంచ శాంతికి విరామం లేకుండా కృషి చేశారని పేర్కొన్నారు. కార్టర్‌ను భారత స్నేహితుడిగా పరిగణిస్తారు. అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) ఎత్తివేశాక మన దేశానికి వచ్చిన తొలి అమెరికన్ అధ్యక్షుడు ఆయనే. అప్పుడు జనతా పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి కేంద్రంలో అధికారంలో ఉంది. తన పర్యటనలో కార్టర్ మన పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తూ... నిరంకుశ పాలన భారత్‌కు సరిపడదన్నారు. భారత్, అమెరికాల మధ్య స్నేహ సంబంధాలు బలపడడానికి కార్టర్ హయాంలో కృషి జరిగింది. ఒక రైతు, నర్సుల సంతానం అయిన కార్టర్ 1943లో అమెరికా నౌకాదళ కేడెట్‌గా తన కెరీర్ ప్రారంభించారు. 1962లో సెనెటర్‌గా, 1970లో జార్జియా గవర్నర్‌గా ఎన్నికయ్యారు. 1979లో ఇజ్రాయెల్, ఈజిప్టుల మధ్య చరిత్రాత్మక క్యాంప్ డేవిడ్ శాంతి ఒప్పందం కుదర్చడంలో కీలక పాత్ర పోషించారు. అమెరికా విదేశాంగ విధానంలో మానవ హక్కులకు అగ్ర తాంబూలం ఇచ్చారు. 1980లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రొనాల్డ్ రీగన్ చేతిలో ఓటమి పాలయ్యారు. అధ్యక్ష భవనాన్ని వీడాక ప్రపంచ శాంతి, పర్యావరణం, మానవ హక్కుల కోసం అవిశ్రాంతంగా పనిచేశారు. దీంతో ఆయనకు నోబెల్ శాంతి బహుమతిని ఇచ్చి గౌరవించారు. జనవరి 9న వాషింగ్టన్‌లో అధికారిక లాంఛనాలతో కార్టర్ అంత్యక్రియలు నిర్వహించేందుకు నిర్ణయించారు.

సుచిర్ మరణం.. ఆత్మహత్యలా లేదు: మస్క్

వాషింగ్టన్, డిసెంబరు 30: కృత్రిమ మేధ (ఏఐ) సంస్థ 'ఓపెన్‌ఏఐ' మాజీ ఉద్యోగి, భారతీయ అమెరికన్ సుచిర్ బాలాజీ(26)ది ఆత్మహత్యగా కనిపించడం లేదని లేదని 'టెస్లా' అధినేత ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. ఆయన మరణం వెనుక ఏదో రహస్యం దాగి ఉందని, ఎఫ్‌బీఐతో దర్యాప్తు చేయించాలని ఆయన తల్లి పూర్ణిమా రామారావు చేస్తున్న డిమాండ్‌ను తాజాగా 'ఎక్స్'లో సమర్థించారు. 'ఓపెన్‌ఏఐ'.. చాట్‌జీపీటీకి చెందిన మాతృసంస్థ. దీని వ్యవస్థాపకుల్లో మస్క్ కూడా ఒకరు. కాలక్రమంలో ఆ కంపెనీతో ఆయన తెగతెంపులు చేసుకున్నారు. సుచిర్ శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్లో గత నెల 26న చనిపోయి కనిపించారు. మరణానికి ముందు.. ఓపెన్‌ఏఐ కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నారని వైద్యాధికారి తేల్చినట్లు శాన్‌ఫ్రాన్సిస్కో పోలీసులు వెల్లడించారు. అయితే పూర్ణిమ.. ప్రైవేటు దర్యాప్తు సంస్థను నియమించుకుని.. కుమారుడి భౌతిక కాయానికి రెండోసారి పోస్టుమార్టం చేయించారు. అందులో సుచిర్‌ది 'ఆత్మహత్య' కాదని తేలిందన్నారు.

కేంద్రం చేతికే!

(మొదటిపేజీ తరువాయి)


భూముల ధరలు, నిర్మాణ వ్యయం అధికమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దక్షిణభాగం రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేసి, భూసేకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వండి. దక్షిణభాగం భూసేకరణకు అయ్యే వ్యయంలో రాష్ట్ర వాటా కింద 50 శాతం వాటాను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రెండు భాగాలనూ ఒకేసారి నిర్మించేందుకు ఏమైనా ఆర్థిక ఇబ్బందులుంటే.. ఉత్తర భాగం నిర్మాణం పూర్తయిన తరువాత రెండో విడత కిందైనా దక్షిణభాగం రహదారి పనులను ప్రారంభించండి" అని ఆ లేఖలో పేర్కొంది. ఉత్తర భాగం నిర్మాణానికి అవసరమైన భూసేకరణ 90-95% పూర్తయిందని, పరిహారం చెల్లించేందుకు ఆర్థిక అనుమతులు ఇవ్వాలని కూడా విజ్ఞప్తి చేసింది.

కేంద్రం పరిధిలోనే..

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రీజినల్ రింగు రోడ్డును 2016లో మంజూరు చేసింది. అనంతరం 2017లో దానిని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించింది. ఉత్తర భాగం నర్సాపూర్ నుంచి తూప్రాన్-గజ్వేల్- జగదేవ్‌పూర్- భువనగిరి-చౌటుప్పల్ వరకూ 161.2 కిలోమీటర్లు ఉండగా, దక్షిణ భాగం చౌటుప్పల్ వద్ద ప్రారంభమై ఆమనగల్- షాద్‌నగర్ మీదుగా సంగారెడ్డి వరకు 189 కిలోమీటర్ల మేర ఉంటుందని తెలిపింది. వీటిలో మొదటగా ఉత్తరభాగం నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. భూ సేకరణ, అటవీ అనుమతులు, సహా వివిధ అంశాలతో దాదాపు ఆరేళ్లుగా రహదారి పనుల్లో జాప్యం జరగ్గా.. తాజాగా డిసెంబరు 27న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) రహదారి నిర్మాణం కోసం టెండర్లను ఆహ్వానించడంతో కీలక అడుగుపడింది. ఇదిలా ఉండగా.. ఇక దక్షిణ భాగం రహదారికి సంబంధించిన పనులను కేంద్రం వెంటనే చేపట్టలేదు. భారత్‌మాల పరియోజన-1, 2 ప్రాజెక్టుల్లో ఈ రహదారిని ప్రతిపాదించినా అది ముందుకు కదల్లేదు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ కింద రిజర్వ్ చేసి ఉంచారు. ఇదిలా ఉండగా.. కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన విజన్-2047లో ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని చేర్చింది. దానికి 2031లో అవార్డు పాస్ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'.. నవంబర్ 4న 'హై రయ్.. రయ్' శీర్షికన ప్రచురించిన కథనం ద్వారా ముందే తెలిపింది. అయితే.. ఉత్తర భాగం పూర్తయి, దక్షిణ భాగం పనులు మొదలు కాకపోతే భూముల ధరల నుంచి, రహదారి నిర్మాణ వ్యయం వరకూ అన్నీ పెరిగిపోతాయని గతంలోనే భావించిన రేవంత్ సర్కారు ఈ పనులు రాష్ట్రపరిధిలోనే చేపట్టాలని నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా వెంటనే రహదారి నిర్మాణం, అలైన్‌మెంట్, ఏ పద్ధతిలో రోడ్డును నిర్మించాలనే అంశాలపై ఐఏఎస్‌ల కమిటీని నియమించింది. ఫ్యూచర్ సిటీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు, బెంగళూరు హైవేలన్నీ అధిక భాగం ఈ మార్గంలోనే ఉండడంతో అలైన్‌మెంట్ ఖరారుపై చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని కమిటీకి సూచించింది. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక' (డీపీఆర్) తయారీ కోసం టెండర్లను ఆహ్వానించింది. డీపీఆర్ తయారీ కోసం ప్రభుత్వం నవంబర్ 25న టెండర్లను ఆహ్వానించగా.. తుదిగడువు డిసెంబర్ 27 నాటికి ఒక్క టెండరూ దాఖలు కాలేదు. దాంతో రీకాల్ పేరుతో మళ్లీ జనవరి 20 వరకూ టెండర్లకు అవకాశం ఇచ్చారు. ఇలా ఈ రహదారి నిర్మాణం కోసం ఇంతస్థాయిలో కృషి చేసిన తెలంగాణ ప్రభుత్వం.. ఉన్నట్టుండి కేంద్రానికి లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. అయితే.. ఈ రహదారిని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రసర్కారు కోరిన విధంగానే ఉత్తర భాగంతో సమాంతరంగా నిర్మిస్తుందా? లేక విజన్-2047లో భాగంగా పనులు చేపడుతుందా అన్నది తేలాల్సి ఉంది.

మారిన అలైన్‌మెంట్..

రాష్ట్రానికి ఆర్‌ఆర్‌ఆర్‌ను మంజూరు చేసినప్పుడు కేంద్రం ప్రాథమికంగా నిర్ణయించిన రూట్ మ్యాప్ ప్రకారం దక్షిణభాగం చౌటుప్పల్ దగ్గర ప్రారంభమై ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డిలోని ఉత్తర భాగం రహదారికి అనుసంధానమవుతుంది. ఇది మొత్తం 189.2 కిలోమీటర్ల పరిధిలో ఉండగా.. దీని నిర్మాణానికి దాదాపు 2 వేల హెక్టార్ల భూమి అవసరమవనుంది. భూ పరిహారం కింద రూ.6,500 కోట్ల దాకా.. రోడ్డు నిర్మాణానికి రూ.16 వేల కోట్లకు పైగా నిధులు అవసరం అవుతాయని అధికారుల ప్రాథమిక అంచనాల్లో తేలినట్లు సమాచారం. ప్రాథమిక అంచనాలతో రూపొందించిన నమూనాలో.. ఉమ్మడి నల్గొండ జిల్లా చౌటుప్పల్ మండలంలోని తంగెడ పల్లి, చింతలగూడెం, కోతులాపురం, గుడ్డి మల్కాపురం గ్రామాలుండగా, సంస్థాన్ నారాయణపురం మండలంలో సంస్థాన్ నారాయణపురం గ్రామం, కొత్తగూడెం, జనగాం, వావిళ్లపల్లి గ్రామాలున్నాయి. మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం, అంతంపేట, మాల్ గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం కానుంది. రంగారెడ్డి జిల్లాలోని ఆమన్‌గల్, షాద్‌నగర్, చేవెళ్ల మండలాల్లోని పలు గ్రామాల్లో రహదారి వెళ్లనుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలో.. సంగారెడ్డి మండలంలోని నాగాపూర్, ఇరిగిపల్లి, చింతల్‌పల్లి, కలబ్‌గూర్, తాళ్లపల్లి గ్రామాలుండగా, సదాశివపేట మండలంలో పెద్దాపూర్ గ్రామంలోనూ భూములు అవసరం కానున్నాయి. కొండాపూర్ మండలంలోని మల్కాపూర్, గిర్మాపూర్ గ్రాహాలు, హత్నూర్ మండలంలోని కాసాల, దేవులపల్లి, హత్నూర, దౌల్తాబాద్, సికింద్లాపూర్ గ్రామాలు కూడా ఉన్నాయి. చౌటకూర్ మండలంలో శివ్వంపేట, వెండి కోల్, వెంకటకిష్టాపూర్, లింగంపల్లి, కోర్పోల్ గ్రామాలు, నర్సాపూర్ మండలంలో నాగులపల్లి, మూసాపేట, మహ్మదాబాద్, రెడ్డి పల్లి, కాజీపేట, తి రుమలాపూర్, గొల్లపల్లి, అచ్చంపేట, చిన్నచింతకుంట, పెద్దచింతకుంట, సీతారాంపూర్, రుస్తుంపేట, మంతూర్, మల్‌పర్తి, తుజాల్‌పూర్ గ్రామా లున్నాయి. శివ్వంపేట మండలంలో లింగోజీగూడ, పాంబండ, పోతులబొగుడ, కంసాన్‌పల్లి, గుండ్లపల్లి, ఉసిరికపల్లి, రత్నాపూర్, కొత్తపేట గ్రామాలుండగా, కౌడిపల్లి మండలంలోని వెంకటాపూర్ గ్రామం సహా తూప్రాన్ మండలంలోని వెల్దూర్, జెండాపల్లి, నాగులపల్లి, ఇస్లాంపూర్, దాతార్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, వెంకటాయపల్లి, కిష్టాపూర్, నర్సంపల్లి గ్రామాల మీదుగా సంగారెడ్డిలోని ఉత్తర భాగానికి అనుసంధానం కానుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వమే ఈ భాగాన్ని నిర్మించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ అలైన్‌మెంట్‌లో పలు మార్పులు చేసినట్టు తెలిసింది. దాని ప్రకారం ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధి ముగిసిన తరువాత రంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశమయ్యే దగ్గరి నుంచి సంగారెడ్డి వరకు ఉన్న రహదారిలో కొన్నిచోట్ల పలు కీలక మార్పులు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పుడు ఈ భాగం కేంద్రం పరిధిలోకి వెళ్లనుండడంతో అలైన్‌మెంట్‌పై కేంద్రమే నిర్ణయం తీసుకోనుంది.



చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు నిర్మించే ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణభాగం మ్యాప్ (ఈ మ్యాప్‌లో ఎర్ర గీత గతంలో కేంద్రం ఖరారు చేసిన అలైన్‌మెంట్, గులాబీ రంగు గీత ఇటీవల రాష్ట్ర సర్కారు ప్రతిపాదించినట్టుగా ప్రచారంలో ఉన్న కొత్త అలైన్‌మెంట్)

పాశ్చాత్యరీతిలో..

రోడ్డుకు ఇరువైపులా పాశ్చాత్య దేశాల తరహాలో రెస్టారెంట్లు, బాంక్వెట్ హాళ్లు, స్టార్ హోటళ్లు.. ఇలా వాణిజ్య కార్యకలాపాలకు అనుకూలంగా ఉండేలా ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని నిర్మించాలని కేంద్రం ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే.. దారికి ఇరువైపులా సేకరించిన భూముల్లో రైతులకు కొంత వాటా ఇవ్వాలని కూడా కేంద్రం భావించినట్టు సమాచారం. కాగా.. జాతీయ రహదారుల నిబంధనల్లో మార్పుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు భూసేకరణకు ముందుగానే పరిహారానికి సంబంధించిన నిధులను కేంద్రానికి డిపాజిట్ చేయాల్సి ఉంది.

అదనపు భూములు..

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం రహదారి కోసం సేకరించే భూములు కాకుండా.. దానికి అదనంగా రహదారికి ఇరువైపులా మరికొన్ని భూములను సమీకరించాలనే భావనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు, బెంగళూరు ప్రధాన నగరాలకు వెళ్లేందుకు ఈ మార్గం అనుకూలంగా ఉండడంతో రోడ్డుకు ఇరువైపులా పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్ పార్కులు, శాటిలైట్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర సర్కారు ఆలోచిస్తోంది. భూములను సమీకరించి.. పెద్ద పెద్ద కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టించేందుకు అవకాశం ఉంటుందని కూడా భావిస్తోంది. అంతేకాకుండా సమీకరించిన భూములను లే అవుట్‌లుగా మార్చి, ఎకరాల వారీగా వెంచర్ వేయనున్నారు. అలా వేసిన వెంచర్లలో భూమి యజమానికి కొంత వాటా ఇచ్చి, ప్రభుత్వం కొంత వాటా తీసుకునేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది. ఇదే విషయాన్ని కేంద్రానికి కూడా తెలపనున్నట్టు సమాచారం.

రేవంత్ ఆస్తి రూ.30 కోట్లు!

- సంపన్న సీఎంలలో ఏడో స్థానం..
- రూ.931 కోట్లతో అగ్రస్థానంలో బాబు
- నిరుపేద ముఖ్యమంత్రి మమత
- కేసుల్లో తొలి మూడు స్థానాల్లో రేవంత్, స్టాలిన్, చంద్రబాబు
- ఏడీఆర్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 30: దేశంలో సంపన్న ముఖ్యమంత్రుల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఏడో స్థానంలో నిలిచారు. ఆయనకు రూ.30.04 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఈ జాబితాలో ఏపీ సీఎం చంద్రబాబు రూ.931 కోట్ల (కుటుంబ ఆస్తి)తో అగ్రస్థానంలో నిలిచినట్లు అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సోమవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. బాబుకు రూ.10 కోట్ల అప్పు ఉన్నట్లు తెలిపింది. ఇక, దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యంత పేద సీఎంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిలిచారు. ఆమె వద్ద కేవలం రూ.15 లక్షల ఆస్తే ఉందని ఏడీఆర్ పేర్కొంది. రూ.332 కోట్ల సంపదతో అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పెమాఖండు ధనిక ముఖ్యమంత్రిగా రెండోస్థానంలో ఉన్నారు. అయితే, ఈయనకు రూ.180 కోట్ల మేరకు అప్పులు ఉన్నాయి. రూ.51 కోట్ల ఆస్తులతో కర్ణాటక సీఎం సిద్దరామయ్య మూడోస్థానంలో నిలిచారు. ఈయన రూ.23 కోట్ల అప్పులు చేశారు. కేసుల్లో రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో ఉన్నారు. ఆయనపై 72 ఐపీసీ కేసులు, 89 సాధారణ కేసులు ఉన్నాయి. తర్వాతి స్థానాలో తమిళనాడు సీఎం స్టాలిన్, ఏపీ సీఎం చంద్రబాబు ఉన్నారు. ఇక కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల సగటు సంపద రూ.52.59 కోట్లుగా ఉందని నివేదిక వివరించింది. అంతేకాదు, ముఖ్యమంత్రుల సగటు వ్యక్తిగత ఆదాయం రూ.13,64,310గా ఉందని పేర్కొంది. ఇది.. 2023-24 లెక్కల ప్రకారం తలసరి నికర జాతీయ ఆదాయం(ఎన్ఎన్ఐ) రూ.1,85,854 కంటే 7.3 రెట్లు ఎక్కువగా ఉందని వివరించింది.

ఆ ఇళ్లకు మోక్షం!

(మొదటిపేజీ తరువాయి)

తాగునీరు, విద్యుత్ లైన్లు, పారిశుధ్య సౌకర్యాలను కూడా ఇళ్ల నిర్మాణాలతో పాటు పూర్తిచేయనున్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ 10 రోజులకోసారి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఇళ్లన్నీ టీసీ వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలని గృహ నిర్మాణ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. కాగా ప్రస్తుతం జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులతో పాటు ఆ ప్రాంతంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియపై గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఇళ్లను కేటాయించేందుకు లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారని గృహ నిర్మాణ సంస్థ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ మోడల్ కాలనీ నిర్మాణం త్వరితంగా పూర్తిచేసి పేదల ఇందిరమ్మ ఇంటి కల నెరవేర్చుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు.

ఐఏఆర్ఐ డైరక్టర్‌గా శ్రీనివాసరావు నియామకం సరైందే!

- ఐసీఏఆర్‌పై ఆరోపణలు నిరాధారం
- వ్యవసాయ పరిశోధన మండలి స్పష్టీకరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): భారత వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐఏఆర్ఐ) డైరక్టర్‌గా డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు నియామకంపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) స్పష్టం చేసింది. గతంలో ఐఏఆర్ఐ డైరక్టర్ పదవి భర్తీ విషయంలో అనుసరించిన నిబంధనల ప్రకారమే శ్రీనివాసరావు నియమాకం జరిగిందని, నిబంధనలను సవరించలేదని తెలిపింది. ఈ మేరకు సోమవారం ఐసీఏఆర్ ఒక ప్రకటన జారీ చేసింది. అధికారిక విధుల్లో భాగంగా వివిధ ప్రాంతాలలో పర్యటిస్తున్న సమయంలో సదరు అధికారిని రిలీవ్ చేయడానికి నిబంధనలు అనుమతిస్తున్నాయని తెలిపింది. శ్రీనివాసరావు జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ అకాడమీ(నార్మ్) డైరెక్టర్ పదవి నుంచి అధికారికంగా రిలీవ్ అయిన తర్వాతే ఐఏఆర్ఐ డైరక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారని పేర్కొంది. ఐసీఏఆర్ సభ్యుడు ఒకరు చేసిన ఆరోపణలలో ఏ మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేసింది. కాగా, నార్మ్ డైరక్టర్ పదవి నుంచి శ్రీనివాసరావును ఐఏఆర్ఐ డైరక్టర్‌గా ఆకస్మికంగా బదిలీ చేయడాన్ని తప్పుపడుతూ పాలక మండలి సభ్యుడు ఒకరు ప్రధాని నరేంద్ర మోదీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును అనుసరించి కొన్ని మీడియా సంస్థలు ఐసీఏఆర్‌పై ఆరోపణలు గుప్పించాయి. ఈ ఆరోపణలను తిప్పికొట్టిన ఐసీఏఆర్.. అవగాహన లేని వారే తమపై నిందలు మోపుతున్నారని ఆక్షేపించింది. కాగా, చెరుకుమల్లి శ్రీనివాసరావు స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట సమీపంలోని అనిగండ్లపాడు. బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చరల్ బీఎస్సీ, ఎమ్మెస్సీ చదివారు. గత గురువారం ఆయన ఐఏఆర్ఐ డైరక్టర్‌గా నియమితులయ్యారు. ఐఏఆర్ఏ డైరెక్టర్ పదవిని చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి శ్రీనివాసరావు కావడం విశేషం.

సెర్ప్ ద్వారా ఎస్‌హెచ్‌జీలకు చేపల విక్రయ వాహనాలు

- మొదటి విడతగా జిల్లాకు ఒకటి
- 3న మంత్రి సీతక్క చేతుల మీదుగా 32 వాహనాల ప్రారంభం

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆర్థిక పురోభివృద్ధి కోసం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వివిధ వ్యాపారాల్లో శిక్షణనిచ్చి ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా ఆసక్తి ఉన్న మహిళా సంఘాలకు సంచార చేపల విక్రయ వాహనాలను సమకూర్చబోతోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క సూచనతో జిల్లాకు ఒకటిచొప్పున ఎస్‌హెచ్‌జీలకు మొదటి విడత అందించేందుకు 32 వాహనాలను తయారు చేయించారు. రూ.10లక్షల విలువైన ఒక్కో వాహనాన్ని ప్రధానమంత్రి మత్స్య యోజన పథకంతో అనుసంధానం చేసి 60శాతం సబ్సిడీతో రూ.4లక్షలకే మహిళా సంఘాలకు కేటాయించనున్నారు. ఈ మొత్తాన్ని వడ్డీలేని రుణ పథకం కింద బ్యాంకుల ద్వారా ఇప్పించనున్నారు. సంచార వాహనాలతో చేపల విక్రయంతోపాటు చేపల వంటకాల తయారీపై మహిళా సంఘాలకు ఇప్పటికే శిక్షణ ఇప్పించామని, దీంతో వారు రెండు రకాలుగా ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉంటుందని సెర్ప్ ప్రతినిధులు పేర్కొన్నారు. జనవరి 3న ఈ 32 వాహనాలను మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వారు వెల్లడించారు.

విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా సమ్మె విరమించండి

- సర్వ శిక్ష ఉద్యోగులకు మంత్రులు పొన్నం, సీతక్క సూచన





హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా సర్వ శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయులు చేస్తున్న సమ్మెను విరమించుకోవాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క సూచించారు. సమ్మెను విరమించుకుంటే... వారి ఇబ్బందులను ప్రభుత్వం పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. గత 25 రోజులుగా వీరు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై సోమవారం అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు చర్చించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే సమ్మెను విరమించాలని సూచించారు. సమ్మె చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని కేజీబీవీ పాఠశాలల్లో బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుతున్నారని గుర్తుచేశారు. తాము సుదీర్ఘ కాలంగా కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో పని చేస్తున్నామని, తమని రెగ్యులరైజ్ చేయడం లేదా ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ అమలుచేయాలని సర్వ శిక్ష ఉద్యోగులు ఈ సందర్భంగా మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. సర్వ శిక్ష కస్తూర్బా గాంధీ పాఠశాలలు కేంద్రం పరిధిలో 60 శాతం, రాష్ట్రం పరిధిలో 40 శాతం ఉంటాయని, ఈ విషయాన్ని ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు మంత్రి పొన్నం ఈ సందర్భంగా తెలిపారు.

హౌజింగ్ భూములపై భట్టితో ఎమ్మెల్యేల భేటీ!

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్, ఐపీఎస్, జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాల అంశంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సోమవారం అసెంబ్లీ సమావేశం వాయిదా పడ్డ అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు లాబీలోని భట్టి చాంబర్‌లో భేటీ అయ్యి చర్చించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్, జర్నలిస్టులకు గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాలను కేటాయించిన విషయం తెలిసిందే. అయితే.. ఈ కేటాయింపులు చెల్లవంటూ ఈ మధ్య సుప్రీం కోర్టు తీర్పును వెల్లడించింది. దాంతో ఈ అంశంపై భవిష్యత్తు ప్రణాళిక ఏమిటనే అంశంపై ఉపముఖ్యమంత్రితో భేటీ సందర్భంగా చర్చ జరిగినట్లు సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల తుది ఓటరు జాబితా విడుదల

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో ఎన్నికలు జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించిన తుది ఓటరు జాబితా విడుదలైంది. ఈ మేరకు సోమవారం ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి.సదర్శన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ, అదే జిల్లాలకు సంబంధించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలతోపాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి ఓటరు జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. అందులో మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో పురుషులు 2,18,060 మహిళలు 1,23,250, థర్డ్‌జెండర్ ఓటర్లు 9కలిపి మొత్తం 3,41,319 మంది ఉన్నారు. అదేవిధంగా మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో పురుషులు 16,364, మహిళలు 9,557 కలిపి మొత్తం 25,921 మంది ఉన్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో పురుషులు 14,940, మహిళలు 9,965 కలిపి మొత్తం 24,905 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

10 మంది ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2021, 2022 బ్యాచ్ యువ ఐపీఎస్‌లు పదిమందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా గ్రేహౌండ్స్‌లో ఏఎస్పీలుగా ఇంతకాలం విధులు నిర్వర్తించారు. వీరిలో కాజల్‌ను ఉట్నూరుకు, కె.రాహుల్ రెడ్డిని రాచకొండ పరిధిలోని భువనగిరికి, ఎస్.చిత్తరంజన్‌ను ఆసిఫాబాద్‌కు, బి.చైతన్య రెడ్డిని కామారెడ్డికి, పందెర చేతన్ నితిన్‌ను జనగామకు, విక్రాంత్ కుమార్ సింగ్‌ను భద్రాచలానికి, ఎస్.శుభం ప్రకాశ్‌ను కరీంనగర్‌కు, రాజేశ్ మీనను నిర్మల్‌కు, పి.మౌనికను దేవరకొండకు బదిలీ చేశారు. భద్రాచలం ఏఎస్పీగా ఉన్న అంకిత్ కుమార్ సంఖ్వార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ వైపు వెళ్తున్న బలగాలు

తెలంగాణలో నక్సల్స్ కదలికలు?

- చర్ల మీదుగా రాష్ట్రంలోకి కేంద్ర బలగాలు
- 2 వేల మంది జవాన్ల కూంబింగ్
- సమాచారం లేదంటున్న స్థానిక పోలీసులు
- అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం

చర్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్‌లో కేంద్ర బలగాల క్యాంపుల ఏర్పాటుతో మావోయిస్టులు ఇప్పుడు తెలంగాణను సేఫ్‌జోన్‌గా మార్చుకుంటున్నారా? 2026కల్లా ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని అంతం చేస్తామని కేంద్రం హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలో.. ఎన్‌కౌంటర్లు పెరగడం, నక్సల్స్ వైపు నష్టం తీవ్రంగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారా? అందుకే.. తెలంగాణ సరిహద్దుల్లో.. ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న కొండపల్లి, జీడిపల్లి సీఆర్‌పీఎఫ్ క్యాంపులపై అడపాదడపా నక్సల్స్ దాడులు జరుగుతున్నాయా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిణామాలు ఔననే సమాధానం చెబుతున్నాయి. ఇంటిలిజెన్స్ సమాచారంతో కేంద్ర బలగాలు ఇప్పుడు తెలంగాణ అడవులను జల్లెడపడుతున్నాయి.

క్రాస్‌బార్డర్ ఆపరేషన్?

సాధారణంగా రాష్ట్ర పోలీసులకు సరిహద్దుల నిబంధన ఉంటుంది. అయితే.. ప్రత్యేక సందర్భాల్లో మాత్రం 'క్రాస్ బార్డర్ ఆపరేషన్ల'ను నిర్వహిస్తుంటాయి. గతంలో తెలంగాణ పోలీసులు ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్లు నిర్వహించిన దాఖలాలున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం కేంద్ర బలగాలతోపాటు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బస్తర్ ఫైటర్స్, డీఆర్జీ, ఎస్‌టీఎఫ్, మహిళా కమాండోలు సుమారు 2 వేల మంది సోమవారం ఉదయం చర్ల మీదుగా తెలంగాణ అడవుల్లోకి ప్రవేశించారు. ఈ బలగాల రాక సాధారణం కాదని, ప్రత్యేక ఆపరేషన్ కోసమే సరిహద్దులను దాటారని ఛత్తీస్‌గఢ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశంపై చర్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజువర్మను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. "కేంద్ర బలగాల రాకపై మాకు ఎలాంటి సమాచారం లేదు" అని చెప్పారు. వేల మంది జవాన్లు ఒకేసారి తెలంగాణలోకి రావడంతో.. స్థానికులు ఏం జరుగుతోందో తెలియక భయాందోళనలకు గురవుతున్నారు.

యువ ఐపీఎస్‌ల బదిలీ అందుకేనా?


తెలంగాణలో నక్సల్స్ కదలికలపై రాష్ట్ర పోలీసులకు కూడా సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఉన్నపళంగా యువ ఐపీఎస్‌లను సరిహద్దు జిల్లాలు, గతంలో మావోయిస్టుల ప్రభావం ఉన్న జిల్లాలకు బదిలీ చేసినట్లు సమాచారం. కమాండర్లుగా వీరంతా గ్రేహౌండ్స్‌లో కఠోర శిక్షణ పొందినట్లు స్పష్టమవుతోంది.

స్కిల్స్ వర్సిటీ.. అద్భుత ఆలోచన!

ఇది తెలంగాణను మరో స్థాయికి తీసుకెళ్తుంది.. నైపుణ్యాలు, మౌలిక వసతులతోనే ఆర్థికాభివృద్ధి

- ప్రభుత్వ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యులవుతాం
- సీఎంతో మైక్రోసాఫ్ట్ చైర్మన్ సత్య నాదెళ్ల

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): "ప్రస్తుత, భవిష్యత్తు పారిశ్రామిక అవసరాలకు సరిపడా నైపుణ్యాలను సాధించడంపైనే యువత ఉపాధి అవకాశాలు ఆధారపడి ఉంటాయి. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలపైనే ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. అందుకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆకట్టుకున్నాయి" అని మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల అన్నారు. హైదరాబాద్ వచ్చిన సత్య నాదెళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌లు ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సత్య నాదెళ్లతో గంటకు పైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీతోపాటు నగరంలో 200 ఎకరాల్లో నిర్మించబోయే ఏఐ సిటీ, ప్రభుత్వ శాఖల్లో ఏఐ సాంకేతికత, ఈ రంగంలో ఉపాధి అవకాశాలపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఐటీ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యం, నగరంలో ఏర్పాటవుతున్న అంతర్జాతీయ ఐటీ కంపెనీల వివరాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను సత్య నాదెళ్ల ప్రశంసించారు. ఉపాధి అవకాశాలు పెంచడంలో స్కిల్స్ వర్సిటీ తెలంగాణను మరోస్థాయికి తీసుకెళ్తుందన్నారు. పరిశ్రమల భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేయడం అద్భుతమైన ఆలోచన అని కొనియాడారు. స్కిల్స్ వర్సిటీతో పాటు యువత నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్ సహకారం ఉంటుందని సత్య నాదెళ్ల సీఎం రేవంత్‌రెడ్డికి హామీ ఇచ్చారు. నైపుణ్యాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ 50 నగరాల్లో ఒకటిగా నిలుపుతాయని అభిప్రాయపడ్డారు.



సత్య నాదెళ్లను ఆయన ఇంట్లో కలిసిన సీఎం రేవంత్, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్

ఏఐ, జెన్ ఏఐ, క్లౌడ్ రంగాల్లో సహకరించండి: సీఎం రేవంత్

హైదరాబాద్‌లో ఏర్పాటైన తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని, ప్రస్తుతం నగరంలో 10 వేల మందికి పైగా ఉపాధి కల్పిస్తోందని సీఎం రేవంత్ అన్నారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పెట్టుబడులను విస్తరిస్తున్నందుకు సత్య నాదెళ్లకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏఐ, జెన్ (జెనరేటివ్) ఏఐ, క్లౌడ్ రంగాలను ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోందని, దీనికి మైక్రోసాఫ్ట్ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. నగరంలోని మేకగూడ, షాద్‌నగర్, చందన్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ మూడు డేటా సెంటర్లను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇవి కొన్ని నెలల్లో అందుబాటులోకి రానున్నాయి. దీనిపైనా సమావేశంలో చర్చ జరిగింది. త్వరగా వీటి నిర్మాణ పనులను పూర్తి చేస్తామని సత్య నాదెళ్ల అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణకు అత్యాధునిక సాంకేతికత

త్వరలోనే పూర్తిస్థాయిలో సిబ్బంది.. పరికరాల కొనుగోలు

- 2024లో సహాయం కోసం అగ్నిమాపక శాఖకు 7,383 కాల్స్
- 2023తో పోలిస్తే రాష్ట్రంలో స్వల్పంగా తగ్గిన అగ్నిప్రమాదాలు
- తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక విభాగం డీజీ నాగిరెడ్డి
- 2024కు సంబంధించి అగ్నిమాపకశాఖ నివేదిక విడుదల



అగ్నిమాపక శాఖ పరికరాలను పరిశీలిస్తున్న నాగిరెడ్డి

హైదరాబాద్/రాయదుర్గం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణకు, ప్రమాదాల సమయంలో నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించేందుకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను సమకూర్చుకోబోతున్నట్లు రాష్ట్ర అగ్నిమాపక విభాగం డీజీ నాగిరెడ్డి తెలిపారు. 2024 సంవత్సరంలో అగ్నిమాపక శాఖ నిర్వహించిన కార్యక్రమాలు, విజయాలపై వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఫైర్ సర్వీస్ యాక్ట్-1999ను సవరించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. 2023తో పోలిస్తే ఈ సంవత్సరం అగ్నిప్రమాదాల సంఖ్యలో 0.23% తగ్గుదల నమోదైందన్నారు. సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్, నాంపల్లి బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్నిప్రమాదాల్లో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని నాగిరెడ్డి వెల్లడించారు. కాగా, ఈ ఏడాదిలో వేర్వేరు ప్రమాదాల్లో 435 మృతదేహాలను వెలికితీశామని నాగిరెడ్డి చెప్పారు.

1,360 మందికి శిక్షణ

అగ్నిమాపక శిక్షణా కేంద్రంలో ఈ ఏడాది మొత్తం 1,360 మందికి శిక్షణ అందించామని నాగిరెడ్డి వెల్లడించారు. అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులకు సంబంధించిన దరఖాస్తులను గరిష్ఠంగా 15 రోజుల్లో పరిష్కరిస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో 7,383 ఫైర్ కాల్స్‌కు హాజరైనట్లు వెల్లడించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఫైర్ కాల్స్ 5.9% పెరిగాయన్నారు. ఖమ్మంలో వరదల్లో రాత్రి సమయాల్లోనూ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి 880 మందిని కాపాడామని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎస్‌డీఆర్ఎఫ్) ఏర్పాటు చేశామన్నారు. వ్యాపార సముదాయాలతో పాటు బహుళ అంతస్తుల భవనాల నుంచి అగ్నిమాపక శాఖకు పన్ను రూపంలో ప్రస్తుతం చదరపు మీటరుకు ఒక్క రూపాయి చెల్లిస్తున్నారని నాగిరెడ్డి తెలిపారు. ఫైర్ సేఫ్టీ అవసరాలకు తగ్గట్లుగా పన్నును పెంచుతామని చెప్పారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు తగిన యంత్రపరికరాలను, రెస్క్యూ పరికరాలు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు.

వారానికి 4 సిఫారసు లేఖలు

(మొదటి పేజీ తరువాయి)

సామాన్య భక్తులకు సౌకర్యం, సులభ దర్శనం కల్పించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి వారంలో ఏదైనా రెండు రోజుల్లో (సోమవారం నుంచి గురువారం వరకు) వీఐపీ దర్శనం (రూ.500 టికెట్) కోసం రెండు లేఖలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 టికెట్) కోసం రెండు లేఖల చొప్పున అనుమతిస్తామని తెలిపారు. ప్రతి లేఖలో ఆరుగురు వరకు భక్తులను దర్శనానికి సిఫారసు చేయవచ్చని పేర్కొన్నారు. చంద్రబాబుకు రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారని తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. చంద్రబాబు నిర్ణయంపై తెలంగాణ నాయకులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఏపీ సీఎం నిర్ణయంతో తెలంగాణ భక్తులకు వేంకటేశ్వరస్వామి దర్శనం మరింత సులభమవుతుందని ప్రసాద్‌కుమార్ అన్నారు. ఇది తెలంగాణ భక్తులకు నూతన సంవత్సర కానుకగా కొండా సురేఖ అభివర్ణించారు. కాగా, సోమవారం అమరావతి సచివాలయంలో చంద్రబాబుతో బీఆర్ నాయుడు భేటీ అయి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల అంశంపై చర్చించారు.

డ్రగ్స్ సరఫరాదారులపై మెరుపు దాడి

- మాదాపూర్‌లో భేటీ సమాచారంతో రంగంలోకి టీజీన్యాబ్
- 8 మంది గంజాయి, కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణ

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగించకుండా కఠిన చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం ఆ దిశగా ప్రత్యేక దాడులు నిర్వహిస్తోంది. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్), సైబరాబాద్ పోలీసులు ఆదివారం రాత్రి నగరంలోని పలు పబ్‌లు, బార్లతోపాటు వివిధ ప్రాంతాల్లో మెరుపు దాడులు చేశారు. డ్రగ్స్ వినియోగదారులు, సరఫరాదారులు మాదాపూర్‌లో సమావేశం కానున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ మెరుపు దాడిలో 14 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. 8 మంది గంజా, కొకైన్ లాంటి మాదకద్రవ్యాలు వినియోగించినట్టు తేలిందని అధికారులు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని టీజీన్యాబ్ సూచించింది. డ్రగ్స్ సరఫరాదారులు, వినియోగదారులపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

సైబర్ నేరగాళ్ల నుంచి పిల్లల్ని రక్షించేందుకు 'బుక్‌లెట్'

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు తెలంగాణ పోలీసులు ప్రత్యేక బుక్‌లెట్ విడుదల చేశారు. యువతకు సైబర్ భద్రతను అందించేందుకు ఈ బుక్‌లెట్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. మొబైళ్లు, కంప్యూటర్లు ఎలా పని చేస్తాయి? వాటిలోకి సైబర్ మోసాలకు పాల్పడే వారు చొరబడకుండా.. వాటి బారిన పిల్లలు పడకుండా ఎలా చూడాలో ఈ కరదీపికలో వివరించారు. పిల్లల వయస్సుకు తగినట్లు మార్గదర్శకాలు రూపొందించారు. మొబైల్స్, కంప్యూటర్లు నిర్దిత సమయంలోనే వినియోగించుకునేలా చూడడం, పిల్లలు తమకు ఎదురైన అనుభవాలను ధైర్యంగా తెలియజేసేలా ఇందులో అంశాలు పొందుపర్చారు. ఈ విషయంలో మరిన్ని వివరాలకు https://tgcsb.tspolice.gov.in/ వెబ్‌సైట్‌లో లేదా హెల్ప్‌లైన్ నెంబరు 1930కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

స్టేషన్‌కు పిలిపించారనే మనస్తాపంతో..
ఉరివేసుకొని యువకుడి బలవన్మరణం



సాయిచరణ్ (ఫైల్)

నేరడిగొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసులు స్టేషన్‌కు పిలిపించారనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బుద్దికొండ గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన సింగం సాయిచరణ్ (23) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 25న గ్రామ శివారులో గల పోచమ్మ ఆలయం వద్ద జరిగిన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకకు హాజరయ్యాడు. మద్యం మత్తులో అక్కడే ఉన్న హైమాస్ట్ లైట్‌లను సాయిచరణ్ అతడి స్నేహితులు పగలగొట్టారు. దీనిపై గ్రామపెద్దలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై ఎస్సై శ్రీకాంత్ రెండ్రోజుల క్రితం సదరు యువకులను పిలిపించి లైట్లు ఎందుకు పగలగొట్టారని విచారించారు. పగలగొట్టిన లైట్లను ఏర్పాటు చేయిస్తామని యువకులు ఒప్పుకోవడంతో.. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని ఎస్సై వారిని హెచ్చరించాడు. అయితే పోలీసులు స్టేషన్‌కు పిలిపించడంతో సాయిచరణ్ తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. గత ఆదివారం అర్ధరాత్రి పనిమీద బయటకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సోమవారం బుద్దికొండ గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో మృతదేహం లభ్యమైంది. తన కొడుకు మృతికి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు కారణమని ఆరోపిస్తూ సాయిచరణ్ కుటుంబీకులు సోమవారం గ్రామంలో ఆందోళన చేశారు. తన కొడుకును పోలీసు స్టేషన్‌కు పిలిపించడం వల్లే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు.

ఇళ్ల సర్వేలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఘర్షణ

- నలుగురికి తీవ్రగాయాలు.. వికారాబాద్ జిల్లాలో ఘటన

దోమ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ఘర్షణ చెలరేగి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వికారాబాద్ జిల్లా దోమ మండలంలోని గుండాల తండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. సోమవారం తండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సందర్భంగా.. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలంటూ కాంగ్రెస్‌కు చెందిన నాయకులు అధికారులకు అడ్డుపడ్డారు. దీంతో బీఆర్ఎస్ నేతలు జోక్యం చేసుకొని కాంగ్రెస్ నేతలను అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి కర్రలతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఘటనలో చందర్, సురేశ్, రవి, దేవమ్మ, మాణిక్‌నాయక్ తదితరులు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. బాధితుడు మాణిక్‌నాయక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ కుమార్ తెలిపారు.

పాఠశాల భవనంపై నుంచి దూకి
గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- గతనెల 9న ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాగా చదవమని ప్రోత్సహించాల్సిన గురువే నీకు చదువు రాదంటూ హేళనగా మాట్లాడడంతో ఓ గురుకుల విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం చెర్లపటేల్‌గూడలోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో గతనెల 9న జరిగిన ఈ ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదార్‌పల్లికి చెందిన గడ్డ నాగరాజు కూతురు లావణ్య చెర్లపటేల్‌గూడలో గురుకుల బాలికల పాఠశాలలో పదవ తరతగతి చదువుతోంది. 'నీకు చదువు రాదు.. చదివి దండగ' అని లావణ్యను పాఠశాలలో ఓ గురువు హేళన చేయడంతో మనస్తాపానికి గురై గత నెల 9వ తేదీ తెల్లవారుజామున పాఠశాల భవనం ఒకటో అంతస్తు నుచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిందని ఆమె తండ్రి చెప్పారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స అనంతరం అదేనెల 25న లావణ్యను ఇంటికి తీసుకెళ్లారు. ప్రస్తుతం తన కూతురు ఇంట్లో కదల్లేని పరిస్థితిలో ఉందని, టీచర్ తిట్టడం వల్లే ఇలాంటి దుస్థితి వచ్చిందని అన్నారు. సదరు టీచర్‌పై చర్యలు తీసుకోవాలని రెండు రోజుల క్రితం లావణ్య తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది.

బడిలో బోరు నీరే దిక్కు!

(మొదటి పేజీ తరువాయి)

లేదు. మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. విద్యార్థులు బోరు నీళ్లు తాగాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల గురుకులాల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సైతం నీటి స్వచ్ఛతపై అనుమానాలు వ్యక్తం చేశారు. చాలా గురుకులాలకు మిషన్ భగీరథ కనెక్షన్లు లేవని ఓ సమావేశంలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలకు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఇచ్చారా? వాటి ద్వారా నీరు అందుతుందా? లేదా? వంటి అంశాలపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. చాలా పాఠశాలలకు నల్లా కనెక్షన్లు లేకపోవడం, ఉన్న వాటి ద్వారా నీళ్లు రాకపోవడం, అపరిశుభ్ర ట్యాంకులు, బోరు నీటినే వినియోగించడం..ఇలా అనేక సమస్యలను గుర్తించింది.

జిల్లాల వారీగా ఇదీ పరిస్థితి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో 2237 ప్రభుత్వ పాఠశాలలుండగా.. 1307 పాఠశాలలకు మిషన్ భగీరథ పైప్‌లైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మిగతా 930 పాఠశాలల్లో మాత్రం స్థానిక నల్లా కనెక్షన్లు, బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ముఖ్యంగా కామారెడ్డి జిల్లా పరిధిలో 728 పాఠశాలలకు మిషన్ భగీరథ కనెక్షన్లు లేవు. ఇక, ఉమ్మడి జిల్లా పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు కలిపి 77వరకు ఉన్నాయి. వీటిలో 42 గురుకులాలకు ప్రభుత్వ భవనాలు ఉండగా.. మిషన్ భగీరథ కనెక్షన్లతోపాటు ఆర్వో ప్లాంట్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు మాత్రం స్థానిక నల్లాల ద్వారా లేదా బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తాగు నీటి కోసం ఎక్కువగా మినరల్ వాటర్‌ను వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 105 వసతి గృహాలు ఉండగా.. 50 చోట్ల తాగునీటి సమస్య లేదు. మిషన్ భగీరథ, మున్సిపాలిటీల పరిధిలోని నల్లాల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. మిగతా వసతి గృహాల్లో బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తరుచూ కలుషిత ఆహారం తిని విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు ఆహారంతో పాటు తాగు నీరూ కారణమేనన్న వాదన వినిపిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో 271 ఉన్నత పాఠశాలలు, 50 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 14కస్తూర్బా గాంధీ గురుకులాలు, 7 మోడల్ స్కూళ్లు, 2తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకులాలు, 12 ఎస్సీ గురుకులాలు, 23 ఎస్టీ గురుకులాలు, బీసీ గురుకులాలు 2 ఉన్నాయి. అయితే, చాలా పాఠశాలల్లో ప్రహరీ వరకే మిషన్ భగీరథ పైపులైన్లు వేసి.. చేతులు దులుపుకొన్నారు. మన ఊరు - మన బడి పథకం కింద పాఠశాలల్లో సంపులను నిర్మించినా.. నల్లా కనెక్షన్ ఇవ్వక పోవడంతో నిరుపయోగంగానే కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల కనెక్షన్లు ఇచ్చినా.. సక్రమంగా బ్లీచింగ్ చేయకపోవడంతో నాచు పెరిగిపోయి అధ్వానంగా ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో 15 ఆశ్రమ పాఠశాలలు, 15 కేజీబీవీ పాఠశాలలు, 3 సోషల్ వెల్ఫేర్ గురుకులాలు, 2 ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు, 35 పాఠశాలలకు మాత్రమే భగీరథ నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ఆసిఫాబాద్ జిల్లాలో 73 గురుకులాలు, 44గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలు, 29 సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. గురుకులాల్లో ఎక్కడా మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్లు లేవని విద్యార్థులు చెబుతున్నారు. చాలా చోట్ల బోర్ నీటినే విద్యార్థులు తాగుతుండగా.. కొన్ని చోట్ల వాటర్ క్యాన్లు తెప్పిస్తున్నారు.



నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహం



బోధన్‌లోని బీసీ హాస్టల్‌కు మిషన్ భగీరథ కనెక్షన్

అపరిశుభ్రంగా వాటర్ ట్యాంకులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మోడల్ స్కూళ్లు, కేజీబీవీ స్కూళ్లు, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్, గురుకులాలు, పీఎస్, యూపీఎస్, జడ్పీహెచ్ఎస్‌లు కలిపి మొత్తం 3,092 ఉన్నాయి. వీటిలో 95 శాతం విద్యా సంస్థలకు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఇచ్చారు. వికారాబాద్ పరిధిలోని జెడ్పీ బాలుర ఉన్న పాఠశాల, బూర్గులపల్లి పాత కలెక్టరేట్‌లో కొనసాగుతున్న ఎస్సీ బాలికల గురుకులం, అనంతగిరిపల్లిలోని ఎస్సీ బాలుర గురుకులం, అనంతగిరిపల్లి జడ్పీహెచ్ఎస్, డైట్ సమీపంలోని ఎస్సీ-1 , బీసీ వసతి గృహాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. రంగారెడ్డి జిల్లాలోని కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లోని పాఠశాలలకు భగీరథనీరు సరఫరా అవుతున్నప్పటికీ.. ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 1,216 పాఠశాలలు ఉండగా.. 100కుపైగా పాఠశాలలకు మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వలేదు. కొన్ని చోట్ల బోరు వాటర్‌నే విద్యార్థులు తాగుతున్నారు. గురుకులాల్లో ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి నీరు తెప్పిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 1,067 పాఠశాలలు ఉండగా 60 పాఠశాలల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు లేవు. దీంతో బోరు నీటినే వినియోగిస్తున్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగంలో 53 గురుకుల పాఠశాలలు, రెండు కాలేజీలున్నాయి. వీటిలో పక్కా భవనాలు ఉన్న వాటికి మాత్రమే మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో బోరు నీటిని వినియోగిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 3,309 ప్రభుత్వ పాఠశాలలు, 282 వివిధ సంక్షేమ, గురుకుల హాస్టళ్లు, 67 కేజీబీవీలు, 35 మోడల్ స్కూళ్లు ఉండగా.. అన్నింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2617 పాఠశాలలు, 56 కేజీబీవీలు, 97 గురుకుల పాఠశాలలు, 184 వసతి గృహాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. వంటలు చేసేందుకు ఆ నీటినే వినియోగిస్తున్నారు.



నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని బీసీ గర్ల్స్ హాస్టల్‌లో ఆర్వో ప్లాంటు నీటిని తాగుతున్న విద్యార్థినులు

అస్తవ్యస్తంగా పైపులైన్ల నిర్మాణం

మెదక్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 897, వసతి గృహాలు 54, గురుకులాలు 23, కేజీబీవీ 19, మోడల్ స్కూల్స్ 7 ఉన్నాయి. అయితే, ప్రభుత్వ పాఠశాలలకు కాంట్రాక్టర్లు అస్తవ్యస్తంగా పైపులైన్లు ఏర్పాటు చేయడం, నల్లా కనెక్షన్లు ఇచ్చినా లీకేజీల కారణంగా నీరు సరఫరా కావడం లేదు. చేతి పంపులు, బోర్లు, ఇతర చోట్ల నుంచి నీటిని అందించాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని చోట్ల నల్లా నీళ్ల ఉదయమే వస్తుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు వచ్చేలోగానే సరఫరా నిలిచిపోతోంది. దాంతో చాలా పాఠశాలల్లో భగీరథ నీటిని వాడడం లేదు. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలన్నింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 3225 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 444 పాఠశాలల్లో నల్లా కనెక్షన్లు లేవు. భగీరథ నీరు కూడా రంగుమారి వస్తుండడంతో విద్యార్థులు తాగేందుకు ఇష్టపడడం లేదు.

నిర్వహణ లోపాల వల్లే ఇబ్బందులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,204 ప్రభుత్వ పాఠశాలలు, 288 సంక్షేమ హాస్టళ్లు, 196 గురుకులాల ఉండగా.. అన్నింటికీ మిషన్‌భగీరథ నీటి కనెక్షన్లు అధికారికంగా ఇచ్చారు. కానీ నిర్వహణ లోపాలతో చాలా చోట్ల భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ప్రధానంగా హాస్టళ్లలో ఈ సమస్య ఉంది. ఉమ్మడి జిల్లాలోని సగానికిపైగా హాస్టళ్లకు భగీరథ నీరు అందడం లేదు. పాఠశాలల్లోనూ భగీరథ నీటి సరఫరాలో లోపాలున్నాయి. అయితే స్కూళ్లలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు ఉండడంతో తాగునీటి సమస్య తలెత్తడం లేదు. గురుకులాల్లో బోరు బావుల నీటిని ఆర్వో ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసి వినియోగిస్తున్నారు. నల్లగొండ జిల్లా ఉరుమడ్ల బీసీ హాస్టల్‌కు మిషన్‌భగీరథ కనెక్షన్ లేదు. స్థానికంగా ఉన్న బోరుబావి నీటిని వాడుతున్నారు. దేవరకొండ, చందంపేట మండలాల్లోని హాస్టళ్లకు మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వపోవడంతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని బోరు నీటిని శుద్ధి చేస్తున్నారు. శాలిగౌరారం జడ్పీ హైస్కూల్, మాదారం ఎస్సీకాలనీ, అడ్డూరు, జంగాలవారిగూడెం ప్రైమరీ స్కూళ్లకు మిషన్‌భగీరథ కనెక్షన్లు లేవు. భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ఏడు పాఠశాలలకు నల్లా కనెక్షన్లు లేవు.

న్యూ ఇయర్ వేడుకలు..
ఓఆర్ఆర్‌పై నో ఎంట్రీ

- పీవీఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పైన కూడా..
- ఎయిర్ టికెట్లు ఉన్నవారికే అనుమతి
- హైదరాబాద్‌లో ఫ్లైఓవర్లు బంద్
- నెక్లెస్‌రోడ్, ట్యాంక్‌బండ్‌పైనా నోఎంట్రీ
- తాగి పట్టుబడితే.. రూ.10 వేల జరిమానా, జైలు శిక్ష
- రెండోసారి డ్రంకెన్‌డ్రైవ్‌కు రూ.15 వేలు, ఏడాది జైలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్), పీవీఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాలను అనుమతించబోమని పోలీసులు వెల్లడించారు. విమాన ప్రయాణికులు మాత్రం టికెట్‌ను చూపించి, ఔటర్‌పై వెళ్లొచ్చని స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి 10 నుంచి బుధవారం ఉదయం 5 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఇక హైదరాబాద్‌లోని బేగంపేట, లంగర్‌హౌస్ ఫ్లైఓవర్లు మినహా.. మిగతా వాటిని మూసివేస్తామని సిటీ పోలీసులు తెలిపారు. ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్, మింట్‌కాంపౌండ్ రోడ్డు, అప్పర్ ట్యాంక్‌బండ్‌పైనా రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు వాహనాలకు అనుమతి ఉండదన్నారు. ట్రాఫిక్ రద్దీని బట్టి ఎల్‌బీనగర్-మందమల్లమ్మ ఫ్లైఓవర్‌ను తెరుస్తామని రాచకొండ పోలీసులు వివరించారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు కచ్చితంగా యూనిఫారాలను ధరించాలని, లేనిపక్షంలో రూ.500 జరిమానా విధిస్తారని పోలీసులు తెలిపారు. మూడు కమిషనరేటర్ల పరిధుల్లో ఎక్కడికక్కడ డ్రంకెన్‌డ్రైవ్‌లు ఉంటాయని, మద్యం సేవించి పట్టుబడేవారు మొదటిసారి నేరం చేసినట్లయితే.. రూ.10వేల జరిమానా, జైలుశిక్ష ఉంటుందని.. రెండోసారి పట్టుబడితే రూ.15 వేల జరిమానా, ఆర్నెల్ల నుంచి ఏడాది వరకు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. రాంగ్‌రూట్, ఓవర్‌స్పీడ్, సిగ్నల్ జంపింగ్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ నిబంధనలపైనా స్పెషల్ డ్రైవ్‌లు ఉంటాయన్నారు. కాగా.. డిసెంబరు 31ని పురస్కరించుకుని హైదరాబాద్ మెట్రోరైల్ సేవలను అర్ధరాత్రి 1.15 వరకు కొనసాగిస్తామని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

చోరీ ఎత్తు.. మత్తులో చిత్తు!

- మద్యం షాపులో దొంగతనానికి వెళ్లి తాగేసి పడుకున్న దొంగ
- యజమాని ఫిర్యాదుతో అరెస్టు

చేగుంట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి చాకచాక్యంగా వైన్ షాపులో దూరిన ఓ దొంగ.. తెలివిగా సీసీ కెమెరాలను ఆఫ్ చేశాడు. దొరికిన కాడికి కౌంటర్‌లో నగదును సర్దేసుకున్నాడు. తిరిగి వెళ్దామనుకునే సరికి.. మద్యం బాటిళ్లను చూసి ఏమరిచిపోయాడు.. ఇంకేముంది.. ఫుల్లుగా తాగేసి అక్కడే పడుకుండిపోయాడు. ఉదయం యజమాని వచ్చి చూసి పోలీసులకు సమాచారమివ్వగా, వారు వచ్చి అరెస్ట్ చేశారు. మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలోని కనకదుర్గ వైన్స్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి షాపును మూసేసి యజమాని ఇంటికి వెళ్లగానే.. కాచుకొని కూర్చున్న దొంగ పైకప్పు రేకులను కోసేసి షాపులోకి దిగాడు. అక్కడున్న డబ్బులను సర్దుకుని పెట్టుకున్నాడు. మద్యం బాటిళ్లు కనపడగానే మనసొప్పక ఫుల్‌గా తాగి మత్తులో నిద్రపోయాడు. యజమాని రోజూలాగే ఉదయం వైన్స్ తెరవగా, లోపల దొంగ పడుకుని కనిపించాడు. పక్కనే డబ్బులు ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. నార్సింగి ఎస్సై అహ్మద్ మొహినొద్దీన్ సిబ్బందితో వచ్చి దొంగను అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో స్పృహ కోల్పోయి ఉన్న అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.